
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తాడేపల్లిగూడెం : fb.com/vaartha Digital

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Rajahmundry, Srikakulam

7-3-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 35 పేజీలు: 8+4 వెల: 6.50


మధ్యప్రాచ్య దేశాలకు విమాన సేవలు పునరుద్ధరణ

నేపాల్‌లో ఆర్‌ఎస్‌పి ప్రభంజనం 5లో

### టాప్-100లో తెలుగువారు ఒక్కరే..

# సివిల్స్‌లో 958 మంది ఎంపిక

### టాపర్‌గా రాజస్థాన్‌కు చెందిన అనూజ్ అగ్నిహోత్రి

### 55వ ర్యాంక్ సాధించిన గూడెల్లి సృజన

### 2025 ఫలితాలు ప్రకటించిన యుపిఎస్‌సి


1-అనూజ్ అగ్నిహోత్రి


2-రాజేశ్వరి సువే


3-ఆకాన్ష్ ధుల్


55-గూడెల్లి సృజన

**విజయవాడ, ప్రభాతవార్త, మార్చి 6:** అఖిల భారత సర్వీసులైన ఐఎఎస్, ఐపీఎస్, ఐఎఫ్‌ఎస్ ఉద్యోగాల భర్తీకి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యుపిఎస్‌సి) నిర్వహించే సివిల్స్ సర్వీసెస్-2025 పరీక్ష తుది ఫలితాలు విడుదలయ్యాయి. 1087 పోస్టులకు పరీక్షలను నిర్వహించగా 958మందిని ఎంపిక చేశారు. అర్హులైన వారు లేకపోవడంతో మరో 129 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయలేదు. సివిల్స్‌లో టాపర్‌గా రాజస్థాన్‌కు చెందిన అనూజ్ అగ్నిహోత్రి నిలిచారు. ఇతను మెడికల్ విద్యార్థి కావడం విశేషం. సివిల్స్-2025లో ఏపీ, తెలంగాణకు చెందిన పలువురు తెలుగు వారు కూడా సివిల్స్‌లో ర్యాంకులు సాధించారు. సివిల్స్-2025 ఫలితాలను యుపిఎస్‌సి శుక్రవారం విడుదల చేసింది. అనూజ్ అగ్నిహోత్రి మొదటి ర్యాంకు సాధించగా, రాజేశ్వరి సువే రెండో ర్యాంక్, ఆకాన్ష్ ధుల్ 3వ ర్యాంక్, రాఘవ్ ఝున్‌ఝున్ వాలా 4వ ర్యాంక్, ఇషాన్ భట్నాగర్ 5వ ర్యాంక్ సాధించారు. ఆలిండియా టాపర్ అనూజ్ అగ్నిహోత్రి రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ జిల్లా రహతా గ్రామానికి చెందిన యువకుడు. జోధ్‌పూర్ >>2

### 13యేళ్ల లోపు పిల్లలకు

# సోషల్ మీడియా నిషేధం!

### అసెంబ్లీలో నిర్ణయం ప్రకటించిన సిఎం చంద్రబాబు

### కర్ణాటకలో 16యేళ్ల పిల్లలదాకా నిషేధం విధింపు

### ఆ విషయం కూడా పరిశీలిస్తామని సిఎం వెల్లడి



**విజయవాడ,మార్చి 6,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో 13 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియాను బ్యాన్ చేయాలనే విషయం ప్రభుత్వం పరిశీలిస్తున్నదని సీఎం చంద్రబాబు అసెంబ్లీలో తెలిపారు. ఇప్పటికే కర్ణాటక సీఎం సిద్ధరామయ్య తమ రాష్ట్రంలోని 16 ఏళ్లలోపు పిల్లల సోషల్ మీడియా వాడకంపై నిషేధం విధిస్తున్నట్లు తాజాగా వెల్లడించారు. పిల్లలు మొబైల్ ఫోన్ వ్యసనం బారినపడకుండా అడ్డుకోవడానికే ఈ ముందు జాగ్రత్త చర్యను చేపడుతున్నట్లు తెలిపారు.

పిల్లలు సోషల్ మీడియా వినియోగంపై సీఎం చంద్రబాబు అసెంబ్లీలో కీలక వ్యాఖ్యలు చేశారు. 13 ఏళ్ల లోపు వారు సోషల్ మీడియా ఉపయోగించకుండా నిషేధం విధించనున్నట్లు వెల్లడించారు. ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో సీఎం చంద్రబాబు మాట్లాడారు. 13ఏళ్ల లోపు వారికి సంబంధించి సోషల్ మీడియా బ్యాన్ చేస్తే బాగుంటుందని ఆ వయసులోపు వారికి సోషల్ మీడియా అందుబాటులో లేకుండా చేసే కార్యక్రమానికి >>2



## హైకోర్టు సిజెగా జస్టిస్ లీసా గిల్

### నోటిఫికేషన్ విడుదల

**విజయవాడ,మార్చి6,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ లీసా గిల్ రానున్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. పంజాబ్, హర్యానా హైకోర్టు నుంచి జస్టిస్ లీసా గిల్‌ను ఏపీ హైకోర్టుకు బదలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. జస్టిస్ లీసా గిల్ ఏపీ హైకోర్టులో తొలుత న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఏప్రిల్ నెలలో ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ పదవీ విరమణ చేయనున్నారు. ఆ వెంటనే జస్టిస్ లీసా గిల్ ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్నారు. సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సుల మేరకు కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ఏపీ హైకోర్టు చరిత్రలో తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ లీసా గిల్ రికార్డు సృష్టించనున్నారు.

# 10 సూత్రాల స్వర్ణాంధ్ర విజన్

### హంద్రీనీవాకు రూ.3850 కోట్ల ఖర్చుతో కుప్పం దాకా నీళ్లు

### త్వరలో ప్రతి కుటుంబానికి 'ఫ్యామిలీ కార్డు'లు

### రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం

### నాలా చట్టం రద్దుతో అవినీతికట్టడి: అసెంబ్లీలో చంద్రబాబు



**విజయవాడ,మార్చి6,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు ఇవ్వాలనే పది సూత్రాలతో 2047 స్వర్ణాంధ్ర విజన్ రూపకల్పన చేశామనీ. ఆర్థిక అసమానతలు తగ్గించేలా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోంది. త్వరలోనే ప్రతీ కుటుంబానికి ఫ్యామిలి బెనిఫిట్ మేనేజ్మెంట్ సిస్టం కార్డును కూడా జారీ చేస్తామనీ. శాసన సభలో ద్రవ్య వినిమయ బిల్లుపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. గత పాలకుల అస్తవ్యస్త విధానాల కారణంగా సంక్షోభంలో పడిన రాష్ట్రాన్ని సంక్షేమం, అభివృద్ధి వైపు నడిపిస్తున్నామని ఆయన అన్నారు. వివిధ అంశాలపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ గత పాలనలో అన్ని వ్యవస్థలు ధ్వంసమయ్యాయి. గడచిన 20 నెలల్లో కష్టాలు, సమస్యల్ని అధిగమించి రాష్ట్రాన్ని గాడిలో పెట్టాం. విధ్వంసం నుంచి వికాసం వైపు, సంక్షోభం నుంచి సంక్షేమం వైపుగా రాష్ట్రాన్ని నడిపిస్తున్నాం. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేశాం. 15 రోజుల పాటు జరిగిన శాసనసభలో ఐదు కోట్ల మంది ప్రజల భవిష్యత్తు గురించి చర్చలు జరిగాయి. భావితరాల భవిష్యత్ నిర్ణయించేలా ఈ సమావేశాల్లో చర్చలు, నిర్ణయాలు జరిగాయి. విభజన వల్ల, గత పాలకుల విధ్వంసం వల్ల నష్టపోయిన రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నాం. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ప్రధాని మోదీ సహకారంతో కీలకమైన నిర్ణయాలు తీసుకుని ప్రజలకు మేలు చేస్తున్నాం. గత ఎన్నికల్లో కూటమి తరపున పోటీ చేసిన అభ్యర్థుల్లో 94 శాతం మంది గెలవటం మా అందరిపై ప్రజల్లో ఉన్న నమ్మకానికి నిదర్శనం. ఎన్డీఏ పక్షాలన్నీ పూర్తి సఖ్యతతో ప్రజలకు అవసరమైన నిర్ణయాలు తీసుకుంటున్నాం అని ముఖ్యమంత్రి తెలిపారు. కేంద్రం, రాష్ట్రం అందించే పథకాలన్నిటినీ ఈ కార్డు ద్వారా ఇంటిగ్రేట్ చేస్తాం. రాష్ట్రంలో 25 నూతన పాలసీలు తీసుకు రావటం ద్వారా రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం. వీటితో 23 లక్షల మందికి ఉద్యోగాలు కూడా వచ్చే అవకాశం ఉంది. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇచ్చి ప్రోత్సహిస్తున్నాం. సర్క్యులర్ ఎకానమీతో వ్యర్థాల ద్వారా సంపద సృష్టిస్తున్నాం. ఇటీవలే వివాదాల పరిష్కారించేలా మధ్యవర్తిత్వంపై ఓ సదస్సు జరిగింది. మధ్యవర్తిత్వంపై దృష్టి పెట్టాలని సూచనలు వచ్చాయి. వివాదం పరిష్కారం అయితే రూ.10 వేల ప్రోత్సాహకం ఇవ్వాలని నిర్ణయించాం. రాష్ట్రంలో అభివృద్ధికి అవరోధంగా ఉన్న నాలా చట్టాన్ని రద్దు చేసి అవినీతిని కట్టడి చేశాం. జన్ విశ్వాస్ ద్వారా పాత చట్టాలను రద్దు చేస్తున్నాం అవసరమైన మార్పులు చేస్తున్నాం. దీనికి సంబంధించి బిల్లుకు కూడా శాసనసభ ఆమోదం తెలిపింది. గత పాలకులు ఐదేళ్లలో 884 కి.మీ సీసీ రోడ్లు, 234 కిలోమీటర్ల బీటీ రోడ్లు మాత్రమే వేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక గ్రామీణ ప్రాంతాల్లో 4,998 కిలోమీటర్ల సీసీ రోడ్లను కేవలం 20 నెలల్లో పూర్తి చేయించేలా డిప్యూటీ సీఎం చర్యలు తీసుకున్నారు. పల్లె పండుగ, అడవి తల్లి బాట పేరిట గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం జరుగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా గోశాలలు నిర్మాణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మ్యాజిక్ డ్రైన్ల నిర్మాణం కూడా జరుగుతోంది. 9 కోట్ల పని దినాలు కల్పించేలా కూడా ఉపముఖ్యమంత్రి చర్యలు తీసుకున్నారు. నరేగా నుంచి వీబీజీ రామ్ జీ పథకానికి మార్పు జరిగింది. బడ్జెట్ తగ్గకుండా ఆ పథకాన్ని సమర్థంగా వినియోగించుకుంటామని ముఖ్యమంత్రి అన్నారు.

**అధిక వడ్డీలకు ప్రభుత్వ ఆస్తులు తాకట్టు ప్రజాధనం దుర్వినియోగం:** ప్రజలకు మెరుగైన సుపరిపాలన ఇచ్చేందుకు నిరంతరం >>2



## అసెంబ్లీ నిరవధిక వాయిదా

### 15 రోజులు జరిగిన సమావేశాలు

**విజయవాడ,మార్చి 6,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ శాసనసభ సమావేశాలు నిరవధికంగా వాయిదాపడ్డాయి. అసెంబ్లీ సమావేశాలు జరిగేందుకు సహకరించిన అందరికీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు కృతజ్ఞతలు తెలిపారు. 16వ శాసనసభ ఐదో సమావేశాలు 15 రోజుల పాటు జరిగాయన్నారు. 72గంటల 14 నిమిషాలపాటు సమావేశాలు జరిగాయని తెలిపారు. మొత్తం 122ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారని, 80 ప్రశ్నలకు సభా సమక్షంలో ఉంచారని చెప్పారు. ఈసారి >>2



## గుంటూరు జైలుకు వాసుదేవ రెడ్డి

### లిక్కర్ కుంభకోణం కేసు

**విజయవాడ మార్చి 6 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ మద్యంకేసులో నిందుతుడు వాసు దేవ రెడ్డి సిట్ విచారణ పూర్తయింది. రెండ్రోజులపాటు ప్రశ్నించిన సిట్‌అధికారులు మద్యం విక్రయం, కేటాయింపులపై ఆయన్ను ప్రశ్నించినట్లు సమాచారం. వైద్య పరీక్షల తర్వాత వాసుదేవరెడ్డిని సిట్ అధికారులు ఏసీబీ కోర్టుకు తరలించారు. కోర్టు ఆదేశాల మేరకు ఆయన్ను గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో వాసుదేవరెడ్డి బేవరేజెస్ ఎండీగా పని చేశారు.

### 7 నుంచి 12వ తరగతి దాకా

# బాలికలకు ఉచితంగా శానిటరీ న్యాప్‌కిన్‌లు

### హెచ్‌పివి వ్యాక్సిన్‌పై అవగాహన కలిగిస్తాం

### తల్లికివందనం కింద 67 లక్షల మందికి సాయం: మంత్రి లోకేష్



**విజయవాడ,మార్చి 6,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో 7వ తరగతి నుంచి 12వ తరగతి బాలికలకు ఉచితంగా శానిటరీ న్యాప్ కిన్ లను పంపిణీ చేయడం జరుగుతోందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలలోని విద్యార్థులకు ఉచితంగా శానిటరీ న్యాప్ కిన్ లను అందించడంపై శాసనమండలిలో సభ్యులు కావలి గ్రీష్మ అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేష్ సమాధానం ఇస్తూ ప్రభుత్వ విద్యాసంస్థల్లో 7వ తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు చదువుతున్న బాలికలకు ఉచితంగా శానిటరీ న్యాప్ కిన్ లను సరఫరా చేయడం జరుగుతోంది. గతంలో ఏడు రెగ్యులర్ సైజ్, మూడు లార్జ్‌సైజ్ న్యాప్ కిన్‌లు ఇచ్చేవారు. ఫీడ్ బ్యాక్ తీసుకున్న తర్వాత 5 రెగ్యులర్ సైజ్, 5లార్జ్ సైజ్ శానిటరీ ప్యాడ్‌ను ప్రభుత్వం అందజేస్తోంది. గత ప్రభుత్వంలో 18.96కోట్ల బకాయిలు పెట్టారు. ప్రజా ప్రభుత్వం ఆ బకాయిలను తీర్చడం జరిగింది. ఆర్టీజీఎస్ నుంచి >>2

### 48వేల జనావాసాలకు

# సురక్షిత మంచినీరు లక్ష్యం

### రోడ్ల నిర్మాణానికి రూ.3,853కోట్లు వ్యయం

### సామాజిక భద్రత పెన్షన్లకు రూ.33వేల కోట్లు

### బడ్జెట్‌లో చంద్రబాబు దూరదృష్టి: డి.సిఎం పవన్



**విజయవాడ,మార్చి6,ప్రభాతవార్తప్రతినిధి:** జగన్ హయాంలో ఆర్థిక విధ్వసం చేసి, ఏపీని గందరగోళంలోకి నెట్టివేశారని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ఆర్థిక విధ్వంసం వల్ల ఏపీ 30ఏళ్లు వెనక్కు వెళ్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ద్రవ్యవినిమయ బిల్లుపై పవన్ కల్యాణ్ అసెంబ్లీలో మాట్లాడారు. మంత్రి పయ్యావుల కేశవ్ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఐదుకోట్ల ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా ఉందని వ్యాఖ్యానించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా 3.32లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. సామాజిక భద్రత పెన్షన్ల కోసమే రూ.33వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించారు. ఇలాంటి పరిస్థితిని తట్టుకోవటం, పథకాలు ఇవ్వటానికి సీఎం చంద్రబాబుకు ఎంతో ధైర్యం ఉండాలని ప్రశంసించారు. నేను నాటిన చెట్ల ఫలాలు నా కోసం కాదని, భావితరాల కోసం అన్న రవీంద్రనాథ్ ఠాగూర్ సూక్తులను పవన్ కల్యాణ్ ప్రస్తావించారు. బడ్జెట్‌లో చంద్రబాబు దూరదృష్టి, దక్షత, దార్శనికత అడుగడుగునా ఉందని కొనియాడారు. వైసీపీ హయాంలో చేపట్టిన విద్యుత్ కొనుగోళ్ల కారణంగా డిస్కంలకు రూ.12,250కోట్ల నష్టం వచ్చిందని చెప్పుకొచ్చారు. కరెంట్ సరఫరాలో కూడా ఇబ్బందులు వచ్చాయని వివరించారు. రూ.1.29 లక్షల కోట్లు విద్యుత్ సంస్థలు నష్టపోయాయని, ఆ భారాన్ని ప్రజలపై మోపారని ఆగ్రహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ట్రూఅప్ ఛార్జీలు రద్దు చేసి ట్రూడౌన్ పేరిట ఛార్జీలు తగ్గించామని ప్రస్తావించారు. వైసీపీ ప్రభుత్వం రూ.9లక్షల కోట్ల మేర అప్పులు తమపై ఉంచి వెళ్లిందని పవన్ కల్యాణ్ ధ్వజమెత్తారు. రూ.35వేల కోట్ల బిల్లులను పెండింగ్‌లో పెట్టి వెళ్లారని, అందులో రూ.25వేల కోట్లు చెల్లించామని స్పష్టం చేశారు. కేంద్ర పథకాలకు రాష్ట్రవాటా రూ.7వేల కోట్లకు పైగా జత చేశామని వెల్లడించారు. గతంలో వైసీపీ >>2



## టెన్త్ పరీక్షలకు ఉచిత బస్సులు

### 16 నుంచి ఏప్రిల్ 1 దాకా సర్వీసులు

**విజయవాడ,మార్చి 6,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో మార్చి 16 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానుండగా, పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఏపీఎస్‌ఆర్‌టీసీ శుభవార్త చెప్పింది. పరీక్షల సమయంలో విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు వీలుగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు సంస్థ ప్రకటించింది. విద్యార్థులు తమ వెంట హాల్ టికెట్ ఉంచుకుంటే సరిపోతుంది. దానిని కండక్టర్‌కు చూపించి ఉచితంగా ప్రయాణించవచ్చు. ఈ ఉచిత ప్రయాణ సౌకర్యం కేవలం పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ బస్సుల్లో మాత్రమే అందుబాటులో ఉంటుంది. విద్యార్థులు తమ ఇంటి నుంచి పరీక్షా కేంద్రానికి వెళ్లడానికి, పరీక్ష పూర్తయ్యాక తిరిగి ఇంటికి రావడానికి ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు. రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. ఈ ఏడాది సుమారు 6.42 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నారు. >>2

# ఇరాన్ లొంగిపోవలసిందే

### ఎలాంటి చర్చలు ఉండవు: ట్రంప్

### ఏడవరోజున కూడా సాగిన భీకర పోరు

### గల్ఫ్‌లోని చమురుశుద్ధి కేంద్రాలే ఇరాన్ టార్గెట్



టెహ్రాన్‌లో బాంబు దాడులకు పెద్దఎత్తున వ్యాపించిన పొగలు

**టెహ్రాన్/జెరూసలెం/వాషింగ్టన్, మార్చి 6:** మధ్యప్రాచ్చదేశాల్లో ప్రచ్ఛన్న యుద్ధం మరింత తీవ్రం అవుతోంది. అటు ఇరాన్, ఇటు అమెరికా, ఇజ్రాయెల్‌లు భీకర దాడులుచేస్తున్నాయి. మరోపక్క అమెరికా స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ దాడులు కొనసాగిస్తూనే ఉంది. ఈ క్రమంలో ఎలాంటి చర్చలు ఉండవని, బేషరతుగా ఇరాన్ లొంగిపోవాల్సిందేనంటూ ట్రంప్ హెచ్చరికలతోకూడిన సందేశాలు విడుదలచేసారు. తన సొంత సోషల్‌మీడియా ట్రూత్‌తో గంటకొక కొత్త సందేశం వస్తోంది. అలాగే ఇరాన్‌సైతం యుద్ధం కొనసాగుతునప్పటికీ కొన్ని దేశాలు దౌత్యపరంగా చర్చలకు ప్రయత్నిస్తున్నాయని, త్వరలో కొంతమేర తగ్గవచ్చని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్‌ప్రకటించారు. అయితేఇవేమీ ఉండవని ఇరాన్‌లో ఎవరున్నా తన ప్రమేయం తప్పనిసరి అని ట్రంప్ చెపుతూ కొత్తగా ఎన్నికైన సుప్రీం కమాండర్ ముజ్తబా ఖమైనీని తాము అంగీకరించబోమని, నియంత వార సులను అంగీకరించేదిలేదని ట్రంప్‌స్పష్టంచేసారు. ఇరాన్ >>2



విజయవాడలో శుక్రవారం జరిగిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల సాంస్కృతిక కార్యక్రమానికి హాజరైన మంత్రులు పయ్యావుల కేశవ్, లోకేష్ తదితరులు

## పేద వారి ఇంటికి రూ.రెండు కోట్లు కరెంటు బిల్లా!

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో మార్చి 6 ప్రభాతవార: పేద ప్రజల కోసం నిర్మాణం చేసిన లబ్ధిదారులకు అందజేసిన ఇంటికి కోట్లలో బిల్లు రావడం ఆశ్చరానికి గురి చేసింది. జగ్గమ్మగారి పేటలో అమ్మాణమ్మ అపార్టుమెంటు వెనుక బాగంలో ఉన్న 18-9-70 డోరు నెంబరుతో టిడ్కో గృహంలో నివాసం ఉంటున్న దాసరి దుర్గ ఇంటికి రూ.1,99,91,809తో బిల్లు వచ్చింది. ఎప్పుడు రూ.200 కూడా కరెంటు బిల్లు రాని ఇంటికి సుమారు రూ.రెండు కోట్లు రావడం ఏమిటని ఆమె విలేకర్లకు తెలిజేసింది. ఒక పెద్ద పరిశ్రమకు కూడా రానంత కరెంటు బిల్లు ప్రభుత్వం ఇచ్చిన పేద వారి ఇంటికి వచ్చిన సమయంలో బిల్లు ఇచ్చే సమయంలోనైనా సిబ్బంది ఆలోచన చేయక పోవడంపై సర్వత్రా అనేక విమర్శలకు దారి తీసింది.

ఈ విషయంపై ఏపీఈపీడీసీఎల్ ఎడీఈ కిరణ్‌ను వివరణ కొరగా ఈ విషయం తన దృష్టికి వచ్చిందని, దాంతో విచారణ చేస్తే మీటరు నెంబరుతో రీడింజు పొరపాటును తీయడం వలన బిల్లు వచ్చిన్నట్లు గమనించామని వెంటనే దానిని సరి చేసి రూ.147కు బిల్లు ఇవ్వడం జరిగిందన్నారు. సిబ్బంది చేసే పనులకు బిల్లు చూసి గుండె పోటు వచ్చే అవకాశాలు ఉన్నాయని స్థానికులు ద్వజమెత్తారు.

## ప్రతిపక్షం బాధ్యతను విస్మరించింది: పయ్యావుల కేశవ్

విజయవాడ, మార్చి6 ప్రభాతవార్త ప్రతినిధి: శాసనసభలో ప్రతిపక్షంలో ఉన్న పార్టీ తన బాధ్యతను పూర్తిగా విస్మరించిందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఆరోపించారు. మంత్రిఏపీ శాసనసభలో ద్రవ్య వినిమయ బిల్లు పై చర్చ సందర్భంగా కేశవ్ పసంగించారు. సభ్యులంతా బడ్జెట్ డిమాండ్లపై ఉత్సాహంగా చర్చలో పాల్గొన్నారని, చంద్రబాబు కూడా వివిధ శాఖల డిమాండ్లపై మాట్లాడినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఏ సిఎం కూడా ఇలా చర్చ లో మాట్లాడినట్లు రికార్డుల్లో లేదని మంత్రి పే ర్కొన్నారు. చంద్రబాబును చూసి నేర్చుకో వచ్చ న్నారు. సభలో ప్రతిపక్షం లేకపోవడం బాధాక రం అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నవారు ఎవరైనా ద్రవ్య వినిమయ బిల్లు చర్చలో పాల్గొనడానికి ఎదురుచూసేవారని చెప్పారు. తాము ప్రతిపక్షం లో ఉన్నప్పుడు మాట్లాడే అవకాశం కోసం గట్టిగా ప్రయత్నించేవాళ్లమని గుర్తుచేశారు.

## సివిల్స్‌లో 958 మంది ఎంపిక

>> ఎయిమ్స్ నుంచి 2023లో ఎంబీబీఎస్ పూర్తిచేశాడు. తొలి ప్రయత్నంలోనే 2024 సివిల్స్‌కు ఎంపిక కాగా ఢిల్లీ, కేంద్ర పాలిత ప్రాంత అడ్మినిస్ట్రేషన్‌లో గ్రూప్ బి ఆఫీసర్‌గా చేరారు. 2025లో రెండో ప్రయత్నంలో మాత్రం మొదటి ర్యాంకుతో ఐఏఎస్ సాధించాలనే తన కలను నెరవేర్చుకున్నాడు. 958 మందిని యుపిఎస్సి ఎంపిక చేయగా.. వారిలో జనరల్ 317 మంది, ఈడబ్ల్యూఎస్ 104 మంది, ఓబీసీ 306 మంది, ఎస్సీ 158 మంది, ఎస్టీ 73 మంది ఉన్నారు. మొత్తం 1087 పోస్టులకు నోటిఫికేషన్ జారీచేసినప్పటికీ... 129 పోస్టులకు అర్హులైనవారు లేకపోవడంతో ఫలితాలను ప్రకటించలేదు. యుపిఎస్సి ప్రకటించిన నోటిఫికేషన్‌లో ఐఏఎస్ 180, ఐఎఫ్ఎస్ 55, ఐపీఎస్ 150, గ్రూప్ఏ (సెంట్రల్ సర్వీసెస్) 507, గ్రూప్‌బి సర్వీసెస్ 195 ఖాళీలు ఉన్నట్టు నోటిఫికేషన్‌లో ప్రకటించింది. గతేడాది మే 22న ప్రిలిమ్స్ నిర్వహించిన యుపిఎస్సి.. అందులో అర్హత సాధించిన వారికి ఆగస్టు 22 నుంచి 31 వరకు మెయిన్స్ పరీక్షలను నిర్వహించింది. మెయిన్స్‌లో సత్తాచాటిన వారికి గత ఏడాది డిసెంబర్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 27తో ఇంటర్వ్యూలను పూర్తి చేసింది. ఇంటర్వ్యూలు పూర్తయిన వారం రోజుల్లోనే యుపిఎస్సి తుది ఫలితాలను ప్రకటించింది. సివిల్స్ ఫలితాల్లో పలువురు తెలుగు విద్యార్థులు సత్తా చాటారు. జాతీయ స్థాయిలో గూడెల్ల సృజన 55వ ర్యాంక్ సాధించగా.... డీఎస్‌కే ప్రచేత్ 193వ ర్యాంకు, ఎస్ వర్షిత్ రెడ్డి 259, ఎం.పవన్‌కుమార్ రెడ్డి 297, వెలిమినేటి విక్రమసింహారెడ్డి 541, గుమ్మల శ్వేత 573, పల్లి ప్రమోద్ విష్ణు 640, గుమ్మల విజయసింహారెడ్డి 682, పోతుపురెడ్డి భార్గవ్ 738, పుడారి రాహుల్ 748, కుమ్మరి శ్రవణ్‌కుమార్ 768, అనిరుధ్ కత్తిమాని 786, కోరపోతుల శ్రీకర్‌రాజు 806, ఇస్లావత్ శ్రీరామ్ హర్ష 823, కట్టా ప్రత్యూష 908, గోగుల రాజశేఖర్ 920, గుగులోతు జితేందర్ నాయక్ 939వ ర్యాంకులతో ప్రతిభ చాటారు.



శుక్రవారం అసెంబ్లీలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

## గృహ అవసరాలకే ప్రాధాన్యత

- గ్యాస్ సరఫరాపై కేంద్రం ఆంక్షలు
- చమురు కంపెనీలకు ఆదేశాలు
- పెట్రోల్, డీజిల్‌కు ఢోకా లేదు: కేంద్రం

న్యూఢిల్లీ, మార్చి 5: పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు ఆయిల్, గ్యాస్ సరఫరాపై పడింది. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య నెలకొన్న యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో తెలియని పరిస్థితుల్లో కేంద్రం అప్రమత్తమైంది. పెట్రోల్, డీజిల్ సరఫరాలో రేషనింగ్ పైన ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని వెల్లడించింది. నిల్వలు పూర్తిగా ఉండటంతో ఆందోళన అవస రం లేదని చెబుతోంది. అదే సమయంలో ఆయిల్ కంపెనీలకు తాజాగా కేంద్రం కీలక ఆదేశాలు ఇచ్చింది. ఎల్పీజీ సరఫరాలో అంత రాయం లేకుండా కేంద్రం చర్యలు తీసుకుం టోంది. ఎల్పీజీ సరఫరాలో గృహ వినియోగ దారులకే ప్రాధాన్యం ఇవ్వాలని చమురు మార్కె టింగ్ సంస్థలను ఆదేశించింది. పరిశ్రమలు, పెట్రోకెమికల్ రంగాలకు ఎల్పీజీ సరఫరాలో తా త్కాలిక పరిమితులు విధించాలని సూచించింది. ప్రస్తుతం ఎల్పీజీ దిగుమతుల్లో ఏర్పడిన అంతరా యాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఖతార్ నుంచి భారత్ ప్రధానంగా ఎల్పీజీని దిగుమతి చేసుకుం టోంది. అయితే ఇరాన్ దాడులు చేస్తుండటంతో ఖతార్ ఎల్పీజీ సరఫరాను నిలిపివేసింది. అటు భారత్‌కు గ్యాస్ విక్రయిస్తామంటూ ఆస్ట్రేలియా, కెనడా దేశాలు ముందుకొచ్చాయి. యుద్ధం వేళ వంట గ్యాస్ కొరత తప్పదనే ప్రచారం వేళ వినియోగదారులు పెద్ద సంఖ్యలో బుకింగ్స్ చేసుకుంటున్నారు. దీం తో సరఫరా పైన ఒత్తిడి పెరుగుతోంది. ఆయిల్ కంపెనీలు తమ ఏజెన్సీ ల ద్వారా అనధికారికం గా వంట గ్యాస్ బుకింగ్స్‌పై పరిమితులు అమ లు చేస్తున్నారు. గ్యాస్ బుకింగ్‌పై పరిమితులు రెండు సిలిండర్లు ఉన్న గ్యాస్ వినియోగదారుడికి బుకింగ్ గడువు 30 రోజులు. ఒక సిలిండర్ ఉ న్న వినియోగదారుడికి 21 రోజుల తరువాతనే బుకింగ్ చేస్తున్నారు. ఈ మేరకు ఆయిల్ కంపెనీ లు బుకింగ్ పోర్టల్స్. యాప్‌ల సాఫ్ట్‌వేర్‌లోనూ మార్పులు చేసారు. దీని ద్వారా సిలిండర్ పొంది న 21 రోజుల తరు వాత మాత్రమే మరో సిలిం డర్ కోసం బుకింగ్ చేయాల్సి ఉంటుంది. ఇదే సమయంలో ప్రభు త్వం, ఆయిల్ కంపెనీలు మాత్రం వంటగ్యాస్ సరఫరాలో ఎలాంటి సమస్య లేదని చెబుతు న్నాయి. ఇప్పుడు ఇంకా యుద్ధం కొనసాగుతున్న వేళ. సెప్టెంబర్ వరకు కొనసాగే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది.

## మార్చి 14 నుంచి టెన్త్ పరీక్షలు

>> రెగ్యులర్ విద్యార్థులు 5,17,727 మంది విద్యార్థులు కాగా.. 10,512 మంది ప్రైవేటు విద్యార్థులు హాజరు కానున్నారు. ఎస్ఎస్‌సి పరీక్షల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 2676 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిలో 1582 ప్రభుత్వ స్కూల్స్ ఉండగా.. 1094 స్కూల్స్ ప్రైవేటు స్కూల్స్ ఉన్నాయి. ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు 4.70 లక్షల మంది ఉండగా.. తెలుగు మీడియం వారు 44,881 మంది ఉన్నారు. 3720 మంది ఉర్దూ మీడియం విద్యార్థులున్నారు. ఎస్ఎస్‌సి వార్షిక పరీక్షలు మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు కొనసాగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. ప్రభుత్వ పరీక్షల డైరక్టర్ కార్యాలయంలో 24 గంటలపాటు అందుబాటులో ఉండేలాగా 040-23230942 నంబర్ అందుబాటులో ఉంచినట్టు ప్రభుత్వ పరీక్షల డైరక్టర్ తెలిపారు. పరీక్షలకు నమోదు చేసుకున్న విద్యార్థుల్లో 5,17,727 రెగ్యులర్ విద్యార్థులున్నారు. వారిలో బాలురు 260916 మంది బాలికలు 256811 మంది ఉన్నారు. 10,512 ఒకసారి విఫలమైనవారు కాగా.. వారిలో బాలురు 7038 మంది బాలికలు 3474 మంది. మొత్తం 5,28,239 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానుండగా.. వారిలో బాలురు 267954 మంది, బాలికలు260285 మంది ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి 2,07,573 మంది గురుకుల పాఠశాలలు నుంచి 60,139 మంది, ప్రైవేట్ పాఠశాలల నుంచి 2,50,015 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 11,674 స్కూల్స్ నుంచి టెన్త్ పరీక్షలకు విద్యార్థులు హాజరు కానున్నారు. వాటిల్లో ప్రభుత్వ/జిల్లా పరిషత్ స్కూల్స్ 6386 ఉండగా.. ప్రైవేట్ స్కూల్స్‌లో 5288 నుంచి విద్యార్థులు ఎస్ఎస్‌సి పరీక్షలకు హాజరు కానున్నారు. ఎస్ఎస్‌సి పరీక్షలకు హాజరయ్యే వారిలో ప్రత్యేక అవసరాలు ఉన్న విద్యార్థులు 1408 మంది ఉన్నారని డైరక్టర్ నవీన్ నికోలస్ తెలిపారు.

## అసెంబ్లీ నిరవధిక వాయిదా

>> సమావేశాల్లో 18 బిల్లులను ఏకగ్రీవంగా ఆమోదించినట్లు తెలిపారు. ఒక లఘు చర్చ, 344వ నియమం కింద చర్చించిన అంశాలు ఒకటి అని వివరించారు. శాసనసభలో టీడీపీ 135, జనసేన21, వైసీపీ11, బీజేపీ8 మంది సభ్యులున్నారని స్పీకర్ తెలిపారు. ఈరోజు సాయంత్రం సభ్యుల సాంస్కృతిక కార్యక్రమాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ కుటుంబసమేతంగా రావాలని స్పీకర్ కోరారు. క్రీడాపోటీల్లో అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. 166 పాఠశాలల నుంచి 6,693 విద్యార్థులు అసెంబ్లీని సందర్శించారని.. అసెంబ్లీకి ఇంత భారీ సంఖ్యలో విద్యార్థులు ఎప్పుడూ రాలేదని స్పీకర్ అన్నారు. అనంతరం స్పీకర్ అయ్యన్నపాత్రుడు శాసనసభ సమావేశాలను నిరవధికంగా వాయిదా వేశారు.

## 10 సూత్రాల స్వర్ణాంధ్ర విజన్

>> పోరాటం చేశాం. గత పాలకులు ప్రభుత్వ ఆస్తులు కూడా తాకట్టు పెట్టి అప్పులు తెచ్చారు. ఎమ్మార్వో ఆఫీసు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సర్క్యూట్ హౌస్‌లాంటి ఆస్తులను తాకట్టు పెట్టారు. 12, 13 శాతంతో అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి ప్రభుత్వ ఆర్థిక వనరుల్ని దుర్వినియోగం చేశారు. రూ.43,298 కోట్ల విలువైన అప్పులకు ప్రభుత్వం రీ షెడ్యూలు చేయించాం. తద్వారా రూ.328 కోట్ల మేర ఆదా అవుతుంది. మరో రూ.1 లక్ష కోట్ల మేర అప్పులు కూడా రీ షెడ్యూలు చేసేలా చర్యలు తీసుకుం టున్నాం. దీని వల్ల రూ.1,658 కోట్ల వెసులు బాటు వస్తుంది. ఈ నిధులతో మరో సంక్షేమ పథకాన్ని అమలు చేసే అవకాశం ఉంటుంది. ఒక వ్యక్తి తన స్వార్థంతో రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును ధ్వంసం చేసేశారు. గోదావరి పుష్కరాల కంటే ముందే ప్రాజెక్టును జాతికి అంకితం చేసి నీళ్లు ఇస్తాం. కేంద్ర సహకారంతో అమరావతి రాజధానిని ట్రాక్‌లో పెట్టాం. మూడేళ్లలో రాజధానికి ఓ రూపు వస్తుంది. వచ్చే సమావేశాలకు ఎమ్మెల్యేలు, మంత్రులు రాజధాని లోని వారి క్వార్టర్లలో ఉండేలా చర్యలు చేపడుతున్నాం. కేంద్ర నిధులతో విశాఖ ఉక్కును కాపాడుకున్నాం. తొలిసారి విశాఖ స్టీల్ ప్లాంట్ లాభాల్లోకి వచ్చింది. స్టీల్ ప్లాంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం కూడా పూర్తి సహకారాన్ని అందిస్తోంద్ధి అని ముఖ్యమంత్రి తెలిపారు.

**గత పాలనలో ట్రూ అప్.. కూటమి వచ్చాక ట్రూడౌన్**

రాష్ట్రానికి నీటి భద్రత అత్యంత ముఖ్యమైన అంశం. 20 నెలల్లో దీనికి అనుగుణంగా చర్యలు తీసుకున్నాం. హంద్రీనీవాకు రూ.3850 కోట్లు ఖర్చు చేసి కుప్పం వరకూ నీళ్లు తీసుకెళ్లాం. అనంతపురం లాంటి జిల్లాకు 55 టీఎంసీల నీటిని తీసుకువెళ్లాం. ప్రస్తుతం వేసవి వచ్చినా 628 టీఎంసీల నీరు వివిధ రిజర్వాయర్లలో నిల్వ ఉంది. సమర్థ నీటి నిర్వహణతోనే ఇది సాధ్యమైంది. భూగర్భజలాలు కూడా రాష్ట్ర వ్యాప్తంగా గణనీయంగా పెరిగాయి. రాష్ట్రంలో 2.96 మీటర్ల మేర భూగర్భజలాలు పెరిగేలా వివిధ సంరక్షణా చర్యలు చేపట్టాం. భూగర్భ జలాలు పెరగటం వల్ల వ్యవసాయ విద్యుత్ వినియోగం తగ్గింది. ఆ మేరకు వ్యయాన్ని ఆదా చేసుకున్నాం. ఎన్ని ఇబ్బందులు ఉన్నా కరెంటు ఛార్జీలు పెంచబోమని ఎన్నికల ముందు చెప్పిన మాటను నిలబెట్టుకున్నాం. గత పాలకులు రూ.32 వేల కోట్ల కరెంటు ఛార్జీల భారం ప్రజలపై మోపారు. ట్రూ అప్ భారం వేస్తే చరిత్రలో తొలిసారి మేం ట్రూడౌన్ చేశాం. రూ.4420 కోట్ల మేర ట్రూ అప్ భారాన్ని ప్రజలపై మోపకుండా చర్యలు తీసుకున్నాం. పీఎం సూర్యఘర్ ద్వారా ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సౌర ప్యానెళ్లు ఏర్పాటు చేసి ఇంటిపైనే విద్యుత్ ఉత్పత్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. యూనిట్ కొనుగోలు ధరను రూ. 5.19 నుంచి 4.80కు తగ్గించేలా చర్యలు చేపట్టామన్నారు. ఆరు అంశాలు కీలకంగా ఆత్మ నిర్భర్ వికసిత్ భారత్‌పై సంకల్పం తీసుకుంటూ ముఖ్యమంత్రి అసెంబ్లీలో తీర్మానం ప్రవేశ పెట్టారు. ఈ తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సందర్భంగా చంద్రబాబు అసెంబ్లీలో తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిపాదించిన "ఆత్మ నిర్భర్ వికసిత్ భారత్" సంకల్పానికి అనుగుణంగా, రాష్ట్రాన్ని ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాలలో మరింత బలోపేతం చేయాలని వికసిత్ భారత్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అగ్రగామిగా నిలపడం ఎన్డీఏ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యం అన్నారు. 2047 నాటికి భారత దేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామి ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టి, రాష్ట్రాన్ని రూ.308 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించుకుంది. స్థానిక పరిశ్రమల అభివృద్ధి, తలసరి ఆదాయం పెంపు, ఏటా 15 శాతం స్థిరమైన వృద్ధి రేటు నమోదు చేయాలనే ఘనమైన లక్ష్యాల సాధనకు ఈ ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందన్నారు.

### బడ్జెట్‌పై విపక్షనేత బొత్స మంత్రుల మధ్య
## మాటల యుద్ధం

సచివాలయం, మార్చి 6 ప్రభాతవార్త: బడ్జెట్ కేటాయింపులపై విపక్ష నేత బొత్స, మంత్రుల మధ్య మాటల యుద్ధం బడ్జెట్ అంకెల గారడీగా ఉందన్న విపక్షనేత బొత్స సత్యనారాయణ ఆదాయానికి,ఖర్చులకు పొంతన లేకుండా బడ్జెట్ తయారుచేశారని ఎల్ఓపి బొత్స అన్నారు. సొంత ఆదాయార్జనలో రాష్ట్రం 22వ స్థానంలో ఉందని కాగ్ రిపోర్టు తెలిపిందన్న బొత్స, బొత్స ఆరోపణలపై అభ్యంతరం తెలిపిన మంత్రులు, సభను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆధారలు ఇవ్వాలని డిమాండ్ చేసిన మంత్రి పయ్యావుల.

### వారం - వర్జ్యం

07-03-2026, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, పూర్వాభాద్ర కార్తె
చవితి రా.7.20
చిత్త ఉ.11.17
వర్జ్యం : సా.5.25-7.10
దు.ఉ.6.23-7.59
రాహుకాలం - ఉ.9.00-10.30

## టెన్త్ పరీక్షలకు ఉచిత బస్సులు

>> పరీక్షల సమయంలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. బస్సుల్లో విద్యార్థులను అనుమతించే విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, వారికి సహకరించాలని ఆర్టీసీ ఎండీ క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే పేద విద్యార్థులకు ఈ నిర్ణయం ఎంతో ఊరట నిస్తుంది. రవాణా ఖర్చుల భారం లేకుండా, సురక్షితంగా పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు ఇది దోహదపడుతుంది. విద్యార్థులు తప్పని సరిగా హాల్ టికెట్లను తమ వెంట తీసుకు వెళ్లాలని అధికారులు సూచించారు.

## సోషల్ మీడియా నిషేధం

>> 90 రోజుల్లో శ్రీకారం చుడతామని స్పష్టం చేశారు. 1316 ఏళ్లలోపు వారికి సంబంధించి ఏం చేయాలన్నదానిపై అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. సోషల్ మీడియా వల్ల మన పిల్లలు నష్టపోకూడదని. దానికి ఈ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని సీఎం స్పష్టం చేశారు. టెక్నాలజీని వాడుకుంటే ఆయుధంగా పనిచేస్తుందని, బానిసైతే జీవితాలు నాశనమవుతాయని అన్నారు. ఇటీవల దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో పిల్లలు సోషల్ మీడియా వినియోగించడంపై మంత్రి నారా లోకేశ్ అభిప్రాయాన్ని వెల్లడించారు. అలానే కొద్ది రోజుల క్రితం సచివాలయంలో నిర్వహించిన మంత్రులు, కార్యదర్శుల సదస్సులో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ బాలబాలికలు సోషల్ మీడియా వినియోగించకుండా నియంత్రించేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని స్పష్టం చేశారు. సోషల్ మీడియా వినియోగంపై ప్రత్యేక చట్టం తీసుకొస్తామని ప్రకటించారు. సోషల్ మీడియా అడ్డం పెట్టుకుని అసభ్య దూషణలతో వ్యక్తిత్వ హననానికి పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. గతంలో అసభ్య పదజాలంతో రెచ్చిపోయిన వారిని వదిలిపెట్టకుండా నియంత్రించగలిగామని గుర్తు చేస్తూ మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలని, ఏపీని అత్యంత సురక్షిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని సీఎం చంద్రబాబు సూచించారు.

## ఇరాన్ లొంగిపోవలసిందే

>> బేషరతుగా లొంగిపోతేనే యుద్ధానికి ముగింపు ఉంటుందని ట్రంప్ బాహాటంగానే చెపుతుండటంతో మధ్యప్రాచ్యంలో ఇరాన్‌పై యుద్ధంమరింత తీవ్రం అవుతుందన్న అంచనాలున్నాయి. మరోపక్క దక్షిణ లెబనాన్‌లోని హెజ్బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ విరుచుకు పడుతోంది. గత అర్ధరాత్రినుంచి లెబనాన్‌నుంచే హెజ్బొల్లా 70 రాకెట్లనుప్రయోగించిందని ఇజ్రాయెల్ మిలిటరీ ప్రకటించింది. అలాగే లెబనాన్ లోని 500 లక్ష్యాలను ఇజ్రాయెల్ ధ్వంసంచేసిందని, 70మందికిపైగా హెజ్బొల్లా మిలిటెంట్లను అంతంచేసినట్లు ప్రకటించుకుంది. అయితే లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వశాఖ మాత్రం ఇప్పటి వరకూ 217 మంది చనిపోయినట్లు ప్రకటించింది. ఇదిలా ఉంటే అమెరికా నిఘా సమాచారంతో ఇరాన్‌లోని భూగర్భంలో ఉన్న అణుస్థావరాలను ధ్వంసంచేసేందుకు ఇజ్రాయెల్ లెక్కకు మించిన బాంబులు జారవిడిచింది. అయితే అప్పటికే కొన్నింటిని బదలాయించారన్న సమాచారం ఉంది. ఇదిలా ఉంటే ఇజ్రాయెల్ విడుదల చేసిన ఖమైనీని మట్టుపెట్టేందుకు ఉపయోగించిన క్షిపణుల వివరాలనుప్రకటించింది. బ్లూస్పారో మంచి ఫలితాలిచ్చిందని చెపుతున్నారు. ఇదిలా ఉంటే తమపై దాడులకు ప్రతీకారంగా ఇరాన్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ అమెరికా మిత్రదేశాలుగా ఉన్న గల్ఫ్ దేశాలపై దాడులు ఉధృతంచేసింది.

## సురక్షిత మంచినీరు లక్ష్యం

>> రాష్ట్ర వాటా ఇవ్వకపోవటం వల్ల రూ.8,700 కోట్లు జలజీవన్ మిషన్ నిధులు నిరుపయోగమయ్యాయని చెప్పుకొచ్చారు. వైసీపీ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వదిలేసిన అనేక ప్రాజెక్టులను కూటమి ప్రభుత్వంలో ప్రారంభించామని తెలిపారు. జలజీవన్ మిషన్‌కు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తున్నాం అన్నారు. జల్ జీవన్ మిషన్ పథకాన్ని గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు.గుర్తించిన గ్రామాలకు ముందస్తుగా మంచినీటి సౌకర్యాలకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.ప్రతి గ్రామానికి స్వచ్ఛమైన నీరు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. 3 వేల గ్రామాలకు స్వచ్ఛమైన నీరు అందించాలన్న బలమైన సంకల్పంతో ముందు కెళ్తున్నా అన్నారు.రాష్ట్ర అభివృద్ధి కోసం కూటమి నేతలందరం ఐక్యంగా ముందుకెళ్దామని ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ వ్యాఖ్యానించారు. కూటమి చాలా బలంగా ఉండాల నేది తన ఆకాంక్ష అని ఉద్ఘాటించారు. ఏపీ అభివృద్ధి కోసమే 2014లో అలయన్స్ కోసం కష్టపడ్డానని తెలిపారు. 2019లో అది సాధ్యం కాలేదని.. 2024లో మరోసారి వెనక్కు తగ్గి పొత్తు పెట్టుకున్నానని ప్రస్తావించారు.

**మంచినీటి సమస్యను పరిష్కరిస్తాం**

మూడువేల గ్రామాల్లో మంచినీటి సమస్య గుర్తించామని... అక్కడ తొలి ప్రాధాన్యంగా నీరు ఇస్తామని పవన్ స్పష్టంచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 48 వేల జనావాసాల్లో సురక్షిత మంచినీరు ఇవ్వాలనే లక్ష్యమని ఉద్ఘాటించారు. 2019 నుంచి 2024 మధ్య ఉపాధి హామీ పథకంలో రూ. 610కోట్లు రోడ్ల కోసం ఖర్చు చేశారని తెలిపారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.3,853కోట్లు రోడ్ల కోసం ఖర్చు చేశామని తెలిపారు. ఐదేళ్లలో 880 కిలోమీటర్లు సీసీ రోడ్లు వేస్తే మనం 6 వేల కిలోమీటర్లు వేశామని వెల్లడించారు. వైసీపీ హయాంలో అన్ని రోడ్లు 8,500 కిలోమీటర్లు వేస్తే... మనం రెండేళ్లలో 17,500 కిలోమీటర్ల రోడ్లు వేశామని తెలిపారు. కష్టాలు, నష్టాలున్నా 11.75 ఆర్థిక వృద్ధిరేటు చూపించిన సీఎం చంద్రబాబుకు అభినందనలు. కోటి 11 లక్షల సివిల్ కేసులు, 3కోట్లకు పైగా క్రిమినల్ కేసులు దేశవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్నాయని ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ చెప్పారని అన్నారు. ఈ సమస్య పరిష్కరించాలని గవర్నర్ సూచించా రన్నారు. మన వద్ద ఉన్న కోర్టుల సంఖ్య, సిబ్బంది సంఖ్య ప్రకారం ఈ కేసులు ఎప్పటికీ పరిష్కారమవుతాయో చెప్పలేమని అన్నారు. బడ్జెట్‌లో 100 కోర్టు గదులకు నిధులు కేటాయించటం సంతోషమన్నారు.

## బాలికలకు ఉచితంగా శానిటరీ న్యాప్‌కిన్‌లు

>> ఐవీఆర్ఎస్ ద్వారా ఫోన్ కాల్స్ చేసి ఫీడ్ బ్యాక్ తీసుకోవడం జరుగుతోంది. 96శాతం బాలిలకు తమకు శానిటరీ న్యాప్ కిన్ లు అందుతున్నాయని, 4 శాతం మంది అందడం లేదని చెప్పడం జరిగింది. నాణ్యత విషయంలో 1 శాతం బాగాలేదని, 14శాతం పర్వాలేదు, బాగుందని 85శాతం మంది చెప్పారు. శానిటరీ న్యాప్ కిన్స్ ఎబ్సార్ ప్షన్ పై 84శాతం మంది బాగుందని, 14 శాతం మంది పర్వాలేదని, బాగాలేదని 2శాతం మంది ఫీడ్ బ్యాక్ ఇచ్చారు. సైజ్ విషయంలో 89శాతం మంది బాగుందని, 11శాతం బాగాలేదని చెప్పారు. ఎకో ఫ్రెండ్లీ శానిటరీ ప్యాడ్స్ పంపిణీపైనా చర్చించడం జరిగింది. దీనిపైనా పరిశీలన చేస్తాం. ఎన్జీవోలతో మాట్లాడి బాలికల్లో అవగాహన పెంచేందుకు కూడా చర్యలు తీసుకుంటాం. వెండింగ్ మిషన్స్ విత్ స్మార్ట్ కార్డ్ ను ఇప్పటికే కేజీబీవీల్లో పైలట్ ప్రాజెక్ట్ చేపట్టాం. అన్ని పాఠశాలలకు విస్తరించేందుకు చర్యలు తీసుకుంటాం. హెచ్‌పీవీ వ్యాక్సిన్ ను ప్రధాని నరేంద్ర మోదీ గారు చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఇదో క్యాంపెయిల్ లా చేస్తాం. దీనిపై అనేక అపోహాలు ఉన్నాయి. ఇది అవసరం. అందరం కలిసికట్టుగా దీనిపై అవగాహన తీసుకురావాల్సిన అవసరం ఉందని మంత్రి చెప్పారు. అంతముందు ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ మాట్లాడుతూ.. విద్యార్థినులకు నెలసరి వచ్చే సమయంలో సరైన హైజీన్ ప్రొడక్ట్స్ అందక పాఠశాలలకు గైర్హాజరవుతున్నారు. ఆరోగ్య సమస్యలు కూడా తలెత్తే ప్రమాదం ఉంది. కాబట్టి ప్రభుత్వ పాఠశాలల్లో, కాలేజీల్లో చదవుతున్న బాలికలకు ఎకో ఫ్రెండ్లీ శానిటరీ ప్యాడ్స్ కచ్చితంగా అందించాలని ప్రభుత్వాన్నికోరారు. తల్లికి వందనం పథకం కింద రాష్ట్రంలో 67,01,653 మంది విద్యార్థులకు రూ.8,454 కోట్ల మేర సాయం అందించాం. అర్హులందరికీ సాయం అందించాలనేది ప్రజా ప్రభుత్వ నిర్ణయమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. తల్లికి వందనం పథకం, యూడైస్ ప్రకారం రాష్ట్రంలో నమోదైన విద్యార్థుల సంఖ్యపై శాసనమండలిలో వైసీపీ సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ.. యూడైస్ ప్రకారం ఒకటో తరగతి నుంచి 12వ తరగతి వరకు రాష్ట్రంలో 79,51,903 మంది విద్యార్థులు నమోదయ్యారు. తల్లికి వందనం పథకం కింద రూ.8,454 కోట్లు సాయం అందించాం. 67,01,653 మందికి తల్లికి వందనం వర్తించింది. యూడైస్ లో 86 లక్షల మంది విద్యార్థులు ఉన్నారంటూ వైసీపీ నేతలు అసత్యాలు మాట్లాడుతున్నారు. యూడైస్‌లో నమోదైన వారిలో అర్హులందరికీ(84.27 ) సాయం అందించాం. వైసీపీ హయాంలో యూడైస్ కింద 81,72,224 మంది విద్యార్థులు నమోదై ఉంటే.. కేవలం 42,33,098 మందికి మాత్రమే, అంటే 52శాతం మందికి మాత్రమే ఇచ్చారు. మేం 85శాతం మందికి సాయం అందించాం. 2020-21 చూస్తే సుమారుగా 83 లక్షల మంది ఉంటే.. కేవలం 44 లక్షల మందికే ఇచ్చారు. 202122లో 82 లక్షల మంది ఉంటే.. కేవలం 43 లక్షల మందికే ఇచ్చారు. 2022-23లో 80 లక్షల మంది ఉంటే.. కేవలం 42 లక్షల మందికే ఇచ్చారు. వైసీపీ హయాంలో 52శాతం మంది విద్యార్థులకు ఇస్తే.. ప్రజా ప్రభుత్వంలో 84.27 శాతం మందికి అందజేశాం. తల్లికి వందనం పథకం కింద సాయం అందని వారి వివరాలు పంపిస్తే.. సరిచేసుకునేందుకు సిద్ధంగా ఉన్నాం. అర్హులందరికీ సాయం అందించాలనేది ప్రజా ప్రభుత్వ నిర్ణయం.కొంతమందికి పాక్షిక సాయం అందించారనే విషయంలో.. సోషల్ వెల్ఫేర్ విభాగంలో కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తుంది. మేం ముందు చెల్లించిన తర్వాత కేంద్రం నిధులు అందజేస్తోంది. రెండూ కలిసికట్టుగా మేం అందిస్తున్నాం. గ్యాప్ ఏమైనా ఉంటే వివరాలు ఇవ్వాలి. పారిశుద్ధ్య కార్మికులందరికీ తల్లికి వందనం వర్తించేలా చర్యలు తీసుకుంటామని

### వార్తాఫలం

**మేషం :** మీ యొక్క నిర్మాణాత్మకమైన కృషికి ప్రోత్సాహం లభిస్తుంది. సంతాన విషయ వ్యవహారాలలో మీ దృష్టిని కేంద్రీకరిస్తారు.

**వృషభం :** గ్రూపు రాజకీయాలకు దూరంగా ఉండటం మంచిదని భావిస్తారు. వృత్తిలో అనుకూలమైన మార్పులు వుంటాయి.

**మిథునం:** చట్టపరమైన సమస్యలను ఎదుర్కొవడానికి న్యాయవాదులను ఆశ్రయిస్తారు. ప్రయాణాలలో మెళకువలు పాటించండి.

**కర్కాటకం:** బ్యాంకింగ్ వ్యవహారాలలో ప్రత్యేకమైన శ్రద్ధ కనబరచవలసి వుంటుంది. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి.

**సింహం:** మీ ప్రమేయం లేకుండానే మిమ్మల్ని వివాదాలలోనికి లాగబడే అవకాశాలున్నాయి. జీవిత భాగస్వామి నుండి సాయం అందుతుంది.

**కన్య :** ఒదిగి వుంటేనే ప్రయోజనాలు చేతికి అందుతాయని అనుభవపూర్వకంగా మీరు తెలుసుకుంటారు. వాహన సౌఖ్యం కలదు.

**తుల :** టెండర్స్ అతి కష్టం మీద అనుకూలిస్తాయి. వృత్తి పరంగా ఓర్పు వహించవలసి ఉంటుంది. శుభవార్తలు.

**వృశ్చికం:** గత అనుభవాలను గుర్తుంచుకొని స్వయంకృతాపరాధాలు దొర్లకుండా జాగ్రత్తగానే మెలగగలుగుతారు.

**ధనుస్సు:** అవిశ్రాంతంగా శ్రమించవలసి వస్తుంది. బంధువులతో ఏర్పడిన విభేదాలు పరిష్కారమవుతాయి. ధనలాభం.

**మకరం:** దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారం ఆనందం కలిగిస్తుంది. కోపతాపాలకు దూరంగా వుండండి.

**కుంభం:** గణితంలోని సాంకేతికమైన లోపాలను గుర్తించి జాగ్రత్తలను తీసుకుంటారు. తద్వారా లాభపడుతారు.

**మీనం :** కాగలకార్యం గంధర్వులు నిర్వహించారనే రీతిగా అప్రయత్న కార్యసిద్ధి ఒక సందర్భంలో లభిస్తుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



## తిరుపతిలో గవర్నర్ జస్టిస్ నజీర్

### - నేడు పద్మావతి మహిళా వర్సిటీలో స్నాతకోత్సవం

**తిరుపతి,మార్చి 6ప్రభాతవార్త ప్రతినిధి:** రెండు రోజుల తిరుపతి పర్యటనకు రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ దంపతులు శుక్రవారం ఉదయం తిరుపతికి చేరుకున్నారు. రేణిగుంట విమానాశ్రయంలో గవర్నర్ నజీర్ దంపతులకు జిల్లా యంత్రాంగం స్వాగతం పలికారు. తిరుపతిలో నేడు(శనివారం)ఉదయం జరగనున్న పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం 22వ స్నాతకోత్స వంలో ఛాన్సెలర్ హోదాలో పాల్గొని పట్టాలను ప్రదానం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి తిరుపతికి చేరుకున్న గవర్నర్‌కు జిల్లా సంయుక్త కలెక్టర్ ఆర్.గోవిందరావు, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షీ, జిల్లా ఎస్పీ లంకెలసుబ్బరాయుడు, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఉమ వెన్నం, రిజిస్ట్రార్ ఆచార్య ఉష,జిల్లా సాంఘిక సంక్షేమ విభాగం అధికారి భరత్ పుష్ప గుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన తిరుచానూరురోడ్డులోని ఓ హోటల్‌లో విశ్రాంతి తీసుకుంటున్నారు.

## గుంటూరులో తొలిసారిగా జాతీయస్థాయి 'శక్తిమహోత్సవ్'

**సచివాలయం,మార్చి 6,ప్రభాతవార్త:** గుంటూరులో తొలిసారిగా జాతీయస్థాయి శక్తి మహోత్సవ్- మహిళా శక్తి మరియు కళల మహోత్సవం. దక్షిణమధ్యరైల్వే గుంటూరు డివిజన్, నాగ్‌పూర్‌లోని సౌత్ సెంట్రల్ జోన్ కల్చరల్ సెంటర్ మరియు భారత ప్రభుత్వ సంస్కృతి మంత్రిత్వ శాఖలతో కలసి తొలిసారిగా శక్తిమహోత్సవ్ అనే జాతీయస్థాయి సాంస్కృతిక ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపింది.

రంగోలి,ఫైర్‌లెస్ కుకింగ్ పోటీలు నిర్వహించి మహిళా ఉద్యోగుల ప్రతిభను ప్రోత్స హిస్తున్నారు. నేటి నుండి స్థానిక శ్రీవేంకటేశ్వర విజ్ఞానమందిరంలో జరిగే ఈ కార్యక్రమాలకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన ప్రముఖ మహిళా కళాకారులు తమ సాంప్రదాయ జానపద నృత్యాలను ప్రదర్శిం చనున్నారు.

# త్వరలో రాజకీయ పార్టీ ఏర్పాటు



**తిరుమల,మార్చి 6ప్రభాతవార్తప్రతినిధి:** తెలంగాణ ప్రజల పక్షాన నిలబడేందుకు ,తెలంగాణ ఇంటి పార్టీగా పని చేయడానికి రానున్న రోజుల్లో రాజకీయ పార్టీ ఏర్పాటు చేస్తున్నట్లు జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. అందుకు కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు,కరుణాకటాక్షాలు దయ ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. తాను నాలుగు సంవత్సరాలుగా పడుతున్న మనోవేదన శ్రీవారి దయతో తీరి పోయిందని, సత్యం, న్యాయం, ధర్మం మావైపు ఉందని నేను తొలి నుండి చెప్పడం జరిగిందన్నారు. ఈ స్వామి దయతో పూర్తిస్థాయిలో తాను నిర్దోషిగా తేలడం వెల్లడైందన్నారు. దీనివల్లే తాను కాలినడకన తిరుమలకు వచ్చి వేంకటేశ్వరస్వామికి మొక్కు చెల్లించుకున్నానని కవిత తెలిపారు. తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాలుగా విడిపోయినా ప్రజలంతా కలసి ఉండాలని, బాగుండాలని ఆకాంక్షించారు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలు, ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని స్వామి వారిని కోరుకున్నానన్నారు. జై తెలంగాణ,జై ఆంధ్ర అంటూ మరోసారి జాగృతి అధ్యక్షురాలు కవిత తన వాణిని తిరుమలలో వినిపించారు. తెలంగాణలో ప్రజా సమస్యల పరిష్కా రంలో, ప్రతిపక్ష పాత్ర పోషించడంలో బిఆర్ఎస్, బిజెపి పార్టీలు విఫల మయ్యాయని ఆమె విమర్శించారు. గత నాలుగేళ్లుగా చేయని తప్పుకు తాను, తన కుటుంబం మాన సిక వేదన అనుభవించా వంని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు న్యాయం చేసిన న్యాయ వ్యవస్థకు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం వేకువజామున ఆమె భర్త అనిల్‌తో కలిసి ఆలయం లోనికి చేరు కున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ఆనంద నిలయంలో శ్రీవారి అభిషేక సేవ లో పాల్గొని స్వామి వారి ఆశీస్సులందుకున్నారు. కానుకలు సమర్పిం చారు. రంగ నాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపల కవితతో అభిమానులు, భక్తులు ఫోటోలు దిగేందుకు ఉత్సాహం చూపారు. అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ కవిత ముందుకు కదిలారు.

**సత్యం, న్యాయం, ధర్మం మావైపు ఉంది**
**శ్రీవారికి మొక్కులు తీర్చుకున్న జాగృతి నేత కవిత**

## కల్తీనెయ్యి అక్రమాలపై నిశితంగా అధ్యయనం

### - ఏకసభ్యకమిటీ దర్యాప్తు షురూ!



**తిరుమల,మార్చి 6ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూలకు కల్తీనెయ్యి సరఫరాచేసిన సూత్ర దారుల వ్యవహారం తేల్చేందుకు నియామకమైన ఏకసభ్యకమిటీ నిశితంగా అధ్యయనం మొదలుపెట్టింది. ఈ కమిటీలో విశ్రాంత ఐఎఎస్ అధికారి, సిఎస్ దినేశ్ కుమార్‌కు సహాయకులుగా ఐదుగురిని నియమించిన విషయం విదితమే. ఈ బృందం 2019నుండి 2024 వరకు కల్తీనెయ్యి సరఫరా జరిగిన తంతుపై, టిటిడిలో ప్రేక్షకపాత్ర వహించిన అధికారుల పాత్రపై మరింత నిశితంగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ కేసులో పలువురు కీలక పాత్రధారులను అరెస్ట్ చేసిన సిబిఐ సిట్ కటకటాల్లోకి పంపింది. కొందరు బెయిల్‌పై బయట ఉండగా కొందరు షరతులతో ఉన్నారు. ఈ నేపథ్యంలో సూత్రధారులను తేల్చేందుకు ఏకసభ్యకమిటీని ప్రభుత్వం నియమించింది. పలువురిని విచారణకు పిలిచే విషయంపై ,మరిన్ని ఆధారాలు సేకరించే పనిలో నిమగ్నమైందనేది సమాచారం. శుక్రవారం కూడా తమ వద్ద ఉన్న ఆధారాలతో భూదేవి కాంప్లెక్స్‌లోని పాత సిట్ కార్యాలయంలో సేకరించిన సమాచారాన్ని, ఇప్పటివరకు అరెస్ట్‌చేసిన నిందితుల నుండి సిట్ రాబట్టిన వివరాలను పరిశీలించి తదుపరి అనుసరించాల్సిన వ్యూహంపై తీవ్రంగా చర్చించారనేది విశ్వసనీయ సమాచారం. కల్తీనెయ్యి సరఫరాచేసిన పాపంలో అసలు సూత్రధారులైన గత టిటిడి పెద్దల అవినీతిగుట్టు రట్టయ్యే అవకాశం కూడా ఉండటంతో ఏకసభ్యకమిటీ అన్ని కోణాల్లో కార్యాచరణ సిద్దంచేసుకొంటోంది. 2020-24లో అప్పటి టిటిడి బోర్డు లో కొందరు అక్రమాలు భారీగానే ఉన్నాయనేది ప్రధాన ఆరోపణ. ఇంకా మరింత కీలక సమాచారం సేకరించడానికి టిటిడి అధికారులను, మార్కెటింగ్, కొనుగోలు కమిటీ సభ్యులను మరోసారి పిలిచి వివరాలు రాబట్టేందుకు ముందుకు కదలనుంది. బోలేబాబాడెయిరీతోబాటు ఏఆర్ డెయిరీ,వైష్ణవి డెయిరీ, ప్రీమియర్‌అగ్రిఫుడ్స్‌తో ఒప్పందంతో భారీగా కమీషన్లు అందుకున్నారనే కోణంలో కూడా కల్తీనెయ్యి బాగోతంలో ముందుముందు ఎవరికి నోటీసులు వెళ్తాయో,ఎవరిని విచారణకు పిలిచి చర్యలు తీసుకుంటారనేది అందరిలో ఉత్కంఠే.

## మాజీ మంత్రి బొత్సకు మళ్లీ అస్వస్థత

**విజయవాడ.మార్చి6,ప్రభాతవార్తప్రతినిధి:** శాసన మండలిలో వైసీపీ పక్షనేత మాజీ మంత్రి బొత్స సత్యనారాయణమరోసారి అస్వస్థతకు గురయ్యారు. హైబీపీతో ఇబ్బంది పడుతున్న బొత్స.. మండలిలో మాట్లాడుతుండగా కింద పడబోయారు. దీంతో వెంటనే అసెంబ్లీ అధికార వర్గాలు అత్యవసరంగా వైద్యులను పిలిపించి, ఆయన ఛాంబర్‌లోనే వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు పరీక్షలు చేసిన తర్వాత.. ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని తెలిపారు. బీపీలో హెచ్చుతగ్గులు, సరైన సమయానికి భోజనం చేయకపోవడం వంటి కారణాల వల్ల ఆయన స్వల్ప అస్వస్థతకు గురయ్యారని వైద్యులు వివరించారు. విశ్రాంతి తీసుకోవాలని, అవసరమైతే మరిన్ని వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు. బొత్సతో హైదరాబాద్‌లోని సిటీ న్యూరో హాస్పిటల్ వైద్యుడు డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి ఫోన్‌లో మాట్లాడారు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. బొత్స సత్యనారాయణ హైబీపీతో ఇబ్బంది పడుతున్నారని, బీపీ కంట్రోల్‌లోకి రాకపోతే హాస్పిటల్‌కు వెళ్లాల్సి ఉంటుందని వైద్యులు సూచించారు. దీంతో బొత్సను సహచరులు ఆయన నివాసానికి తీసుకెళ్లారు. ప్రస్తుతం బొత్స సత్యనారాయణ ఆరోగ్యం నిలకడగానే ఉందని సమాచారం.

**బొత్సాకు మంత్రి లోకేష్ ఆత్మీయ పలకరింపు**

శాసనమండలిలో విపక్షనేత బొత్సను మంత్రి నారా లోకేష్ ఆప్యాయంగా పలుకరించారు.మొదట మంత్రి బొత్సాను బాగున్నారా అని పలుకరించినప్పుడు ఆయన ఇతర సభ్యులతో మాట్లాడుతూ మండలి చైర్మన్ మోషేన్‌రాజు ఆయనకు మంత్రి పిలుస్తున్నారని తెలిపారు.దాంతో బొత్సా లోకేష్ వైపుకు తిరిగారు.ఆయనను ఎంతో ఆత్మీయంగా లోకేష్ పలుకరించారు.ఆరోగ్యం విషయంలో శ్రద్ద వహించాలని సూచించారు. బొత్సా లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. బొత్స ఇటీవల అస్వస్థతకు గురయ్యారు.

## లిక్కర్ కేసులో ఇడి దూకుడు.. రూ.441 కోట్ల ఆస్తులు జప్తు!

**విజయవాడ,మార్చి6,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ లిక్కర్ కేసులో నిందితుల ఆస్తులు ఈడీ అటాచ్ చేసింది. ఈ కేసులో కీలక నిందితులకు సంబంధించిన సిట్ ఇచ్చిన ఆధారాల నివేదికను అనుసరించి ఈడీ చాలా వేగంగా స్పందించింది .రూ.441 కోట్ల ఆస్తులు అటాచ్ చేసుకున్న ఈడీ నిందితులు కసిరెడ్డి, వాసుదేవరెడ్డి, చాణక్య ఆస్తులు అటాచ్ చేసింది. రూ.1048 కోట్లు కొల్లగొట్టారని ఈడీ పేర్కొన్నది.

## తిరుపతిలో 30వేలు 'ఉద్యమి' సభ్యత్వం లక్ష్యం

### - జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్



**తిరుపతి, మార్చి 6ప్రభాతవార్తప్రతినిధి:** యాత్రాస్థలం,స్మార్ట్‌సిటీ తిరుపతినగరంలో జనసేన పార్టీ "ఉద్యమి" క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం మొదలుపెట్టామని తిరుపతి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్ తెలిపారు. ఈ ఏడాది 30వేల సభ్యత్వాలు నిర్దేశంగా తీసుకుని నమోదు చేయించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. గత ఏడాది 16వేల సభ్యత్వాలు చేశామన్నారు. శుక్రవారం ఉదయం తిరుపతినగరంలో ఆర్‌సిరోడ్డు ప్రాంతంలో పళని థియేటర్ సమీపంలో జనసేన పార్టీ "ఉద్యమి" క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. తిరుపతి నగరంలో నాలుగు కేంద్రాల్లో చురుగ్గా సాగుతున్న ఈసభ్యత్వ నమోదు ప్రక్రియలో పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి పలు రకాల ఉపయోగాలు ఉంటాయన్నారు.జనసేన క్రియాశీలక సభ్యులకు ప్రమాదం జరిగితే వైద్యంకోసం ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం 50 వేలరూపాయలు నుండి 2లక్షల రూపాయల వరకు జనసేన సాయం అందిస్తుందన్నారు. దురదృష్టవశాత్తు సభ్యుడు మరణిస్తే ఆ కుటుంబానికి 5 లక్షల రూపాయలు ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు జనసేనాని, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారన్నారు. దేశంలో మరే రాజకీయ పార్టీ చేయని విధంగా వేలాది మంది కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలుస్తున్న జనసేన పార్టీకి సభ్యులు,కార్యకర్తలే బలమన్నారు.లక్షలాది రూపాయల సాయం కార్యకర్తలకు అందించిన చరిత్ర జనసేనకు ఉందన్నారు..మరణించిన వారి కుటుంబ సభ్యులకు ఆర్థికంగా చేయూతనందించిన దాఖలాలు వైసిపికి ఉందా అని కిరణ్ ప్రశ్నించారు. జనసేనలో సభ్యులకు కూడా జనసేనాని కుటుంబంలా భావిస్తారన్నారు.

## రాబోయే యేడాదికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం

### - సిఎం చంద్రబాబు

**విజయవాడ మార్చి 06 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఎలాంటి విభేదాలు లేకుండా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందని సీఎం చంద్రబాబు అన్నారు. మూడు పార్టీల నేతలు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా శాసనసభలో చంద్రబాబు మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టి అప్పులు తెచ్చుకున్నారు. ఇష్టానుసారం అప్పులు చేసి ప్రజలపై భారం మోపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రీషెడ్యూల్ చేయించాం. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పథకాలు కొనసాగిస్తున్నాం. రాబోయే ఏడాదికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. కేంద్రం సహకారంతో ప్రపంచం మెచ్చేలా అమరావతిని తీర్చిదిద్దుతున్నాం. మూడు పార్టీల్లోనూ చాలామంది కొత్త సభ్యులు వచ్చారు. అప్పటి ప్రభుత్వం పై పోరాడిన వారిలో చాలామందికి సీట్లిచ్చాం.

నిలబెట్టిన అభ్యర్థుల్లో 94 శాతం మందిని గెలిపించారంటే అది మాపై ప్రజల్లో ఉన్న నమ్మకం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి సఖ్యతతో పనిచేస్తున్నాయి. రాష్ట్రాన్ని గట్టెక్కించే బాధ్యత తీసుకొని ముందుకెళ్తున్నాం. ప్రతిపక్ష హోదా ఎవరో ఇచ్చేది కాదు.

ప్రజలు ఇవ్వాలి. వారికి ప్రతిపక్ష హోదాకు తగ్గట్లుగా సీట్లు ఇవ్వలేదు. ఇప్పటికీ బాధ్యత లేకుండా వైకాపా వాళ్లు మాట్లాడుతున్నారు అని చంద్రబాబు మండిపడ్డారు.

## రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్లను ప్రోత్సహిస్తాం: మంత్రి నారా లోకేశ్

**విజయవాడ మార్చి 06 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్లను పెద్దఎత్తున ప్రోత్సహిస్తామని ఏపీ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ల వివరాలు, ఈఎంసీలో పరిశ్రమలకు ఇప్పటికే కేటాయించిన భూ విస్తీర్ణం, ఖాళీగా ఉన్న భూ విస్తీర్ణంపై మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో మూడు ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్లు ఉన్నాయన్నారు. ఏపీలో డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ సర్కారు ఉంది కాబట్టే ఇక్కడ పెట్టుబడులు పెట్టాలని, ఎలక్ట్రానిక్ ఎకో సిస్టమ్ ఏర్పాటు చేయాలకి కేంద్రం కూడా ప్రోత్సహిస్తోందన్నారు. ఇందులో భాగంగా విశాఖలో ఏసిప్ అనే సంస్థకు భూములు కేటాయించినట్లు చెప్పారు. ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్లను పెద్దఎత్తున ప్రోత్సహిస్తామని, చిన్న చిన్న సమస్యలు ఏమైనా ఉంటే యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు.

## నేడు ఢిల్లీ సదస్సుకు సిఎం చంద్రబాబు

### సాంకేతికత, సుపరిపాలనపై ముఖ్యమంత్రి ప్రసంగం

**విజయవాడ,మార్చి 6,ప్రభాతవార్తప్రతినిధి:** దేశ రాజధాని ఢిల్లీలో జరిగే ప్రతిష్టాత్మక రైసినా డైలాగ్ 2026 సదస్సుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం హాజరుకానున్నారు. ఈ అంతర్జాతీయ సదస్సులో సాంకేతికత సుపరిపాలన, భవిష్యత్ అంశాలపై సీఎం కీలక ఉపన్యాసం చేయనున్నారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ సంయుక్తంగా ఈ ప్రతిష్టాత్మక సదస్సును నిర్వహిస్తున్నాయి. ఇందులో పాల్గొనేందుకు రేపు ఉదయం 10.50 గంటలకు సీఎం విజయవాడ నుంచి ఢిల్లీకి బయల్దేరి వెళ్లనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు తాజ్ ప్యాలెస్ లో జరిగే రైసినా డైలాగ్ 2026 సదస్సుకు ముఖ్యమంత్రి హాజరవుతారు. అనంతరం ఆయన అమరావతి తిరిగి రానున్నారు. 2016 నుంచి ఎంఓఈఏ ఓఆర్ఎఫ్ సంస్థలు రైసినా డైలాగ్ పేరిట ఈ సదస్సును నిర్వహిస్తున్నాయి. ప్రపంచ రాజకీయాలు అంతర్జాతీయంగా మారుతున్న ఆర్థిక వ్యవస్థపై ప్రపంచ స్థాయిలో చర్చించే అత్యున్నత వేదికగా రైసినా డైలాగ్ సదస్సుకు మంచి పేరుంది. వివిధ దేశాల అధినేతలు, మంత్రులు, అత్యున్నత సైనిక అధికారులు, విధానకర్తలు, మేధావులు, నిపుణులు ఒకే వేదికపై గ్లోబల్ వ్యూహాలను చర్చించేలా ఈ సదస్సు జరగనుంది. అంతర్జాతీయంగా పేరొందిన మ్యూనిచ్ సెక్యూరిటీ కాన్ఫరెన్సు లాంటి ప్రతిష్టాత్మక వేదికల సరసన రైసినా డైలాగ్ నిలుస్తోంది. ఈ ఏడాది జరగనున్న 11వ ఎడిషన్ రైసినా డైలాగ్ సదస్సు సంస్కార అన్వేషణ, సమన్వయం, పురోగతి అనే థీమ్‌తో నిర్వహిస్తున్నారు. 110 దేశాలకు చెందిన 2,700 మంది ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరు కానున్నారు. ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ రైసినా డైలాగ్ సదస్సులో కీలకోపన్యాసం చేస్తారు. దేశంలో అభివృద్ధి పథాన నడుస్తున్న రాష్ట్రంగా ఏపీలో అమలు చేస్తున్న సుపరిపాలన డిజిటల్ అంశాలపై ముఖ్యమంత్రి తన ప్రసంగంలో వివరించనున్నారు.

రియల్ టైమ్ గవర్నెన్స్, డేటా ఆధారిత విధాన నిర్ణయాల ద్వారా ప్రజలకు అందుతున్న మెరుగైన పౌరసేవల గురించి ఈ సదస్సులో ప్రస్తావించనున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అంతర్జాతీయ ఆవిష్కరణల కేంద్రంగా, అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్ డెస్టినేషన్‌గా మార్చేందుకు అనుసరిస్తున్న దార్శనిక నిర్ణయాలను ప్రపంచ దేశాల ముందు ఉంచనున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎకోసిస్టమ్స్, డేటా సెంటర్లు, క్లీన్, గ్రీన్ ఎనర్జీ, నెక్స్ట్ జనరేషన్ టెక్నాలజీ కారిడార్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ముఖ్యమంత్రి తన ప్రసంగంలో వివరించనున్నారు.

## కందుపై ఎత్తిపోతల నిర్మాణాన్ని పరిశీలిస్తాం

### - మంత్రి నిమ్మల రామానాయుడు

**విజయవాడ మార్చి 06 ప్రభాతవార్త ప్రతినిధి:** కందు నదిపై ఎత్తిపోతల పథకం నిర్మాణానికి ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. శాసనసభలో గురువారం ఎత్తిపోతల పథకంపై ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. గతంలో ఉయ్యాలవాడ, కాకరవాడ ఎత్తిపోతల పథకాల నిర్మాణ ప్రతిపాదనను గత ప్రభుత్వం 2023లో తిరస్కరించిందని తెలిపారు. హరివరం వద్ద ఎత్తిపోతల పథకంపై ఆయకట్టు, రైతులు తదితరాలపై సర్వేచేసి పరిశీలిస్తామని మంత్రి పేర్కొన్నారు. శిల్పా వెంచర్స్ కెనాల్‌ను ఆక్రమించి, లేఅవుట్ వేసినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని, దీనిపై కోర్టును ఆశ్రయిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. మంత్రి రామానాయుడు స్పందిస్తూ శిల్పా వెంచర్స్ ఎన్వోసీ రద్దు చేశామని, వారు హైకోర్టుకు వెళ్లి స్టే పొందారని,

స్టే రద్దయ్యాక తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. తూర్పు, పశ్చిమ, సెంట్రల్ గోదావరి డెల్టా ప్రక్షాళనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, వీటి ఆధునికీకరణకు లైడార్ సర్వే చేయించామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఏప్రిల్ కల్లా డీపీఆర్ సిద్ధమవుతుందని, తర్వాత సీఎంతో చర్చించి నిధులు సమకూర్చుకోవడంపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. శాసన సభలో గురువారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో సెంట్రల్ డెల్టా డ్రెయిన్ విధానంపై చర్చలో మంత్రి మాట్లాడారు.

# తిరుమల సమాచారం

## నెల రోజులు చాలా విషయాలు నేర్చుకున్నా

### - పూర్వజన్మ సుకృతమని ముద్దాడ ఆనందం
### - టిటిడి ఇఒగా పూర్తిస్థాయి బాధ్యతలు



**తిరుమల, మార్చి 6ప్రభాతవార్తప్రతినిధి:** ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం తిరుమలలో నెలరోజులు చాలా విషయాలు నేర్చుకున్నానని, గోవింద నామంతో ఏడుకొండలకు చేరుకుంటున్న శ్రీవారి భక్తులకు సాటి భక్తుడిగా సేవ చేస్తానని టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర తెలిపారు. ఇదివరకు ఇఒగా అదనపు బాధ్యతలు నిర్వహించిన ఆయన శుక్రవారం పూర్తిస్థాయిలో ఇఒగా బాధ్యతలు చేపట్టారు. శ్రీవారికి సేవ చేసే అవకాశం రావడం తన పూర్వజన్మ సుకృతమని ఆనందం వ్యక్తం చేశారు. భక్తుల నుండి పలు రకాలుగా సలహాలు సూచనలు వచ్చాయని, వాటిని తానే స్వయంగా పరిశీలించి ఆ అనుభవంతో భక్తులకు మంచి ఆధ్యాత్మిక అనుభూతి కలిగేలా ఏర్పాట్లు చేస్తామని తెలియజేశారు. టిటిడి ఇఒగా రెండవసారి పూర్తిస్థాయిలో బాధ్యతలు చేపట్టిన ముద్దాడ రవిచంద్రతో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి టిటిడి పాలకమండలి సభ్య కార్యదర్శిగా కూడా ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం రవిచంద్ర దంపతులు ఆనందనిలయంలోనికి చేరుకుని శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆశీస్సులందుకున్నారు.

రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించారు. టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి, జెఇఒలు వీరబ్రహ్మం, డాక్టర్ శరత్, సివిఎస్ఒ మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఓ భక్తుడిగా తనవంతు భక్తులకు మెరుగైన సేవలందిస్తానని తెలిపారు.

## శ్రీవారి అనుగ్రహం అందరిపై కలగాలి

### - సుప్రీంకోర్టు జడ్జి అరవింద్‌కుమార్



**తిరుమల,మార్చి 6ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి అనుగ్రహం ప్రజలందరిపై ఉండాలని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్‌కుమార్ ఆకాంక్షించారు. న్యాయమూర్తి దంపతులు శుక్రవారం తిరుమల ఆలయం వద్దకు విచ్చేశారు. ఆలయ అధికారులు స్వాగతం పలికారు. తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించిన న్యాయమూర్తి దంపతులు ఆనందనిలయంలోనికి చేరకని శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## పుట్టినరోజున శ్రీవారి ఆశీస్సులు సంతోషం : సినీనటి జాన్వీకపూర్



**తిరుమల,మార్చి 6ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని పుట్టినరోజు సందర్భంగా దర్శించుకుని ఆశీస్సులందుకోవడం సంతోషంగా ఉందని సినీనటి జాన్వీకపూర్ తెలిపారు. ప్రతి ఏటా పుట్టినరోజున ఇష్టదైవాన్ని దర్శించుకోవడం జరుగుతోందన్నారు. సినీనటి మహేశ్వరితో కలసి జాన్వీకపూర్ శుక్రవారం ఉదయంశ్రీవారి ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి విఐపి బ్రేక్‌లో స్వామివారి దర్శనం చేయించారు. వేదపండితులు వేదాశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఏడుకొండలస్వామి ఆశీస్సులతో తన పుట్టినరోజు జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందని ఆలయం వెలుపల మీడియాతో, అభిమానులతో పంచుకున్నారు. సినీనటి రుక్మిణీవసంత్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

## నిరుద్యోగ భృతిపై నిర్ణయం తీసుకోలేదు

### - యువజన సర్వీసుల మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి

**విజయవాడ,మార్చి6,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో నిరుద్యోగ భృతిపై ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని, దీనికి సంబంధించి ఎటువంటి పథకం అమలులో లేదని రాష్ట్ర యువజన సర్వీసులు శాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి అన్నారు. నిరుద్యోగ యువతకు ఆర్థిక సాయంపై శాసన మండలిలో వైసిపి సభ్యులు ఆర్.రమేష్‌యాదవ్, మొండితోక అరుణ్‌కుమార్, పెనుమత్స సూర్యనారాయణ రాజు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇస్తూ గత 20 నెలల కాలంలో రాష్ట్రంలో 6.28 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామని చెప్పారు. డిఎస్‌సి, పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలు 21 వేల మందికి ఇచ్చామని తెలిపారు. వివిధ ప్రైవేటు సంస్థల్లో మరికొంత మందికి ఉద్యోగాలు వచ్చాయని, దాదాపు ఆరు లక్షల మందికి నైపుణ్య శిక్షణ ఇప్పించామని, వివిధ సంస్థలు పెట్టుబడి పెట్టడం వల్ల 5 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు వస్తున్నాయని చెప్పారు. ఇందుకు వైసిపి సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. డిఎస్‌సి, పోలీసు కానిస్టేబుళ్ల ఉద్యోగాలకు వైసిపి హయంలో ఇచ్చిన నోటిఫికేషన్లకు సంబంధించినవేనని, గత 20 నెలల్లో ఏయే శాఖల్లో ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలన్నారు. అలాగే 6.24 లక్షల మందికి సంబంధించి అభ్యర్థుల జాబితాలను, వారికి ఇచ్చిన హోదాను, వేతనాల వివరాలను జిల్లాల వారీగా ఇవ్వాలని ఎమ్మెల్సీలు అరుణకుమార్, రమేష్ యాదవ్ డిమాండ్ చేశారు. చేతివృత్తుల్లో నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇచ్చామని ప్రభుత్వం చెప్పు కుంటుందని వైసిపి సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశం మొత్తం మీద నిరుద్యోగ రేటు 5.2 శాతం ఉంటే, రాష్ట్రంలో 8.2 శాతం ఉందని కేంద్ర ప్రభుత్వం రాజ్యసభలో వెల్లడించిందని తెలిపారు. మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా 20 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. 20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించకపోతే నిరుద్యోగ భృతి ఇస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం తప్పిదం వల్ల 900 కంపెనీలు రాష్ట్రం నుంచి వెళ్లిపోయాయని తెలిపారు.

## రెండో రోజు సునీల్ నాయక్ విచారణ

**విజయవాడ మార్చి 6 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో నిందితుడిగా ఉన్న ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ విచారణ రెండో రోజు కొనసాగుతోంది. హైకోర్టు ఆదేశాల మేరకు గురువారం నుంచి విచారణ ప్రారంభమైంది. విచారణాధికారి విజయనగరం ఎస్పీ దామోదర్ ఆధ్వర్యంలో రెండో రోజు విచారణ జరుగుతోంది. సాయంత్రం 5 గంటల వరకు గుంటూరులోని సీసీఎస్ స్టేషన్‌లో విచారణ కొనసాగనుంది. నిన్న దాదాపు 5 గంటల పాటు ఆయన్ను ప్రశ్నించారు. కేసుకు సంబంధించిన ప్రాథమిక అంశాలపైనే ఎక్కువగా ప్రశ్నలు అడిగినట్లు తెలిసింది.

సునీల్‌నాయక్ కొన్ని ప్రశ్నలకు అసంపూర్తిగా, మరికొన్నింటికి అరకొరగా, మొక్కుబడిగా సమాధానాలివ్వగా, ఇంకొన్నింటికి మౌనం వహించినట్లు సమాచారం.

## లడ్డూపై వైసిపి వితండవాదం

**విజయవాడ మార్చి 06 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల లడ్డూ కల్తీ విషయంలో తప్పు ఒప్పుకోకుండా వైకాపా నాయకులు వితండవాదం చేయడం శోచనీయమని భాజపా పార్లమెంటరీ బోర్డు సభ్యుడు, ఎంపీ కె.లక్ష్మణ్ ధ్వజమెత్తారు. విజయవాడలో గురువారం ఆయన మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం అవినీతి, అరాచక పాలనకు ప్రజలే బుద్ధి చెప్పారన్నారు. వైకాపా హయాంలో అనేక ఆలయాలపై దాడులు జరిగాయని, రథాలు దగ్ధం అయ్యాయని గుర్తుచేశారు. రాయలసీమకు హైస్పీడ్ రైల్ కారిడార్‌తో జవసత్వాలు వస్తాయని వివరించారు. దక్షిణాదిలో భాజపా అనూహ్య విజయాలు సాధిస్తుందన్నారు. దేశంలో త్వరలో జమిలి ఎన్నికలు తథ్యమని, ఆ దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రకటించిన ఆరు గ్యారెంటీలను గాలికి వదిలేసిందని విమర్శించారు. బీఆర్ఎస్ కుటుంబ పాలన, కాంగ్రెస్ అవినీతిపై ప్రజలు విసిగిపోయారని, రానున్న రోజుల్లో తెలంగాణలో భాజపా అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్‌నాయుడు, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గోపి శ్రీనివాస్, పార్టీ అధికార ప్రతినిధి యామినీ శర్మ తదితరులు పాల్గొన్నారు.

వార్త

అనివార్యమైన యుద్ధం అంటూ ఏదీలేదు.
యుద్ధం వస్తే అది మానవ వివేక వైఫల్యం వల్లే.

-బొనార్‌లా

# ఎండల మంటలు!

ఎండలు మండిపోతున్నాయి. ఎల్‌నినో ప్రభావం ముందస్తుగానే జనానికి తన ప్రతాపం చూపిస్తోంది. మే, జూన్ నెలల్లో ఉంటుందనుకున్న గ్రీష్మతాపం మార్చి 1నే తలుపులు తట్టింది. మొన్న హోలీ తర్వాత నుంచే ఎండలు పెరిగి నిప్పుల కొలిమిని తలపించే వాతావరణాన్ని చూస్తామని వాతావరణ శాఖ ముందుగానే హెచ్చరించింది. మే నెల నుంచే సాధారణ ఉష్ణోగ్రతలు కన్నా ఎక్కువగా నమోదవుతాయని విశ్లేషించినట్లుగానే ఎండలు భారీ ఉష్ణోగ్రతలు నమోదు చేస్తున్నాయి. మార్చి నుంచి మే వరకు వడగాల్పులు వీస్తాయని ప్రజల్ని ముందే జాగ్రత్త చేశారు. మార్చి మొదటి వారంలో పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగానే ఉన్నా ఆ తర్వాత పూర్తిగా మారిపోతాయి. గత పాతికేళ్ల సమాచారాన్ని క్రోడీకరించుకుంటే ఈ ఫిబ్రవరి నెల నాటికి అతి తక్కువ వర్షపాతమే నమోదైంది. మధ్యలో ఓ రోజు తెలుగు రాష్ట్రాలలో అకాల వర్షాలు పడ్డాయి. అవన్నీ రైతుకు హర్షం కలిగించేవి కాదు. వరి, కొన్ని వాణిజ్య, తోట పంటల సాగుపై తీవ్రప్రభావమే చూపింది. పసిఫిక్ మహాసముద్రంలో 'లానినో' పరిస్థితులు రానురాను బలహీనపడ్డాయి. పసిఫిక్ మహా సముద్రంలోని తూర్పు, మధ్య ప్రాంతాలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కన్నా ఎక్కువగా పెరిగే పరిస్థితే 'ఎల్‌నినో' ఈపరిస్థితుల 'ఎల్‌నినో' రుతుపవనాల మీద తీవ్రమైన ప్రభావం చూపెడుతుంది. గత అనుభవాలతో పోల్చి చూస్తే ఈసారి వర్షపాతం అతి తక్కువగా ఉంది. వ్యవసాయ రంగం దెబ్బతినే అవకాశం ఉంది. వర్షాధారిత ప్రాంతాల్లో పంటల సాగు గురించే అధికార్లు ఆలోచించి రైతుకు ప్రత్యామ్నాయాలు సూచించాల్సి ఉంటుంది. వాతావరణ పరిస్థితులలో అనిశ్చితి తప్పదు. వర్షపాతంలో తగ్గితే ఖరీఫ్‌సాగుపై ప్రతికూల ప్రభావం ఏర్పడ్తుంది. వరి, పత్తి మొక్కజొన్న సాగుపై నీటి కొరత ఏర్పడ్తుంది. అందుచే తక్కువ నీటి వనరుతో ఎక్కువ దిగుబడి వచ్చే రకాలను మాత్రమే నాటుకోవాలి. ఉత్తర, దక్షిణ ద్రోణి ప్రభావంతో మార్చి మొదటి వారంలో 37డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో వేడి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. సూర్యుడు సెగలు కక్కుతుండడంతో వేసవి తాపాన్ని తట్టుకోవడం చాలా కష్టంగా ఉంటుంది. దక్షిణ, మధ్య భారతంలోని వడగాల్పుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ కేంద్రాలు హెచ్చరికలు జారీ చేశాయి. ఎండల తీవ్రత, వేడి గాల్పులతోపాటు ఉక్కపోత కారణంగా ప్రజలకు వేసవి కష్టాలు మొదలౌతాయని ఆ ప్రకటనలు తెలియ చేస్తున్నాయి. ఇప్పుడదే జరిగింది. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో సీజన్‌లో వేడిగాలులు అధికంగా ఉండి పిల్లలు, వృద్ధులు, రోగగ్రస్తులపై ప్రభావాలు చూపిస్తాయి. ప్రధానంగా ప్రజారోగ్యం, విద్యుత్తు, నీటి వనరులరంగం వేసవి ప్రభావాన్ని ఎదుర్కొని ప్రజలకు ఇబ్బందులు తగ్గించే కృషిచేయాల్సి ఉంది. నీటి వనరుల సమతుల్యత లేక పర్యావరణం దెబ్బతింటుంది. ఇలా ఏర్పడే పరిస్థితులన్నీ గ్రహించుకుంటే వాతావరణానికి పెనుసవాల్ తప్పదు. వ్యవసాయాధారిత ప్రాంతాల్లో ఆహార సమృద్ధి పై కూడా కించిత్ ప్రభా వం ఉంటుంది. ఈ కారణం చేత గోధుమ, వరి, జొన్న, మొక్కజొన్న సాగుఉత్పత్తుల మీద పడుతుంది. వర్షపాతం తగ్గి ఉష్ణోగ్రతలు పెరగడం, తదనంతర పరిణామాలతో వరిసాగు విస్తీర్ణం తగ్గే అవకాశముంది. ఈసారి వేడిమి వ్యవసాయరంగ ఉత్పత్తులపై విపరీత ప్రభావం పడ్తుంది. అధిక ఉష్ణోగ్రతలకు తేమ తోడవడంవలన మానవాళి ఆరోగ్య పరిస్థితులపైప్రతికూల ప్రభావం పడుతుంది. ఇవన్నీ పలు శాస్త్రీయపరిశోధనలు వెల్లడించినవే. తెలుగు రాష్ట్రాల్లోని వాతావరణ పరిస్థితులపై వాతావరణ శాఖ ఇచ్చిన హెచ్చరికల నేపథ్యంలో దాదాపు పొడి వాతావరణం ఏర్పడ్తుంది. ఉత్తర ఒడిశా నుంచి దక్షిణ ఛత్తీస్‌గఢ్ మీదుగా విదర్భ వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీఎత్తులో ద్రోణివిస్తరించి కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్, ఉత్తర కోస్తా, రాయలసీమ దిగువ ట్రోపో ఆవరణంలో దక్షిణ, నైరుతి గాలులు వీస్తున్నాయి. ఒకటి రెండు చోట్ల పొగమంచు కురుస్తుంది. ఈ వేసవి సీజన్‌లో వాతావరణం, కొత్తరకం మిశ్రమ వాతావరణాన్ని తలపిస్తుంది. పొడి ఎండలో చెమట చిందిస్తే గాలిలో ఉన్న తేమతో కలిసి చిటపటలుతయారవుతుంది. శరీరంపై వేడికితమ రాజుకుని చర్మం మండుతుంది. అదే ఉక్కపోతకు జనం ఉక్కిరిబిక్కిరవుతారు. గాలిలో ఉష్ణోగ్రతతోపాటు తేమకూడా అధికంగా ఉంటుంది. ఇంట్లో కూర్చున్నా ఎసి కిందకూర్చున్నా ఇలాంటి అనుభవాన్ని చవిచూడాల్సి వస్తుంది. తీరప్రాంతాల్లో మానవ శరీరంపై తేమ వాతావరణం వలనపొక్కులు ఏర్పడుతాయని డాక్టర్లుచెబుతుంటారు. వాతావరణ వ్యవస్థలు అస్థిరంగా ఉండడం వల్ల సముద్ర పుగాలులు భూభాగంపైకి ఎక్కువ తేమను మోసుకొస్తాయని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. గతరెండేళ్లుగా మనం విభిన్న వాతావరణంలో సతమతమయ్యాం. పట్టణీకరణ పెరిగిన ఇటీవలకాలంలో భవనాలనుసిమెంటుతో నిర్మిస్తారు. పగటిపూట గ్రహించుకున్న వేడిమివలన రాత్రిళ్లు ఆ భవనాల గోడల్నించి 4నుంచి 5డిగ్రీల వేడిమిని కలుగచేస్తాయి. ఈపరిస్థితుల్లో శరీరంలో వేడిని చల్లపరిచేందుకైనా దాహం వేసినా వేయకపోయినా మంచినీటిని స్వీకరించాలి. తేమఎక్కువగా ఉన్న పరిస్థితుల్లో ఎ.సి వేసుకున్నా వేడిగాలివస్తుంది. అదికూడా మానవ శరీరానికి మంచిదికాదు. కిటికీలు తెరిచిఉంచుకోవడం, ఎగ్జాస్ట్ ఫాన్లు వాడుకోవడం మంచిది. వృద్ధులు, చంటిపిల్ల లైతే వేసవిలో ఇంటినుండి బయటకు రాకుండా ఉండటం మేలు.

# గాడి తప్పిన పాడి

**ఒక వ్యక్తి త్రికరణశుద్ధిగా ప్రయత్నం చేస్తే ఎంత చేయవచ్చో కురియన్ చేతల్లో చూపెట్టారు. గుజరాత్ పాల సహకార సంఘాల ఉత్పత్తి ఆనాడు రెండువందల నలభైఏడు లీటర్లు. ఇప్పుడది నాలుగు వందల కోట్ల లీటర్లకుపైగా చేరింది. ప్రపంచంలో భారీగా పాల ఉత్పత్తి చేసి భారతదేశానికి ఖ్యాతి గడించింది. అమూల బ్రాండ్‌కు విశ్వవ్యాప్తంగా గుర్తింపు లభించింది. కురియన్ సాధించిన క్షీర విప్లవం వల్ల దేశంలో కోట్లాది మంది రైతు కుటుంబాలు ఆర్థికంగా స్థిరపడ్డారు. ఒకనాడు ఆయన ఉండటానికి చిన్న ఇల్లు ఇవ్వడానికి ఇష్టపడని గ్రామస్తులకు ఆయన ఆరాధ్యదైవం అయ్యారు. కోట్లాది మంది అన్నదాతల ఇళ్లల్లో దీపం వెలిగించిన కురియన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి.**

దామెర్ల సాయిబాబ

మానవుడికే కాదు, పశుపక్ష్యాదుల ఆరోగ్యానికి సవాలుగా మారుతున్న కల్తీని నిరోధించేందుకు పాలకులు చేస్తున్న ప్రయత్నాలు ఏమాత్రం ఫలించడం లేదు. దేశంలో రానురాను కల్తీ పెరిగిపోతున్నది. తాగే నీటిలో కల్తీ, పప్పులో కల్తీ, ప్రాణాపాయం నుండి కాపాడే మందుల్లో కల్తీ అన్నింటికంటే మించి వయసుతో ప్రమేయం లేకుండా పసిపిల్లల నుండి వృద్ధుల వరకు పౌష్టికాహారంగా సేవించే పాలల్లోకల్తీ ప్రమాదకరంగా మారుతున్నది. ఇంత ప్రమాదకరంగా మారుతున్నా పొగమంచులా అంతటా విస్తరిస్తున్నా అడిగేవారు, అడ్డగించేవారు కరవైపోతున్నారు. గత నెలలో ఆంధ్రప్రదేశ్ తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో కల్తీపాలు తాగి పది మందికిపైగా మరణించారు. మరికొందరు ఇప్పటికీ ఆస్పత్రుల్లో మృత్యు వుతో పోరాడుతున్నారు. అంతెందుకు కలియుగదైవం కోట్లాది మందికి ఇలవేల్పు తిరుమల వెంకన్న కూడా ఈ కల్తీ నుండి తప్పించుకోలేకపోయారు. కోట్లాది మంది భక్తులు అత్యంత పవిత్రంగా భావించే ప్రసాదం లడ్డూ కల్తీ నెయ్యితో తయారు చేసినట్లు బయటపడింది. ఒక్క లీటరు పాలు లేకుండానే కోట్లాది రూపాయల విలువైన నెయ్యిని తయారు చేసి దేవునికి సమర్పించి కోట్లాది రూపాయలు కొల్లగొట్టారు. ఇదేదో మూడోకంటికి తెలియకుండా జరగడం లేదు. బహిరంగ వ్యాపారమే. యూరియా లాంటి రసాయనిక ఎరువులను కలిపి తయారు చేసిన పాలను అమ్ముతున్నారు. గుజరాత్‌లో ఇటీవల అనుమతి లేకుండా నడుస్తున్న ఓ డెయిరీపై అధికారులు దాడులు చేస్తే విస్తుపోయే విషయాలు వెలుగు చూశాయి. మూడు వందల లీటర్ల పాలల్లో డిటర్జెంట్, యూరియా, కాస్టిక్‌సోడా కలిపిన 18వందల లీటర్ల ద్రావణాన్ని మిక్స్‌చేసి ప్యాకెట్ పాలుగా విక్రయిస్తు న్నట్లు అధికారులు గుర్తించారు. గత రెండు రోజులుగా హైదరాబాద్‌లలో అధికారులు జరుపుతున్న ఆకస్మిక దాడు ల్లో లక్షలాది రూపాయలు విలువైన టన్నుల కొద్దీ నకిలీ నెయ్యి పట్టుబడింది. అసలు స్వచ్ఛమైన పాల లభ్యత అనేది సమస్యగా మారిపోయింది. వాస్తవంగా చూస్తే యేడాదియేడాదికి పాల వినియోగం అంతకంతకు పెరుగు తుంటే అందుకు అనుగుణంగా ఉత్పత్తులు ఆ స్థాయిలో పెరగడం లేదు. పాల ఉత్పత్తులు పెంచేందుకు అటు రాష్ట్రాలు కానీ, ఇటు కేంద్ర ప్రభుత్వం కానీ ప్రవేశపెడు తున్న పథకాలు అంతగా ఫలితాలు ఇవ్వడం లేదు. గత రెండు, మూడు దశాబ్దాలుగా భారీఎత్తున చిన్నకారు రైతులకు సమృద్ధిగా పాలు ఇచ్చే సంకరజాతి ఆవులను, గేదెలను సరఫరా చేశారు, చేస్తున్నారు. కానీ అందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పించకపోవడంతో గిట్టుబాటుకాక అధిక శాతం రైతులు పాడిపశువులను అమ్ముకున్నారు. ముఖ్యంగా భూముల విలువలు పెరిగిపోయిన తర్వాత బీడుభూములు, ప్రభుత్వ భూములు దాదాపు అదృశ్యమైపోయాయనే చెప్పొచ్చు. ఉన్నా వాటి చుట్టూ ఆక్రమణలకు గురికాకుండా కంచెలు వేసుకున్నారు. దీంతో పశువులు తిరిగి మేయడానికి భూములు కరవైనాయి. అందుకే చిన్న రైతులు పాడికి మంగళం పాడుతున్నారు. ఇక డెయిరీల పరిస్థితి కూడా అంతంత మాత్రంగానే ఉన్నది. చిన్నాచితక డెయిరీలు పెద్ద సంఖ్యలో మూతపడ్డాయి. దాణాధరలు పెరగడం గిట్టుబాటు కాకుండా పోయాయి. వీటన్నింటికంటే మించి ఉపాధి హామీ పథకం ఏమేరకు ఉపయోగపడిందే ఏమో కానీ వ్యవసాయ రంగం, ప్రధానంగా పాడి పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. బీహార్, ఛత్తీస్‌గడ్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలనుండి వలస కూలీలు రాకపోతే ఉన్న కొద్దిపాటి డెయిరీల పరిస్థితి ప్రశ్నార్థకమే. ప్రభుత్వం వద్ద ఒక నిర్దిష్ట మైన ప్రణాళిక

## ఒక్క మాట

లేకపోవడం, పాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని చర్యలు తీసుకోకపోవడం వల్లనే ఈ పరిస్థితులు దాపురిస్తున్నాయి. వాస్తవంగా చూస్తే మన పూర్వీకులు పశు సంపదకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారు. ఒకనాడు రాజుల సంపద వారికున్న గోవులతోనే అంచనా వేసేవారు. వ్యవ సాయ అనుబంధ రాబడి పెంచితే తప్ప కోట్లాది గ్రామీణ పేదల పరిస్థితి మెరుగుపడదని మహాత్ముడు ఎన్నోసార్లు వక్కాణించారు. పాల ఉత్పత్తి అందుకు ఒకమార్గం. ఆ కోణంలో ఆనాటి పాలకులు ప్రయత్నించారు. పాలనిల్వలకు ఆనాడు దేశంలో సదుపాయాలు లేకపోవడం, పాల పొడిని తయారు చేస్తే వర్షాకాలంలో మిగులు, ఎండాకాలంలో కొరతను అధిగమించి రైతులకు గిట్టుబాటు ధర కల్పించ వచ్చుననే అభిప్రాయాలు స్వాతంత్ర్యం సాధించిన మొదట్లోనే వెల్లడయ్యాయి. నెదర్లాండ్ నుంచి ఆయా కంపెనీల ప్రతినిధులను పిలిపించి భారత్‌లో సర్వేచేయించారు. బహిరంగ మరుగుదొడ్ల వినియోగం వల్ల వాతావరణం అంతా బాక్టీరియాతో కలుషితమైందని ఆవుపాలతో తప్పగేదె పాలతో కండెన్స్ పాలను తయారు చేయలేమని వారు నిస్సహాయత వ్యక్తం చేశారు. ఆనాడు సర్దార్ వల్లభాయ్ పటేల్ జోక్యం వర్గీస్ కురియన్ రంగప్రవేశం చేసి గేదెపాలతో పాశ్చాత్య దేశాలకు దీటుగా కండెన్స్ పాలను తయారు చేశారు. నిజం చెప్పాలంటే భారతదేశంలో క్షీరవిప్లవానికి నాంది పలికిన వ్యక్తి కురియన్. కురియన్ ప్రస్థావన వచ్చింది కనుక ఆయన గురించి కొంత తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. కేరళ రాష్ట్రానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన కురియన్ ఆనాటి బ్రిటిష్‌ప్రభుత్వం స్కాలర్‌షిప్‌తో అమెరికాలో చదువు పూర్తి చేసుకొని గుజరాత్‌లో 'ఆనంద్' అనే గ్రామంలో ఒక చిన్న పరిశ్రమలో ఉద్యోగిగా చేరారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ సహచరుడు కేశవ్‌భాయ్ పటేల్ కురియన్‌లో దాగి ఉన్న అసాధారణ ప్రతిభను గుర్తించి అప్పటికే తమగ్రామంలో నష్టాల ఊబిలో నడుస్తున్న పాల ఉత్పత్తిదారులసంఘం నిర్వహణకు సహ కరించమని అభ్యర్థించారు. ఆయన ప్రవేశంతో ఆ పాల సంఘాల రైతుల ఆర్థిక పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. పాల ఉత్పత్తి ఉద్యమంగా గుజరాత్ రాష్ట్ర మంతటా విస్తరించిన సమాచారం ఢిల్లీకి చేరింది. ఆనాటి ప్రధాని జవహర్‌లాల్‌నెహ్రూ కొంత ప్రోత్సాహం అందించారు. ఆ తర్వాత ప్రధానిగా వచ్చిన లాల్‌బహదూర్ శాస్త్రి విషయం తెలుసుకొని క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలుసుకునేందుకు గ్రామంలోని రైతు ఇంటికి స్వయంగావెళ్లారు. కానీ ఆ రైతుకు తన ఇంటికి వచ్చింది ఎవరో తెలియదు. ఆ రాత్రి శాస్త్రి రైతు ఇంట్లోనే ఉండి ఆ కుటుంబం మొత్తానికి తానే స్వయంగా రొట్టెలు చేసి ఇచ్చారట. అలావారిని మాటల్లో దింపి పాలఉత్పత్తిలోని సాధక బాధకాలను, వారు నష్టాల ఊబి నుంచి ఎలా విజయ పథం వైపు నడిచారో తెలుసుకున్నారు. మరుసటి రోజు ఉదయం అధికారులు వచ్చి శాస్త్రిని కలిసేవరకు తమ ఇంటికి వచ్చింది, తమతో గడి పింది దేశ ప్రధాని అనే విషయం ఆ రైతుకు కానీ, ఆ గ్రామ ప్రజలకు కానీ తెలియదు. అక్కడ పరిస్థితులను గమనించిన శాస్త్రి జాతీయ స్థాయిలో నేషనల్ డెవలప్‌మెంట్ బోర్డు స్థాపిస్తానని దానికి నేతృత్వం వహించేందుకు ఢిల్లీకి రమ్మని ఎంతగా కోరినా కురియన్ మర్యాద పూర్వకంగా తిరస్కరించారు. తాను అక్కడికి రాలేనని, ఒకవేళ వచ్చినా ఉపయోగం ఉండదని, అక్కడ అధికారులు, ఉద్యోగులు తప్ప రైతులుండరని కురియన్ శాస్త్రికి సూటిగా చెప్పారు. ఆయనమాట ల్లోని వాస్తవాన్ని, ఆంతర్యాన్ని గ్రహించి లాల్‌బహదూర్ శాస్త్రి నేషనల్ డెయిరీ డెవలప్ మెంట్ బోర్డు కేంద్ర కార్యా లయాన్ని ఢిల్లీలో కాకుండా కురియన్ ఉంటున్న ఆనంద్ గ్రామంలోనే నెలకొల్పి సారథ్య బాధ్యత అప్పగించారు. ఒక వ్యక్తి త్రికరణ శుద్ధిగా ప్రయత్నం చేస్తే ఎంత చేయవచ్చో కురియన్ చేతల్లో చూపెట్టారు. గుజరాత్ పాలసహకార సంఘాలఉత్పత్తి ఆనాడు రెండువందల నలభైఏడు లీటర్లు. ఇప్పుడది రోజుకు నాలుగు వందల కోట్ల లీటర్లకుపైగా చేరింది. వార్షిక ఆదాయం అరవై ఐదువేల కోట్లకు పైగా చేరుకు న్నది. ప్రపంచంలో భారీగా పాలఉత్పత్తి చేసి భారతదేశానికి ఖ్యాతి గడించింది. అమూల బ్రాండ్‌కు విశ్వవ్యాప్తంగా గుర్తింపు లభించింది. కురియన్ సాధించిన క్షీర విప్లవం వల్ల దేశంలో కోట్లాదిమంది రైతు కుటుంబాలు ఆర్థికంగా స్థిరపడ్డారు. ఒకనాడు ఆయన ఉండటానికి చిన్న ఇల్లు ఇవ్వడానికి ఇష్టపడని గ్రామస్తులకు ఆయన ఆరాధ్య దైవం అయ్యారు. కొందరు రైతులు తమ పిల్లలకు కురియన్ పేరు పెట్టుకు న్నారు. కోట్లాది మంది అన్నదాతల ఇళ్లల్లో దీపం వెలిగిం చిన కురియన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి. అంతటి అంకిత భావంతో పనిచేయకపోయినా ఆ బాటలో పయనించే దిశగా పాలకులు చర్యలు చేపడితే అవసరం మేరకు పాలఉత్పత్తి పెరుగుతుంది. అలాగే కల్తీయే తమ వ్యాపకంగా మార్చుకొని అమాయకుల జీవితాలను కబళిస్తున్న దళారులను ఉక్కుపాదంతో అణిచివేయాలి. ●

# పేదల పాలిట వరం జనరిక్ ఔషధాలు!

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

భారత ప్రభుత్వ రసాయనాలుఎరువుల మంత్రిత్వశాఖ నేతృత్వంలో ప్రతి ఏటా 01 మార్చి నుంచి 07 మార్చి వరకు జన ఔషధి వారోత్సవాలు పెద్ద ఎత్తున నిర్వహించబడుతున్నాయి. ఈ వారోత్సవాల చివరి రోజు 07 మార్చి రోజున 'జనరిక్ ఔషధాల దినోత్సవం" లేదా 'జన ఔషధి దివస్' కూడా పాటించడం గత 8 ఏండ్లుగా ఆనవాయితీగా మారింది. దేశవ్యాప్తంగా 250కి పైగా ప్రత్యేక కేంద్రాల ద్వారా ఉచితంగా ఆరోగ్య తనిఖీ శిబిరాలు నిర్వహిస్తోంది. సరసమైన ధరలకు నాణ్యమైన జనరిక్ ఔషధాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించడమా లక్ష్యంగా 8వ జనరిక్ ఔషధాల దినోత్సవం నిర్వహించుకోవడం జరుగుతున్నది. జనరిక్ ఔషధాలు, ఇన్ఫెక్షన్లు, దీర్ఘకాలిక వ్యాధులు, పిల్లల సంరక్షణ, నెఫ్రాలజీ, మధుమేహం, కంటి పరీక్షలు, ఫిజియోథెరపీ లాంటి సేవలు ఈ కేంద్రాల ద్వారా సామాన్య ప్రజలకు ఉచితంగా అందుతున్నాయి. జనరిక్ ఔషధాలు భద్రత, నాణ్యత, సామర్థ్యాలకు ప్రతీకల్ని తెలుసుకోవాలి. బ్రాండెడ్ మందులకు సమానమైన ప్రత్యామ్నాయమైన ఔషధాలుగా జనరిక్ ఔషధాలు పేద ప్రజలకు ఆర్థిక భద్రతను, ఆరోగ్య సురక్షను కలిగిస్తున్నాయి. ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి పరియోజన కింద స్థాపించబడిన ప్రధానమంత్రి జన ఔషధం కేంద్రాల ద్వారా తక్కువ ధరలకు నాణ్యమైన ఔషధాలను ప్రజలకు అందుబాటులో ఉంచారు. జన ఔషధీ సప్తాహ్ (జనరిక్ ఔషధాల వారోత్సవాలు)" వేదికగా ఉచిత సాధారణ పరీక్షలు, రక్త పరీక్షలు, రక్తపోటు పర్యవేక్షణ, థైరాయిడ్ పరీక్షలతో పాటు విస్తృత శ్రేణి సేవలను అందిస్తున్నారు. ఈ శిబి



రాల్లో జనరిక్ ఔషధాలను ఉచితంగా అందిస్తున్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 18,000లకు పైగా జన ఔషధి కేంద్రాలు పని చేస్తున్నాయి. మార్చి 2027నాటికి వీటిని 25వేల వరకు పెంచడానికి పటిష్ట చర్యలు అమలు చేస్తున్నారు. బ్రాండెడ్ ఔషధాల ధరలతో పోల్చితే జనరిక్ ఔషధాల ధరలు 30 నుంచి 80 శాతం వరకు తక్కువగా ఉండడం వల్ల సామాన్య రోగులకు జనరిక్ ఔషధ కేంద్రాలు వరంగా మారుతున్నాయి. జన ఔషధి దివస్2026 ఇతివృత్తంగా 'జన ఔషధి సస్తీ భీ, భరోసే మంద్ భీ, సహత్ కీ బాత్, బచత్ కే సాథ్ (చవకైన, నాణ్యమైన జనరిక్ ఔషధాలతో సంపూర్ణ ఆరోగ్యం)" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహించడం జరుగుతున్నది. జన ఔషధీ కేంద్రాలను గుర్తించడానికి, మందులను పొందడానికి జన ఔషధీసుగం" మొబైల్ యాప్‌ను కూడా అందుబాటులోకి తేవడం హర్షదాయకం. ధరలు తక్కువ.. నాణ్యత ఎక్కువ, లేదా దామ్ కమ్ దవాయి ఉత్తమ్" నినాదంతో జన ఔషధీ దినోత్సవం పేద ప్రజల ఆరోగ్య సంరక్షణలో మరింత ఉత్తమమైన సేవలను అందించారని కోరుకుందాం. అధిక ధరలు కలిగిన బ్రాండెడ్ ఔషధాలకు బదులు అత్యంత చవకైన జనరిక్ ఔషధాలను వాడుకుందాం. ఆర్థిక, ఆరోగ్య సంరక్షణకు జనరిక్ ఔషధ కేంద్రాలను సందర్శిద్దాం. బ్రాండెడ్ మందులు ఆకర్షణీయమైన పేర్లతో అందుబాటులో ఉన్నప్పటికీ, జనరిక్ ఔషధాలు మాత్రం ప్రధాన రసాయన సమ్మేళనం పేరుతో అమ్మబడుతాయి. పౌర సమాజాన్ని జనరిక్ ఔషధాల పట్ల చైతన్యం కలిగిద్దాం. నాణ్యతలో రాజీ పడని జనరిక్ ఔషధాలు, నేడు మార్కెట్‌ను ముంచెత్తుతున్న బ్రాండెడ్ మందులకు పోటీగా, బయో ఈక్వలెంట్ నిలబడుతున్నాయని గమనించి పేద ప్రజలు చైతన్యవంతులై జనరిక్ మందులను విధిగా వాడాలి. ●

# రెండు వేల యేళ్ల కుల వివక్ష ఇంకెన్నాళ్లు?



పురుషోత్తం నారగొని

మనం అంతరిక్షంలోకి ఉపగ్రహాలను పంపుతున్నాం.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో అద్భుతాలు సృష్టిస్తున్నాం. దేశం 'విశ్వగురు' స్థానానికి ఎదుగుతోందని జబ్బలు చరుచుకుంటున్నాం. కానీ, మన పల్లెల్లో పేరుకుపోయిన కుల అహంకారపు చీకట్లను మాత్రం పారద్రోల లేకపోతున్నాం. మనుషులంతా సమానమే అని చాటిచెప్పే దేవాలయాల సాక్షిగా, దైవ దర్శనానికి వెళ్లిన ఒక దళిత బహుజన జంటపై అగ్రవర్ణ అహంకారం పడగవిప్పిన తీరు.. ఆ దాష్టీకానికి రెండు నెలల పసికందు ఫుట్‌బాల్‌లా ఎగిరిపడి ప్రాణాలు వదిలిన ఉదంతం యావత్ తెలంగాణ సమాజాన్ని సిగ్గుతో తలదించుకునేలా చేసింది. నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో జరిగిన ఈ అమానుషం కేవలం ఒక శిశువు హత్య కాదు, మన వ్యవస్థీకృత సామాజిక మనస్సాక్షికి పట్టిన నిలువెత్తు క్యాన్సర్‌కు సజీవ సాక్ష్యం. నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలోని మల్లికార్జున స్వామి (మల్లన్న) జాతర ఎంతో పవిత్రమైనది. ఆ పవిత్రతను కాపాడాల్సిన నిర్వాహకులే రాక్షసులుగా మారారు. గ్రామానికి చెందిన దళిత సామాజిక వర్గానికి చెందిన భార్య, భర్తలు తమ రెండు నెలల పసిపాపతో కలిసి దేవుడి ఆశీస్సుల కోసం జాతరకు వెళ్లారు. కులాంతర ఆదర్శ వివాహం చేసుకుని తమ బతుకుదెరువు తాము చూసుకుంటున్న ఆ నిరుపేద దంపతుల పాలిట అగ్రకులఅహంకారం యమపాశంగా మారింది. ఆలయం వద్ద భక్తుల నుంచి అక్రమంగా రూ.100 వసూలు చేస్తుండటాన్ని ప్రశ్నించడమే ఆ దంపతులు చేసిన నేరమైంది. బహుజన, దళిత వర్గాలకు చెందిన వారు తమను నిలదీయడాన్ని అక్కడి పెత్తందారులు జీర్ణించుకోలేకపోయారు. 'నీ కులమేంటి? గుళ్లోకి వస్తావా?' అంటూ కులం పేరుతో అసభ్యంగా దూషిస్తూ సర్పంచ్, మరికొందరు అనుచరులు ఆ దంపతులపై భౌతిక దాడికి దిగారు. ఈ అమానుషమైన తోపులాటలో తల్లి చేతిలోని పసికందు కిందపడిపోవడం, దయలేని ఒక కసాయివాడు ఆ రెండు నెలల పసిపాపను కాలుతో ఫుట్‌బాల్‌ను తన్నినట్టు తన్నడం అత్యంత పాశవికం. అంతర్గత గాయాలతో విలవిలలాడిన ఆ శిశువు, ఆసుపత్రిలో మృత్యువుతోపోరాడి కన్నుమూసింది. కడుపుబ్బ నవ్వాల్సిన వయసులో, గుక్కెడు పాలు తాగే ఆ పసికందు వాళ్లకు ఏ ద్రోహం చేసిందని అంత కిరాతకంగా చంపేశారు? ఈ కుల ఉన్మాదంఈనాటిది కాదు. కారంచేడు, చుండూరులలో దళితుల నెత్తుటి మరకలు ఇంకా పూర్తిగా చెరిగిపోలేదు. మొన్నటికి మొన్న మిర్యాల గూడలో కులాంతర వివాహం చేసుకున్నందుకు దళిత



యువకుడు ప్రణయ్‌ని నడిరోడ్డుపై నరికి చంపిన అగ్రకుల అహంకారం.. నేడు కుమ్మెరలో పసికందు ప్రాణం తీసింది. గుళ్లోకి వెళ్లినందుకు దళితులను చెట్లకు కట్టేసి కొడుతున్న ఘటనలు, గుడి మైలపడిందని అపరాధ రుసుములు విధిస్తున్న దారుణాలు ఈ 'డిజిటల్ ఇండియా'లో మనం రోజూ చూస్తూనే ఉన్నాం. కులాంతర వివాహం చేసుకుని, తల ఎత్తుకుని బతుకుతున్న దళిత, బహుజన దంపతులు దైవ దర్శనానికి వెళ్లడం ఈ ఆధునిక యుగంలో కూడా నేరమేనా? అక్షరాస్యత పెరిగినా, ఆర్థికంగా ఎదిగినా, కుల వివక్ష అనే జబ్బుకు మాత్రం సమాజం ఇంకా చికిత్స కనుక్కోలేకపోతోంది అనడానికి కుమ్మెర ఘటనే నిదర్శనం. ఈ ఘటనలో కుల అహంకారం ఎంత దారుణమో, పోలీసు వ్యవస్థ వ్యవహరించిన తీరు అంతకంటే దారుణం. ఒక పసికందు ప్రాణాపాయ స్థితిలో ఉంటే, బాధిత దంపతులు పోలీసుల వద్దకు వెళ్తే కనీసం ఫిర్యాదు తీసుకునే నాథుడే కరువయ్యాడు. పైగా, దాడి చేసిన అగ్రవర్ణ పెత్తందారులు ఇచ్చిన కౌంటర్ ఫిర్యాదును ఆధారం చేసుకుని, బిడ్డను పోగొట్టుకున్న ఆ అభాగ్యులపైనే పోలీసులు కేసులు నమోదు చేయడం వ్యవస్థ పనితీరుకు పరాకాష్ట. పసిపాప చనిపోయిన తర్వాత కూడా నిందితులపై తక్షణమే హత్య కేసు, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయకుండా పోలీసులు మీనమేషాలు లెక్కించడం వెనుక ఆంతర్యం ఏమిటి? ప్రధాన నిందితుడైన సర్పంచ్‌కు స్థానిక పాలకుల అండదండలు ఉండటం వల్లే పోలీసులు బానిసల్లా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలను ఎలా కొట్టిపారేయగలం? రక్షక భటులే భక్షకులకు వత్తాసు పలికితే ఇక సామాన్యుడికి ఈ దేశంలో రక్షణ ఎక్కడుంది? ఈ దారుణంపై రాష్ట్రవ్యాప్తంగా దళిత, బహుజన, ప్రజాసంఘాలు భగ్గుమన్నాయి. వ్యవస్థలు నిద్రావస్థలో ఉన్నప్పుడు, ఒక న్యాయవాది ఫిర్యాదు మేరకు జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) సుమోటోగా కేసు నమోదు చేయడం వ్యవస్థలో ఇంకా మిగిలి ఉన్న కొంత న్యాయానికి ఆశాకిరణం. రాజకీయ పార్టీలు, పౌర హక్కుల సంఘాలు వీధుల్లోకి వచ్చి నినదిస్తే తప్ప పోలీసుల కళ్లు తెరచుకోకపోవడం ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటు. ఇది కేవలం ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన గొడవ కాదు. తరతరాలుగా మన నరనరాన జీర్ణించుకుపోయిన కుల వివక్షకు సజీవ రూపం. గుడి తలుపులు అందరికీ తెరిచే ఉంటాయని చెబుతున్న వ్యవస్థలో, కులం పేరుతో ప్రవేశం నిరాకరించేహక్కు ఈ పెత్తందారులకు ఎవరిచ్చారు? బిడ్డకు పాలివ్వాల్సిన తల్లి, ఆ పసికందును మట్టిలో పూడ్చి పెట్టి న్యాయం కోసం రోడ్ల చుట్టూ తిరుగుతున్న దృశ్యం పాలకుల గుండెలను ఎందుకు కరిగించడం లేదు? ఈ దారుణానికి బాధ్యులైన వారిపై తక్షణమే హత్యానేరం కింద కేసులు నమోదు చేసి కటకటాల వెనక్కి నెట్టాలి. నిందితులకు వత్తాసు పలికి, బాధితులపైనే కేసులు పెట్టిన పోలీసు అధికారులను తక్షణమే విధుల్లోంచి తొలగించాలి. అప్పుడే ఆ పసికందు ఆత్మకుశాంతి దొరుకుతుంది. లేదంటే ఇలాంటి దారుణాలు పునరావృతం అవుతూనే ఉంటాయి, చట్టాలు కేవలం కాగితాలకే పరిమితం అవుతాయి. పాలకులూ కళ్లు తెరవండి! సమాజమా ప్రశ్నించడం నేర్చుకో! ●

(రచయిత: సీనియర్ జర్నలిస్ట్)

విద్య అనే మహావృక్షం వేళ్లు చేదుగానూ అది అందించే ఫలం మధురంగానూ ఉంటుంది.



డబ్ల్యు.ఎమర్సన్

అతి సామాన్యమైన జీవితం గడపడానికి ఆసక్తి, అధికమైన ఆలోచనా శక్తి గొప్పవారి జీవిత సూత్రాలు.



వి.జాన్సన్

# ప్రజావాక్కు



### జ్యోతిష్కులారా ! మీ జాతకం మీకు తెలియదా?

మార్చి మొదటి వారంలో దుబాయిలో ప్రపంచజ్యోతిష్య మహాసభలున్నాయని ఇండియాలోని జ్యోతిష్య పండితులంతా పంచలు ఎగగొట్టుకొని, సంకలో జ్యోతిష్యభండాగారాన్ని పెట్టుకుని, ముఖాన బూడిదపూసుకొని వెళ్లారట? తీరావెళ్లాక అక్కడయుద్ధం మొదలయింది. దానితో జాతక మహాసభలు కాస్తా ఆగిపోయాయి. ఇంకేముంది తిరుగు ప్రయాణం చేద్దామంటే విమానాలురద్దు. ఇండియాలోని అధికారులకు మొరపెట్టుకుంటున్నారట త్వరగా మాఇళ్లకు చేర్చండి అని! అయినా మీరు మహా జ్యోతిష్యపండితులు కదా! త్రికాలజ్ఞులుకదా. యుద్ధమొస్తుంది, జ్యోతిష్య సభలు ఆగిపోతాయని, వెళ్ళిన జ్యోతిష్కులకు ఒక్కరికి కూడా శాస్త్రాలు చెప్పలేదా? వాస్తు, జ్యోతిష్యం, రంగురాళ్లు మీ జీవితాలను మారుస్తాయనేది భ్రమ. ఇవన్నీ పొట్టకూటి రాయుళ్లు బతుకుదెరువుకొరకుఏర్పాటుచేసుకున్న తంతు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ఒంగోలు

### యుద్ధం వద్దు!

యుద్ధం పేరుతో కొన్ని దేశాల వారు ఐక్య రాజ్యసమితి ఆశయాలు, వాటి నిబంధనలు తుంగలో తొక్కి ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇది చాలా విచారకరం. ఈ కారణంగా అంతర్జాతీయస్థాయిలోమానవత్వం మంట కలిసిపోయింది. బాంబుల దాడులు, భీకర మోతలు, చమురు దేశాల్లో కలకలంప్రపంచశాంతి నినాదం, కరువైంది. ప్రాణనష్టం, ఆస్తుల నష్టంగురించి ఆలోచించి అడుగు ముందుకు వేయాలి. సామాజిక అభివృద్ధి, మానవ హక్కులుకాపాడేందుకు 1945 సంవత్సరంలో న్యూయార్క్ నగరంలో ఏర్పాటు అయింది. చట్టం, భద్రత, సామాజిక అభివృద్ధి మానవ హక్కుల పరిరక్షణ ఈ సంస్థ ప్రధాన కర్తవ్యం.

- ఎల్. ప్రఫుల్ల చంద్ర, హైదరాబాద్

### అహంకారం వీడితేనే..

ఎన్ని అపజయాలు అవమానాలు ఎదురైనాయి మూర్ఖంగా ఉంటారు, అహంకారాన్ని వదిలిపెట్టరు ధుర్యోధనుడి లాగానే ఈమధ్య కొందరు రాజకీయ నాయకులు ప్రవర్తిస్తున్నారు. శాసనసభ, లోక్‌సభ ఆ తరువాత రెండు ఉప ఎన్నికలు. ఈ మధ్య జరిగిన పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో పరాజయం పాలైన వారి అహంకారం తగ్గటం లేదు. పరనింద, ఆత్మస్తుతి మానటం లేదు..

-మిథునం, హైదరాబాద్

### కాలం చెల్లిన పద్ధతులను వీడాలి

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ప్రపంచ శాంతి పరిరక్షణలో తన బాధ్యతలను ఆశించినస్థాయిలో నెరవేర్చలేకపోతోంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, గజాలో ఇజ్రాయెల్-హమాస్ ఘర్షణలు నేటికీ కొనసాగుతుండటమే ఇందుకు నిదర్శనం. శాశ్వత సభ్య దేశాలైన రష్యా, అమెరికా వంటి అగ్రరాజ్యాలు తమ వీటో అధికారంతో శాంతి ప్రయత్నాలను అడ్డుకుంటూ పక్షపాత వైఖరితో వ్యవహరిస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఈ అధికార దుర్వినియోగంవల్ల మానవతా దృక్పథంతో కూడిన నిర్ణయాలు అమలుకావడంలేదు. పశ్చిమ ఆసియాలో ఇరాన్-ఇజ్రాయెల్ ప్రత్యక్ష దాడులు, ఆఫ్ఘనిస్థాన్-పాకిస్థాన్ సరిహద్దు వివాదాలు ప్రపంచాన్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. కాలం చెల్లిన పద్ధతులను వీడి నూతన సంస్కరణలకు శ్రీకారం చుట్టినప్పుడే ఐక్యరాజ్యసమితి తన ఉనికిని చాటుకోగలదు, ప్రపంచ వ్యాప్తంగా శాంతిని నెలకొల్పగలదు.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### అందరూ మోసగాళ్లే..

బిఆర్ఎస్ తమను మోసం చేసిందని ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓట్లువేసి అధికార పీఠాన్ని అందించారు. కాంగ్రెస్ కూడా బిఆర్ఎస్ లానే మోసం చేస్తే మూడేళ్ల తరువాత జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని తప్పించి ప్రజలు మరో పార్టీని ఎన్నుకుంటారు. అయితే ఈ కాలంలో పార్టీల నుంచి ప్రభుత్వాల నుంచి స్వచ్ఛమైన పాలనఆశించడం వృథా. ఎందుకంటేరాజకీయ వ్యవస్థలో నైతికవిలువలు పార్టీనాయకుల్లో నిజాయితీ లోపించాయి.

-ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

### ప్రాంతీయ యుద్ధం

వేనిజులలో లాగ అధ్యక్షుణ్ణి అపహరించడం సులభం అవుతుంది. భయపెట్టి తమ చెప్పుచేతల్లో ఉంచుకునే నాయకుడిని గద్దె ఎక్కించడం వీలు అవుతుంది అనుకున్న ట్రంప్ ఆశలు అడియశలు అయ్యాయి. ఖొమెనీ మరణంతో శియాలు కోపంతో ఉన్నారు. ఇరాన్ ఇప్పటికి అమెరికాతో చర్చలకు సిద్ధం అంటున్నది అనేదికాదు అనలేనివాస్తవం. 1979లో ఇరానియన్ విప్లవంలో ఎదురయినా అవమానానికి బదులు తీర్చుకోవాలి అని అమెరికా చూస్తున్న నేపథ్యంలో ఇంకా గల్ఫ్ దేశాలు యుద్ధ రంగంలోకి దిగలేదు. ఇది అమెరికా ఇజ్రాయేల్, ఇరాన్ మధ్యనే కాదు ఇది ఒక ప్రాంతీయ యుద్ధంకు దారితీయబోతోంది అనేది కాదు అనలేని వాస్తవం. ఇదికావాలి అని చేసే యుద్ధం మాత్రమే.

-భారత అవినాష్, జనగామ

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

## రష్యా చమురు కొనుగోలులో భారత్‌కు మినహాయింపు

వాషింగ్టన్, మార్చి 6: పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో.. చమురు రవాణాపై తీవ్ర ప్రభావం పడిన సంగతి తెలిసిందే. యుద్ధ సమయంలో రష్యా చమురును దిగుమతి చేసుకునేందుకు భారత్‌కు అమెరికా మినహాయింపు ఇచ్చింది. ఈ విషయాన్ని యుఎస్ ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. భారతీయ శుద్ధి కార్మాగారాలు రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడానికి తాత్కాలికంగా 30 రోజులు మినహాయింపు ఇస్తున్నట్లు బెసెంట్ తెలిపారు. దీంతో ప్రపంచ మార్కెట్‌లోకి చమురు సరఫరా అవుతుందన్నారు. ఇప్పటికే సముద్రంలో చిక్కుకుపోయిన రష్యా నౌకల నుంచి మాత్రమే ఈ కొనుగోళ్లు జరగాలని స్పష్టం చేశారు. దీంతో ఆ దేశానికి ఆర్థికపరంగా పెద్దగా ప్రయోజనం చేకూరదన్నారు. భవిష్యత్తులో తమ ముడి చమురు కొనుగోళ్లను భారత్ పెంచుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. 2022 నుంచి రష్యా చమురును భారత్ గణనీయంగా దిగుమతి చేసుకుంటోంది. ఆంక్షలు, అమెరికాతో మధ్యంతర వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో దిగుమతులు తగ్గాయి.

# మధ్యప్రాచ్య దేశాలకు విమానసేవలు పునరుద్ధరణ

## ఇండిగో, ఎయిరిండియా, ఎక్స్‌ప్రెస్ సేవలు షురూ




న్యూఢిల్లీ, మార్చి 6: అమెరికాఇజ్రాయెల్, ఇరాన్ మధ్య నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతల కారణంగా మధ్యప్రాచ్యంలో గగనతల ఆంక్షలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో నిలిచిపోయిన విమాన సర్వీసులను దేశీయ విమానయాన సంస్థలు ఇవాళ్టి నుంచి పాక్షికంగా పునరుద్ధరించాయి. ఇండిగో, ఎయిరిండియా, స్పైస్‌జెట్ వంటి సంస్థలు పరిమిత సంఖ్యలో మధ్యప్రాచ్యానికి రాకపోకలు ప్రారంభించాయి. ఇండిగో శుక్రవారం ఎనిమిది మధ్యప్రాచ్య గమ్యస్థానాలకు 17 విమానాలను నడుపుతామని తెలిపింది. సురక్షితమైన రీతిలో సర్వీసులను పూర్తిగా పునరుద్ధరించేందుకు ప్రభుత్వ అధికారులతో కలిసి పనిచేస్తున్నట్లు పేర్కొంది. సౌదీ అరేబియా, ఒమన్ గగనతలాలు తెరుచుకోవడంతో జెడ్డా, మస్కట్‌లకు విమానాలను తిరిగి ప్రారంభిస్తున్నట్లు ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ప్రకటించాయి. మరోవైపు స్పైస్‌జెట్ ఉద్రిక్తతల నడుమ ప్రయాణికుల రాకపోకలను సులభతరం చేసేందుకు ఈ నెల 6, 7 తేదీల్లో యూఏఈ నుంచి భారత్‌కు ప్రత్యేక విమానాలను, ఈ నెల 8న అదనపు సర్వీసులను నడుపుతున్నట్లు వెల్లడించింది. సంస్థలు తమను నేరుగా సంప్రదించిన తర్వాతే ప్రయాణికులు విమానాశ్రయాలకు రావాలని ఇండిగో స్పష్టంగా సూచించింది. ఇక ఎయిరిండియా.. దుబాయ్, రాస్ అల్ ఖైమా, ఫుజైరా వంటి హబ్‌ల నుంచి ఇవాళ ప్రత్యేక విమానాలు నడిపేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపింది. అయితే, ఇతర పశ్చిమాసియా గమ్యస్థానాలకు మార్చి 10 వరకు తమ షెడ్యూల్డ్ సర్వీసులు నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఫిబ్రవరి 28 నుంచి ఈ నెల 8 మధ్య ప్రయాణానికి టికెట్లు బుక్ చేసుకున్న వారు ఎలాంటి అదనపు ఛార్జీలు, ఛార్జీల వ్యత్యాసం లేకుండా నెల రోజుల్లోగా తమ టికెట్లను రీబుక్ చేసుకోవచ్చని భరోసా ఇచ్చింది. విమానయాన పరిశ్రమ డేటా ప్రకారం ఫిబ్రవరి 28 నుంచి ఈ నెల 5 మధ్య మధ్యప్రాచ్యంలో 44 వేల విమానాలు నడవాల్సి ఉండగా, ఇప్పటివరకు 25వేలకు పైగా సర్వీసులు రద్దయ్యాయి. దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో గురువారం ట్రాఫిక్ సాధారణ స్థాయిలతో పోలిస్తే 25 శాతానికి చేరింది. ఇది అంతకుముందు రోజుతో పోలిస్తే రెట్టింపు కావడం గమనార్హం. ఈ పరిణామాల నేపథ్యంలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ విమానయాన సంస్థలను సమన్వయం చేస్తోంది. చిక్కుకుపోయిన ప్రయాణికులకు సహాయం చేసేందుకు ప్రత్యేకంగా ప్యాసింజర్ అసిస్టెన్స్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపింది. ఈ సమయంలో విమాన టికెట్ల ధరలు పెరగకుండా కేంద్రం నిశితంగా పరిశీలిస్తోందని వెల్లడించింది.

# మంటల్లో పశ్చిమాసియా

## ఇరాన్‌పని పూర్తయ్యాక క్యూబా సంగతి చూస్తా!

### అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ హెచ్చరిక



శ్వేతసౌధం (యుఎస్), మార్చి 6: మొదట ఇరాన్ విషయం తేల్చిన తర్వాత క్యూబాపై దృష్టి సారిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక జారీచేశారు. 2025 మేజర్ లీగ్ సాకర్ ఛాంపియన్స్‌గా నిలిచిన ఇంటర్ మయామి జట్టుకు శ్వేతసౌధంలో ట్రంప్ ఘనంగా ఆతిథ్యం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం ఇరాన్ పని ముగించడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇజ్రాయెల్‌తో కలిసి అనుకున్న దానికంటే వేగంగానే తమ దళాలు ఇరాన్‌పై దాడులు కొనసాగిస్తున్నాయన్నారు. వరుస దాడుల వల్ల ఇరాన్ సైనిక సామర్థ్యాలు కూడా భారీగా క్షీణించాయని అభిప్రాయపడ్డారు. ఇజ్రాయెల్, అమెరికాకు ఉన్నట్లు ఇరాన్‌కు సమర్థవంత వైమానిక దళం లేదని, ఇప్పటికే ఇరాన్ నావికాదళాన్ని నాశనం చేశామన్నారు. మూడు రోజుల్లో 24 ఇరాన్ నౌకలను తుడిచి పెట్టడంతో ఇరాన్ అధికారులు కాళ్ల బేరానికి వచ్చారని అన్నారు. అణు ఒప్పందంపై చర్చలు జరపడానికి సిద్ధంగా ఉన్నట్లు వారు తమతో చెప్పారని వెల్లడించారు. వారి విజ్ఞప్తిని తోసిపుచ్చామని, ఇప్పటికే ఆలస్యమైందని వారికి స్పష్టం చేసినట్లు ట్రంప్ తెలిపారు. టెహ్రాన్ రాజకీయ భవిష్యత్తును పునర్నిర్మించడానికి ఇరాన్ దౌత్యవేత్తలు తమకు సహకరించాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో తమతో ఒప్పందం కోసం క్యూబా కూడా వేచిచూస్తోందని ట్రంప్ తెలిపారు. ఇరాన్ పని ముగిసిన తర్వాత క్యూబా సంగతి చూస్తామని అన్నారు.

**ఇరాన్ ఆక్రమణ ఉద్దేశ్యం లేదు: ట్రంప్**

ఇరాన్‌ను ఆక్రమించాలన్న ఉద్దేశం తమకు లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నా రు. సమయం వృథా తప్ప, దాంట్లో ఏమీ లేదన్నారు. అమెరికా బలగాలను ఇరాన్‌కు పంపే ఆలోచన లేదన్నారు. ఎన్‌బిసి న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అమెరికా–ఇజ్రాయెల్ దళాలు.. యుద్ధంలో ఇప్పటికే వేల మంది చనిపోయారు. క్షిపణులు, డ్రోన్లతో ఇరు దళాలు విరుచుకుపడుతున్నాయి. అయితే భూతల యుద్ధం చేపట్టేందుకు బలగాలను ఇరాన్‌కు పంపాలన్న ఆలోచన తమకు లేదని ట్రంప్ అన్నారు. అలా చేస్తే సమయం వృథా చేయడమే అవుతుందని, ఇరాన్ అన్నీ కోల్పోయిందన్నారు. అమెరికా సైనిక దాడులను ఎదుర్కొనేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగాచీ పేర్కొన్న నేపథ్యంలో ట్రంప్ ఈ కౌంటర్ ఇచ్చారు. ఇరాన్‌లో ఉన్న నాయకత్వ వ్యవస్థను మార్చడమే తన లక్ష్యమని ట్రంప్ చెప్పారు. ట్రంప్ తన వ్యాఖ్యల్లో ఎవరి పేరును ప్రస్తావించలేదు.

**ఇరాన్ అధ్యక్షపదవిలో నా జోక్యం తప్పనిసరి...!**

అమెరికా–ఇజ్రాయెల్ సంయుక్త క్షిపణి దాడుల్లో ఖమేనీ మరణించిన నేపథ్యంలో, ఆయన వారసుడి ఎంపికపై ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. మీడియా ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ ఖమేనీ కుమారుడు మొజ్తబా ఖమేనీని కొత్త అధినేతగా నియమించడాన్ని తాను అంగీకరించనని స్పష్టం చేశారు. ఖమేనీ విధానాలనే కొనసాగించే వ్యక్తి వస్తే, మరో ఐదేళ్లలో మళ్లీ యుద్ధం చేయాల్సి వస్తుంది. ఖమేనీ కుమారుడు ఒక పనికిరాని వ్యక్తి. వెనెజులాలో డెల్సీ రోడ్రిగ్జ్‌ను మధ్యంతర అధ్యక్షురాలిగా నియమించిన తరహాలోనే, ఇక్కడ కూడా నేను కచ్చితంగా జోక్యం చేసుకుంటానని ట్రంప్ అన్నారు. మొజ్తబా ఖమేనీ, తన తండ్రి తర్వాత సుప్రీం లీడర్ పదవికి ప్రధాన అభ్యర్థిగా ప్రచారంలో ఉన్నారు. అయితే, వారసత్వంగా ఈ పదవిని చేపట్టడాన్ని 2024లోనే అలీ ఖమేనీ వ్యతిరేకించారు. మొజ్తబా ఖొమైనీకి 100 మిలియన్ డాలర్లకు పైగా సంపద ఉన్నట్లు అంచనా. ప్రభుత్వంలో ఎలాంటి పదవిలో లేకపోయినా తన తండ్రి కార్యాలయంలో పనిచేస్తూ ఆయనకు ప్రాతినిధ్యం వహిస్తున్నారని ఆరోపిస్తూ 2019లోనే ట్రంప్ ప్రభుత్వం మొజ్తబాపై ఆంక్షలు విధించింది. మరోవైపు ఇరాన్‌లో అధికార మార్పు తమ లక్ష్యం కాదని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ స్పష్టం చేశారు. అణ్వాయుధాలు లేకుండా చూడటమే ఆపరేషన్ లక్ష్యమన్నారు.

# ఇజ్రాయెల్ అణుకేంద్రంపై ఇరాన్ గురి!

టెహ్రాన్, మార్చి 6: ఇజ్రాయెల్ ఒక్క అణు రియాక్టర్ కోసం గతంలో అమెరికానే మోసం చేసింది. అగ్రరాజ్యం కన్నుగప్పి ఫ్రాన్స్ సాయంతో నిర్మించిన ఈ అణుకేంద్రం ఇప్పుడు ఇరాన్ గురిలోకి వచ్చింది. ఇజ్రాయెల్ ఏర్పడిన తర్వాత పొరుగు దేశాలు వరుసగా దానితో యుద్ధాలకు దిగాయి. అమెరికా సాయంతో.. వాటిని ఓడించినా.. ఎప్పటికైనా తన ఉనికికి ముప్పు తప్పదని గ్రహించింది. దీంతో నాటి ప్రధాని డేవిడ్ బెన్ గురియన్ తమ దేశాన్ని అణుశక్తిగా మార్చాలనే నిర్ణయానికి వచ్చారు. దేశంలోని నెగెవ్ ఏడారిలో యురేనియం నిల్వం కోసం గాలించినా ఎక్కడా దొరకలేదు. 1950ల్లో ఇజ్రాయెల్ అటామిక్ కమిషన్‌ను ఏర్పాటు చేశారు. 1956 సూయజ్ కాలువ సంక్షోభం తర్వాత అమెరికాపై అసంతృప్తితో ఇజ్రాయెల్–ఫ్రాన్స్ దేశాలు దగ్గరయ్యాయి. దీంతో రహస్యంగా భారజల రియాక్టర్‌ను నిర్మించేందుకు పారిస్ అంగీకరించింది. స్వదేశంలో మాత్రం ఈ విషయం ఎవరికీ తెలియకుండా ఉంచింది. నెగెవ్ ఎడారిలో 'డిమోనా' అనే ప్రదేశంలో ఓ భారీ రియాక్టర్‌ను ఇజ్రాయెల్ నిర్మించింది. ఐరోపా దేశాల టెక్నాలజీ, బ్లూప్రింట్స్, నిపుణులతో దీనిని రూపొందించారు. ఇందులోని భూగర్భ బంకర్లలో అణుబాంబులకు వాడే ప్లుటోనియం ఉత్పత్తి చేసే అవకాశం ఉంది. అమెరికా నిఘా విమానం ఈ భారీ కాంక్రీట్ డోమ్ ఉన్న భవనం ఫొటోలు తీసింది. తొలుత ఇది ఒక టెక్స్‌టైల్ ఫ్యాక్టరీ అని ఇజ్రాయెల్ నమ్మబలికింది. అమెరికా నిఘా సంస్థ సిఐఎ వీటిని విశ్లేషించి ఆ భారీ నిర్మాణాన్ని అణురియాక్టర్‌గా తేల్చింది. ఈ విషయం అప్పటి అమెరికా అధ్యక్షుడు కెనడీ వద్దకు చేరింది. దీంతో తమ అధికారుల 'తనిఖీల'కు అనుమతించాలని ఆయన ఇజ్రాయెల్‌పై ఒత్తిడి తీసుకొచ్చారు. కానీ, ఇజ్రాయెల్ కేవలం 'సందర్శన'కు మాత్రమే అనుమతించింది. అంతేకాదు.. పశ్చిమాసియాలోకి కొత్త ఆయుధాలు తీసుకురాబోమని అమెరికాకు హామీ ఇచ్చి ఆ దేశ తనిఖీ బృందం కళ్లు గప్పింది. ఇక్కడ శుద్ధి చేసిన యురేనియం కోసం అమెరికాలోని అపోలో పట్టణంలో న్యూమెక్ (ది న్యూక్లియర్ మెటీరియల్ అండ్ ఎక్విప్‌మెంట్ కార్పొరేషన్)ను ఇజ్రాయెల్ ఏజెంట్లు పలు మార్లు సందర్శించి విడతల వారీగా 200–600 పౌండ్ల శుద్ధి చేసిన యురేనియాన్ని అపహరించారు. ఇక సాధారణ యురేనియం కోసం ఆపరేషన్ ప్లమ్‌బాట్‌ను చేపట్టి సముద్రంలో ఓ నౌక నుంచి 200 టన్నుల ముడి యురేనియంను అపహరించారు. అలా ఇజ్రాయెల్ అణ్వాయుధం తయారీలో డిమోనా రియాక్టర్ కీలక పాత్రం పోషించింది. ఈ రియాక్టర్‌కు ఉత్తరం వైపు 85 కి.మీ. దూరంలో జెరూసలెం నగరం ఉంది. ఇక 75 కిమీ దూరంలో ఈజిప్ట్ సరిహద్దులు.. 25 కిలోమీటర్ల దూరంలో జోర్డాన్ ఉన్నాయి. ఒకవేళ దాడి జరిగితే ఇక్కడి నుంచి లీకయ్యే రేడియేషన్ ప్రభావం ఈ దేశాలకు కూడా పాకే ప్రమాదం ఉంది. ఇజ్రాయెల్ తన అత్యాధునిక ఆయుధ వ్యవస్థలను డిమోనాకు రక్షణగా మోహరించింది. ప్రపంచంలోనే అత్యంత దుర్భేద్యమైన ప్రదేశంగా మార్చేసింది.



## అసోంలో కూలిన సుఖోయ్

### ఇద్దరు పైలట్లు మృతి

న్యూఢిల్లీ, మార్చి 6: వాయుసేనకు చెందిన సుఖోయ్ యుద్ధ విమానం కూలిపోవడంతో ఇద్దరు పైలట్లు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. అస్సాంలోని కర్బి ఆంగ్లాంగ్ జిల్లాలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఆ పైలట్లలో ఒకరైన ఫ్లైట్ లెఫ్టినెంట్ పూర్వేశ్ దురాగ్‌కర్(28) గతేడాది పాక్‌పై భారత బలగాలు నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్నారు. పది రోజుల క్రితమే తన కుటుంబంతో సంతోషంగా గడిపి, విధుల్లో చేరారు. పూర్వేశ్ తండ్రి రవీంద్ర మీడియాతో మాట్లాడుతూ గతేడాది భారత బలగాలు నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌లో మా కుమారుడు కూడా పాల్గొన్నాడు. సిందూర్‌ను ఆపిన 15 రోజుల తర్వాత ఆ విషయం మాకు తెలిసింది. ఆ ఆపరేషన్ జరిగినన్ని రోజులూ పూర్వేశ్ మాతో టచ్‌లో లేడు. భారత వాయుసేనలో పనిచేస్తున్నందుకు, యుద్ధ విమానాలు నడుపుతున్నందుకు ఎంతో గర్వంగా ఫీల్ అయ్యేవాడు. బుధవారమే మేం అతడితో మాట్లాడాం. దేశసేవలో తన ప్రాణాలు అర్పించాడు. అందరికీ నా బిడ్డ ఒక స్ఫూర్తిగా నిలుస్తాడు. కానీ ఆ కల తీరలేదు అని రవీంద్ర తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ పూర్వేశ్ స్వస్థలం. పది రోజుల క్రితమే కుటుంబ సభ్యులు నిర్వహించిన గెట్‌టుగెదర్‌లో సంతోషంగా గడిపారు. గురువారం రాత్రి సుఖోయ్ ఆచూకీ లేకుండా పోయింది. ట్రైనింగ్ మిషన్‌లో భాగంగా జొర్హాట్ ఎయిర్‌బేస్ నుంచి టేకాఫ్ అయిన వెంటనే మిస్ అయింది. 60 కిమీ దూరంలో కుప్పకూలింది. ఈ ప్రమాదంలో పూర్వేశ్‌తో పాటు స్క్వాడ్రన్ లీడర్ అనుజ్ ప్రాణాలు కోల్పోయారు.

### న్యూయార్క్ మేయర్‌ను నియమించలేని ట్రంప్

## ఇరాన్ సుప్రీం లీడర్‌ను ఎలా నియమిస్తారు?

**ఇరాన్ విదేశాంగ డిప్యూటీ ఖాతిబ్‌జాదే**

న్యూఢిల్లీ, మార్చి 6: ఇరాన్ సుప్రీం లీడర్‌ను ఎన్ను కోవడంలో తన పాత్ర ఉండాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ అంశంపై ఇరాన్ విదేశాంగ సహాయమంత్రి సయ్యద్ ఖతిబ్జాదే తీవ్రంగా స్పందించారు. ట్రంప్ తన దేశంలోని న్యూయార్క్ మేయర్‌ను కూడా నియమించలేదని, అలాంటిది ఇరాన్ సుప్రీం లీడర్‌ను ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. న్యూయార్క్ మేయర్ ఎన్నికల్లో ఇటీవల మమ్దానీ ఎన్నికైన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. మమ్దానీ అగ్రరాజ్యం అధ్యక్షుడు ట్రంప్‌ను తీవ్రంగా విమర్శించే వ్యక్తి అని పేర్కొన్నారు. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఇజ్రాయెల్, అమెరికాలపై తన దేశం చేపడుతున్న చర్యలను ఆయన సమర్థించారు. అమెరికా ఆస్తులే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. పశ్చిమాసియాలోని అమెరికా ఆస్తులపై తాము దాడులు చేస్తున్నామని, ఈ దాడుల వల్ల ఆ దేశాల్లోని ప్రజలకు నష్టం చేయడం లేదని తెలిపారు. అగ్రరాజ్యం ఆస్తులను మాత్రమే లక్ష్యంగా చేస్తున్నామన్నారు రెండు రోజుల క్రితం హిందూ మహా సముద్రంలో ఇరాన్ యుద్ధనౌక ఐరిస్‌దేనాను అమెరికా ముంచి వేతపై స్పందించారు. భారత స్నేహి తుల ఆహ్వానం మేరకు ఆ నౌక ఇక్కడకు వచ్చిం దని, దానిపై అమెరికా దాడి చేయడం దురదృష్టకరమన్నారు.

## మధ్యవర్తిత్వానికి కొన్ని దేశాల యత్నం

### ఇరాన్ శక్తిని తక్కువ అంచనా వేయొద్దు: అధ్యక్షుడు పెజెష్కియాన్



టెహ్రాన్, మార్చి 6: అమెరికా, ఇజ్రాయెల్ దాడులతో పశ్చిమ ఆసియాలో యుద్ధకాండ కొనసాగుతున్న వేళ ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కొన్ని దేశాలు మధ్యవర్తిత్వ ప్రయత్నాలు ప్రారంభించాయని శుక్రవారం ప్రకటించారు. ఇరాన్ ఖమేనీ హత్య తర్వాత తీవ్రతరమైన ఉద్రిక్తతలను తగ్గించేందుకు "ప్రాంతీయ శాంతికి తాము కట్టుబడి ఉన్నామని, అయితే ఇరాన్ ప్రజల శక్తిని తక్కువగా అంచనా వేసిన వారికి ఈ మధ్యవర్తిత్వం సరైన సమాధానం కావాలని ఆయన సోషల్‌మీడియా వేదికగా స్పష్టం చేశారు. తమ దేశ గౌరవాన్ని, సార్వభౌమత్వాన్ని కాపాడుకునే విషయంలో వెనక్కి తగ్గేది లేదని ఆయన తేల్చిచెప్పారు. కొనసాగుతున్న ఇరాన్ ప్రతీకారం అధ్యక్షుడి ప్రకటన ఒకవైపు ఉండగా క్షేత్రస్థాయిలో ఇరాన్ దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ఇజ్రాయెల్ లక్ష్యంగా ఇరాన్ తన అత్యంత శక్తివంతమైన ఖొర్రమ్‌షహర్ 4 బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిందని తస్నిమ్ వార్తా సంస్థ వెల్లడించింది. ఆపరేషన్ ట్రూ ప్రామిస్‌లో భాగంగా 22వ విడత దాడులు మొదలయ్యాయని, ఇవి నేరుగా ఇజ్రాయెల్ భూభాగంపై విరుచుకుపడుతు న్నాయని ఇస్లామిక్ రెవెల్యూషన్ గార్డ్ కోర్ (ఐఆర్ జీసీ) తెలిపింది. మరోవైపు, లెబనాన్‌లోని సిడాన్ నగరంలో శుక్రవారం మధ్యాహ్నం ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో ఓ నివాస భవనం దెబ్బతిన్నట్లు జిన్హువా వార్తా సంస్థ నివేదించింది. ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని దెబ్బతీయడమే లక్ష్యంగా అమెరికా చేపట్టిన ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీని మరింత ఉధృతం చేస్తున్నట్లు అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ ప్రకటించారు. ఫ్లోరిడాలోని టాంపాలో ఉన్న సెంట్రల్ కమాండ్ ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఇరాన్ నావికాదళాన్ని, క్షిపణి కేంద్రాలను తమ దళాలు సమర్థంగా అడ్డుకున్నాయని తెలిపారు. మేము ఈ పోరాటానికి సిద్ధంగా ఉన్నాం, విజయం సాధించే దిశగా వెళ్తున్నామని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ఆపరేషన్ ఆరో రోజుకు చేరుకుందని, ఇరాన్ మిలటరీ సామర్థ్యం గణనీయంగా తగ్గిందని అమెరికా సెంట్రల్ కమాండ్ చీఫ్ అడ్మిరల్ బ్రాడ్ కూపర్ వెల్లడించారు. గడచిన 72 గంటల్లో టెహ్రాన్ పరిసరాల్లోని దాదాపు 200 లక్ష్యాలపై అమెరికా బాంబర్లు దాడులు చేశాయి.

## యుద్ధంలో వందలకొద్దీ చనిపోతున్న చిన్నారులు

జెనీవా,మార్చి 6: అమెరికా–ఇజ్రాయెల్, ఇరాన్ దాడుల కారణంగా పశ్చిమాసియాలో వందల సంఖ్యలో చిన్నారులు ప్రాణాలు కోల్పోయారని యూనిసెఫ్ ఆందోళన వ్యక్తం చేసింది. గత నెల 28న ప్రారంభమైన యుద్ధం నేటితో ఏడవ రోజుకు చేరుకున్నది. ఈ యుద్ధంలో అత్యధికంగా ఇరాన్‌లో చిన్నారులు చనిపోయినట్లు తెలిపింది. ఇరాన్‌లో 181 మంది, లెబనాన్‌లో 7గురు, ఇజ్రాయెల్‌లో ముగ్గురు, కువైట్‌లో ఒకరు మృతి చెందినట్లు వెల్లడించింది. యుద్ధాలను పిల్లలు ప్రారంభించరని కానీ వారు కూడా మూల్యం చెల్లించుకుంటున్నారని పిల్లల హక్కులు, ఆరోగ్యం, విద్య, సంక్షేమం కోసం పనిచేసే ఈ ఐక్యరాజ్య సమితి ఏజెన్సీ ఆవేదన వ్యక్తం చేసింది. పశ్చిమాసియాలో సైనిక ఉద్రిక్తతలు ఇప్పటికే చిన్నారులపై ఆందోళనకర ప్రభావాన్ని చూపిందని పేర్కొంది. ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త ఆపరేషన్‌లో మొదటి రోజు ఇరాన్‌లోని మినాబ్‌లో ఒక బాలికల పాఠశాలపై దాడి జరగగా, 160 మంది చిన్నారులు మృతి చెందినట్లు ఇస్లామిక్ రెవెల్యూషనరీ గార్డ్ కోర్ తెలిపింది.

### 16 యేళ్ల లోపు పిల్లలకు

## సోషల్ మీడియా నిషేధం: కర్ణాటక ప్రభుత్వం



బెంగళూరు, మార్చి 6: కర్ణాటక ప్రభుత్వం ఓ కీలక నిర్ణయం తీసుకుంది. 16 యేళ్లలోపు పిల్లలు సోషల్ మీడియా వినియోగించడాన్ని నిషేధించనున్నట్లు ప్రకటించింది. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య 17వ సారి బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా ఆయన ఈ ప్రకటన చేశారు. మొబైల్ వాడకం వల్ల పిల్లల్లో తలెత్తుతున్న ప్రతికూల భావాలను నివారించడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సిఎం పేర్కొన్నారు. భారత్‌లో ఈ దిశగా నిర్ణయం తీసుకున్న తొలి రాష్ట్రంగా కర్ణాటక నిలిచింది. ఆంధ్రప్రదేశ్, గోవా రాష్ట్రాలు ఇలాంటి చర్యలనే పరిశీలిస్తున్నట్లు గతంలో తెలిపాయి. పిల్లల్లో సోషల్ మీడియా వినియోగాన్ని నియంత్రించాలనే అంశంపై కర్ణాటక ప్రభుత్వం గత కొంతకాలంగా చర్చలు జరుపుతోంది. సిఎం ఇటీవల ప్రభుత్వ విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లతో జరిపిన చర్చల్లో ఈ అంశాన్ని లేవనెత్తారు. పిల్లలకు సోషల్ మీడియా బ్యాన్‌కు సంబంధించి వారి నుంచి అభిప్రాయాలు కోరారు. తాజాగా ఈ ప్రకటన చేశారు.

### పరీక్షలురాసేందుకు వెలుతున్న

## అక్కాతమ్ముళ్లను కడతేర్చిన బాబాయ్..!

సీహోర్ (ఎంపి), మార్చి 6: చేతిలో హాల్‌టిక్కెట్లు పట్టుకుని, భవిష్యత్తుపై వెయ్యి ఆశలతో పరీక్షా కేంద్రానికి బయలుదేరిన అక్కాతమ్ముళ్లను సొంత బాబాయ్ కడతేర్చాడు. కుటుంబ గొడవల నేపథ్యంలో దారికాచి వారిని కొట్టి చంపాడు. మధ్యప్రదేశ్‌లోని సీహోర్ జిల్లా ధరమ్‌పురి గ్రామంలో ఈ దారుణం చోటుచేసుకుంది. ధరమ్‌పురి గ్రామానికి చెందిన అక్కాతమ్ముడు శీతల్(20), కుల్దీప్(18) శుక్రవారం ఉదయం తమ బోర్డ్ పరీక్షలకు హాజరయ్యేందుకు సిద్ధమయ్యారు. ఉదయాన్నే హాల్ టిక్కెట్లు తీసుకుని ఇంటి నుంచి బయలుదేరారు. ఇంటి నుంచి కొద్దిదూరం వెళ్లగానే, దారిలో పొంచి ఉన్న వారి సొంత బాబాయ్ హరిసింగ్ మాలవీయ ఒక్కసారిగా కర్రతో దాడి చేశాడు. విచక్షణారహితంగా దాడి చేయడంతో వారిద్దరూ అక్కడికక్కడే కుప్పకూలారు. పరీక్ష రాసేందుకు వెళ్లిన బిడ్డలు రోడ్డుపై రక్తపు మడుగులో పడి ఉండటం చూసి వారి తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. కుటుంబ ఆస్తి తగాదాలే ఈ ఘాతుకానికి కారణమని ప్రాథమికంగా తెలుస్తోంది. జంట హత్యలతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. హత్య చేసి పారిపోయిన హరిసింగ్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

# నేపాల్‌లో ఆర్ఎస్‌పి ప్రభంజనం

## నేపాలీ కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీల వెనుకంజ

ఖాట్మండు, మార్చి 6: జెన్‌జీ ఆందోళనలతో కేపీ శర్మ ఓలీ నాయకత్వంలోని నేపాల్ ప్రభుత్వం కూలిపోయిన తర్వాత ఆ దేశంలో జరిగిన పార్లమెంట్ ఎన్నిక ల్లో జెన్‌జీ మద్దతున్న రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ (ఆర్ఎస్‌పి) విజయం దిశగా సాగుతోంది. గురువారం పోలింగ్ ముగిసిన తర్వాత శుక్రవారం ఉదయం నుంచి ఓట్ల లెక్కింపు మొదలైంది. ఇప్పటి వరకూ వెలువడిన ఫలితాలను బట్టి బాలేంద్ర షా నాయకత్వంలోని ఆర్ఎస్పీ మెజార్టీ స్థానాల్లో విజయం సాధించింది. ఆ పార్టీ మొత్తం 94 స్థానాల్లో ముందం జలో ఉంది. సంప్రదాయ పార్టీలైన నేపాలీ కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు దాదాపు తుడిచిపెట్టుకుపోయాయి. కాంగ్రెస్ ఒక స్థానంలో గెలిచి, 10 చోట్ల ఆధిక్యంలో ఉండగా కమ్యూనిస్ట్‌లు ఏడు చోట్ల ఆధిక్యంలో కొనసాగుతున్నారు. మొత్తం 165 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 67 పార్టీలు పోటీచేశాయి. కౌంటింగ్ జరుగుతున్న 94 నియోజక వర్గాల్లో 70 చోట్ల ఆర్ఎస్పీ, నేపాలీ కాంగ్రెస్, సీపీఎన్ యుఎంఎల్, నేపాలీ కమ్యూనిస్ట్ పార్టీలు చెరో ఆరు నియోజకవర్గాల్లో ఆధిక్యంలో ఉన్నాయి. నేపాల్‌లో జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికలను భారత్ నిశితంగా గమనిస్తోంది. రాజకీయ అస్థిరత కొనసాగుతోన్న నేపాల్‌లో స్థిరమైన ప్రభుత్వం ఏర్పడి, ఇరుపక్షాల మధ్య అభివృద్ధి భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లాలని భారత్ భావిస్తోంది. విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ పరస్పర ప్రయోజనం కోసం మా రెండు దేశాలు, ప్రజల మధ్య బలమైన బహుముఖ సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి నేపాల్ కొత్త ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి మేము ఎదురుచూస్తున్నామని అన్నారు. నేపాల్ స్థిరత్వం, శాంతి, అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని, ఆ ప్రభుత్వం కోరడంతో ఎన్నికల కోసం లాజిస్టిక్ సౌకర్యం అందజేశామని చెప్పారు. స్ట్రక్చరల్ ఇంజినీర్ అయిన బాలేంద్ర షా ర్యాపర్ సింగర్‌గా గుర్తింపు పొందారు. తన కచేరీల ద్వారా అవినీతి, అసమానతలు, యువత సమస్యలను లేవనెత్తుతారు. ఇవే యువతలో ఆయనకు క్రేజ్ తీసుకొచ్చాయి. సామాజిక మాధ్యమాల్లో యాక్టివ్‌గా ఉండటంతో జెన్ జీ యువత ఆయన పట్ల ఆకర్షితమైంది. ఖాట్మండు మేయర్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి ఘన విజయం అందుకున్నారు. మేయర్‌గా ఆయన తీసుకున్న నిర్ణయాలు యువతను మరింత ప్రభావితం చేశాయి. తమ సమస్యలకు పరిష్కారానికి ఆయన ఆశాదీపంలో వారికి కనిపించారు. సంప్రదాయ పార్టీలు కాంగ్రెస్, కమ్యూనిస్టులకు ప్రత్యామ్నాయంగా కనిపించాడు. అదే జెన్ జీ యువతలో షా పట్ల ఆకర్షణను పెంచింది. రాష్ట్రీయ స్వతంత్ర పార్టీని స్థాపించిన బాలెన్ ఈ ఎన్నికల్లో పోటీ చేశారు. ఏళ్లుగా పాతుకుపోయిన పార్టీల పునాదులను కదిలించారు. ఈ ఎన్నికల్లో దాదాపు 10 లక్షల కొత్త జెన్ జీ ఓటర్లు చేరడం ఆయన కలిసొచ్చింది. ఝుపా5 నియోజకవర్గం నుంచి పోటీచేసిన బాలెన్ మాజీ ప్రధాని కేపీ శర్మ ఓలీపై గెలుపు దిశగా దూసుకుపోయారు.

### రిలయన్స్ పవర్ మనీల్యాండరింగ్ కేసులో..

## ముంబై, హైదరాబాద్‌లో ఇడి సోదాలు




న్యూఢిల్లీ, మార్చి 6: వ్యాపారవేత్త అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ పవర్ కంపెనీతో లింకున్న మనీలాండరింగ్‌కేసులో ఇవాళ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోదాలు చేపట్టింది. ముంబై, హైదరాబాద్ నగరాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నది. రెండు నగరాల్లో ఉన్న ఆ కంపెనీ ఎగ్జిక్యూటివ్ ఇండ్లపై సోదాలు జరుగుతున్నట్లు చెప్పింది. సుమారు 15 మంది సిబ్బంది సోదాల్లో పాల్గొన్నట్లు ఇడి అధికారి ఒకరు వెల్లడించారు. అనిల్ అంబానీకి చెందిన పలు కంపెనీలపై బ్యాంక్‌ఫ్రాడ్, మనీల్యాండరింగ్ కేసుల్లో ఇడి దర్యాప్తు చేపడుతున్న విషయం తెలిసిందే. గత నెలలో ముంబైలో ఉన్న అనిల్ అంబానీ ఇంటిని ఇడి అటాచ్ చేసింది. ఆ నివాసం సుమారు 3500 కోట్ల విలువ ఉంటుందని అంచనావేస్తున్నారు.

### హార్మూజ్ జలసంధిలో

## భారతీయ నౌకలకు ఇబ్బందిలేదు..

టెహ్రాన్; మార్చి 6: హార్మూజ్ జలసంధిలో భారతీయ చమురు నౌకల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలిగించడం లేదని ఇరాన్ స్పష్టంచేసింది. ఇరాన్ డిప్యూటీ విదేశాంగ మంత్రి సయీద్ ఖతిబ్‌జాదే ఒక అంతర్జాతీయ మీడియా సంస్థతో మాట్లాడుతూ, భారత నౌకలను తాము అడ్డుకుంటున్నట్లు వస్తున్న వార్తలను తోసిపుచ్చారు. అదే సమయంలో హిందూ మహా సముద్రంలో ఇరాన్ నౌకలపై జరుగుతున్న దాడుల విషయంలో భారత్ చొరవ తీసుకోవాలని, ఈ దాడులకు కారణమైన అమెరికాను ప్రశ్నించాలని ఆయన సూచించారు. హార్మూజ్ జలసంధిలో స్థిరత్వం కోసం ఇరాన్ నిరంతరం ప్రయత్నిస్తుందని, ఒకవేళ ఆ జలసంధిని మూసివేయాల్సి వస్తే అధికారికంగా ప్రకటిస్తామని తెలిపారు. ప్రస్తుతానికి అలాంటి ఉద్దేశం లేదని, తమది బాధ్యతాయుతమైన దేశమని స్పష్టం చేశారు. అంతర్జాతీయ జలాల్లో అమెరికా తీరు ప్రమాదకరంగా ఉందని, ఆ దేశపు "ఫుట్‌బాల్ మెంటాలిటీ వల్ల సమస్యలు వస్తున్నాయన్నారు. భారత్, ఇరాన్ దేశాలు చదరంగం ఆడే మనస్తత్వం కలవని, అంటే దౌత్యపరమైన ఆలోచనలతో, వ్యూహాత్మకంగా సమస్యలను పరిష్కరించుకుంటాయని తెలిపారు. ఉద్రిక్తతలను తగ్గించుకోవడానికి దౌత్య మార్గమే సరైనది తెలిపారు.

## ఎప్‌స్టీన్,ట్రంప్ నన్ను లైంగికంగా వేధించారు!

### ఎఫ్‌బిఐ ఇంటర్వ్యూల్లోనే మహిళ వెల్లడి



వాషింగ్టన్, మార్చి 6: ఎప్‌స్టీన్ లైంగిక దారుణాలకు సంబంధించిన మరికొన్ని ఫైళ్లను అమెరికా న్యాయ శాఖ విడుదల చేసింది. ఎఫ్‌బీఐ విచారణకు సంబంధించిన ఈ ఫైల్స్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఓ మహిళ చేసిన ఆరోపణలు సంచలనంగా మారాయి. ఈ డాక్యుమెంట్ల ప్రకారం జెఫ్రీ ఎప్‌స్టీన్ తనను పరిచయం చేసిన తర్వాత, డొనాల్డ్ ట్రంప్ తనపై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు బాధిత మహిళ పేర్కొంది. ట్రంప్‌పై ఆరోపణలకు ఆధారాలు లేవని అమెరికా న్యాయ శాఖ పేర్కొంది. ఇంతకు ముందు జరిపిన సమీక్షలో ఈ పత్రాలను పొరబాటున డూప్లికేట్‌గా పేర్కొనడంతో వాటిని వెల్లడించకుండా నిలిపేశామని న్యాయశాఖ వివరణ ఇచ్చింది. పబ్లిక్ లైబ్రరీలోని సమాచారంపై ఎవరైనా ఆందోళన వ్యక్తం చేస్తే.. ఆ వివరాలను సమీక్షించి, అవసరమైన సవరణలు చేసి తిరిగి ఆన్‌లైన్లో ఉంచుతున్నామని ఈ ప్రక్రియ ఎప్పటి నుంచో జరుగుతోందని అమెరికా న్యాయశాఖ సోషల్‌మీడియాలో వెల్లడించింది. ఎప్‌స్టీన్ ఫైల్స్‌ను ట్రంప్ యంత్రాంగం నిర్వహించిన తీరుపై డెమొక్రాట్లు ఆగ్రం వ్యక్తం చేస్తున్నారు. విడుదల చేసిన పత్రాలలో 2019లో ఎఫ్‌బీఐ ఆ మహిళతో నిర్వహించిన పలు ఇంటర్వ్యూలకు సంబంధించిన వివరణలు ఉన్నాయి. తనకు 13–15 ఏళ్ల వయసు ఉన్నప్పుడు ఎప్‌స్టీన్, ట్రంప్ ఇద్దరూ తనపై లైంగిక దాడి చేశారని 2019 నాటి ఇంటర్వ్యూల్లో ఆ మహిళ ఆరోపించింది. ఎప్‌స్టీన్ తనను న్యూయార్క్ లేదా న్యూజెర్సీకి తీసుకెళ్లి ట్రంప్‌కి పరిచయం చేశాడని ఆ మహిళ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది. ఓరల్ సెక్స్‌కు ట్రంప్ బలవంతం చేయగా ఆయన్ను కొరికినట్లు సదరు మహిళ దర్యాప్తు అధికారులకు వివరించింది. ఎప్‌స్టీన్‌తో సంబంధం గురించి మౌనంగా ఉండాలని తనతోపాటు తన సన్నిహితులకు బెదిరింపు కాల్స్ వచ్చాయని తెలిపింది. ఈ ఆరోపణలను తోసిపుచ్చిన ట్రంప్ తాను ఎలాంటి తప్పు చేయలేదని స్పష్టం చేశారు. అధ్యక్షుడికి వ్యతిరేకంగా అసత్యమైన, సంచలనాత్మక వాదనలు ఉన్నాయంది. ట్రంప్‌పై ప్రతికూల ప్రభావితం చూపుతాయనే కారణంతోనే అధికార యంత్రాంగం ఎప్‌స్టీన్ కేసు దర్యాప్తు వివరాలను కప్పిపుచ్చిందని డెమొక్రాట్లు ఆరోపించారు. 1980ల చివరి నుంచి డొనాల్డ్ ట్రంప్, ఎప్‌స్టీన్ మంచి స్నేహితులు. వీరిద్దరూ అనేక సందర్భాల్లో కలిసి ఫొటోలు దిగారు.

# తిరువూరులో 144 సెక్షన్

- టిడిపి-వైసిపి నేతల బహిరంగ చర్చకు సవాల్... ఉద్రిక్తత
- పోలీసుల మోహరింపు... పికెటింగ్‌లు ఏర్పాటు

విజయవాడ, మార్చి 6 ప్రభాతవార్త ప్రతినిధి: ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గంలో గత కొద్ది రోజులుగా కొనసాగుతున్న రాజకీయ ఉత్కంఠ పరాకాష్టకు చేరింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తిరువూరు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై టిడిపి, విపక్ష వైసిపి నేతలు బహిరంగ చర్చకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలోనే ఇరు వర్గాల కీలక నేతలు బోసు బొమ్మ సెంటర్‌లో చర్చకు వెళ్తున్న విషయం తెలుసుకొని పోలీసులు రంగప్రవేశం చేశారు. అనంతరం ఇరు వర్గాలను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కి తరలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బోస్ బొమ్మ సెంటర్ వద్ద పోలీసులు భారీగా మోహరించారు. గత రెండు రోజులుగా తిరువూరు పట్టణంలో టిడిపి- వైసిపి నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తుంది. నేతలు సవాళ్లు, ప్రతి సవాళ్లు విసురుకుంటున్నారు. ఇరు వర్గాల నేతలకు స్థానిక తహశీల్దార్ సర్దిచెప్పాలని చూసినా వినక పోవడంతో తిరువూరు మండల వ్యాప్తంగా 144 సెక్షన్ విధించారు. ప్రజలు గుంపులుగా ఉన్నా, ఉద్రిక్తతలకు కారణమయ్యే ర్యాలీలు, సభలు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## రైస్ మిల్లర్ల అక్రమాలు...

# అన్నదాతల నిలువుదోపిడీ

- తూకంలో తేడాలు... రైతు కష్టం మిల్లర్ల పాలు
- చోద్యం చూస్తున్న అధికారులు... మండిపడుతున్న రైతన్నలు



గరివిడి (విజయనగరం జిల్లా), మార్చి 6 ప్రభాతవార్త: రైస్ మిల్లర్ల అక్రమాలతో అన్నదాతలు ఆక్రందనలు మిన్నంటుతున్నాయి. నిత్యం మిల్లర్ల దోపిడీతో రైతు దగాపడుతున్నాడు. మిల్లర్ల మోసాలుకి ఆరుగాలం కష్టపడి పంట పండించే రైతు బలవుతూ ఉన్నాడు. మండే ఎండను లెక్కచేయక, భారీ వర్షాలకు తడుస్తూ ఇంటిళ్లపాది అప్పులు చేసి పండించే పంట మిల్లర్ల చేతికి వెళ్లేసరికి తూకంలో మోసాలుకు గురవుతుండటం తాను తీవ్రంగా నష్టపోతూ మిన్నకుండటం తప్ప చేసేదేమీ లేక నిస్సహాయుకునిగా రైతు మిగిలిపోతున్నాడు. ఏడాది పండించిన వరి పంటను రైస్ మిల్లులకు తీసుకు వెళ్లే సమయంలో క్వింటా ధాన్యంలో మూడు నుండి ఐదు కిలోలు తేమ పేరుతో తగ్గిస్తూ 95 కిలోలకే పైకాన్ని మిల్లర్లు చెల్లిస్తుండటంతో అన్నదాతల్లో ఆవేదన చోటుచేసుకుంటుంది. అయితే మిల్లర్లు అంతా సిండికేట్‌గా మారడంతో వారు చెప్పిందే వేదం, ఇచ్చిందే ధర అన్న పరిస్థితి నెలకొంది. మిల్లర్లు ఒక్క కిలో కూడా తడి పేరుతో గాని వేరే సాకు చూపించి తగ్గిస్తే చర్యలు తప్పవని సభ్యులు అడిగిన ప్రశ్నలకు నిండు సభలో రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు. అయితే రైస్ మిల్లులు నడిపేది నాయకులు, నాయకులు బంధువులు కావడంతో అధికారులు ప్రకటనలు మిల్లు యజమానులు చెంతకుచేరే అవకాశం లేకుండా పోయే పరిస్థితి కనిపిస్తోంది. దీంతో అధికారులు మోనం పాటించే పరిస్థితి సాక్షాత్కరిస్తోంది. అధికారులు తమ ప్రకటనలు వట్టి మాటే అన్న పరిస్థితి కనిపిస్తున్నా అధికారులు మోనం వహిస్తూ సంబంధిత మిల్లు యజమానుల పై చర్యలకు వెనుకాడుతున్నారన్న ఆక్షేపణలు రైతుల నుండి బలంగా వినిపిస్తున్నాయి. అలాగే నాసిరకం బియ్యాన్ని రైస్ మిల్లుల్లో మెరుగు పరచుకూడదన్న నిబంధన ఉన్నా యథేచ్ఛగా బియ్యాన్ని పాలిష్ చేస్తూ అదే బియ్యాన్ని అధిక ధరలకు బహిరంగ మార్కెట్లో అమ్మే ప్రక్రియకు మిల్లు యజమానులు కారకులవుతున్నారన్న ఆరోపణలు బాహాటంగా వినిపిస్తున్నాయి. మిల్లుల్లో పాటించాల్సిన భద్రతా ప్రమాణాలు కూడా పాటించే దాఖలాలు లేకపోయినా సంబంధిత అధికారులు మిల్లులు వైపు కన్నెత్తి చూడని పరిస్థితి కనిపిస్తుండటం ఎంతైనా గర్హనీయం. రైతు పంటను దర్జాగా దోపిడీకి పాల్పడే విధంగా వంద కిలోలు ధాన్యంలో 3 నుండి 5 కిలోలు తరుగు పేరుతో, తడి కారణం చూపుతూ దోసుకోవడం దారుణం. అధికారులు మోనం వహించడం గర్హనీయం. బడా నేతలు నడిపే రైస్ మిల్లులు వంక కన్నెత్తి చూసేందుకు సైతం అధికారులు సాహసించక పోయేందుకు మిల్లర్ల యజమానులు నుండి వచ్చే ఒత్తిళ్లు లేక వేరే ఆర్థిక పరమైన లబ్ధి కారణాలున్నాయన్న అనుమానాలు రైతులు వ్యక్తీకరిస్తున్నారు.

అన్నదాతల కష్టాన్ని దోచుకుంటున్న రైస్ మిల్లర్ల యజమానుల దోపిడీని అరికట్టే ప్రయత్నాలు అధికారులు చేస్తారని అన్నదాత ఆత్రంగా నిరీక్షిస్తున్నాడు. ఆ దిశగా అధికారులు అడుగులు వేసి రైతు కష్టం, శ్రమ దోపిడీకి గురికాకుండా కాపాడాల్సి అవసరం, అవశ్యం ఎంతైనా ఉంది.

## అమరావతి ఐఆర్‌ఆర్ కేసు...

# ప్రజాప్రతినిధుల కోర్టుకు మార్చాలి

### హైకోర్టులో మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పిటిషన్

విజయవాడ, మార్చి 6 ప్రభాతవార్త ప్రతినిధి: గత ప్రభుత్వ హయాంలో అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబుతో పాటు మరికొందరిపై నమోదైన అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్‌ఆర్) కేసు విచారణ కీలక మలుపు తిరిగింది. ఈ కేసును విజయవాడ ఎసిబి కోర్టు నుంచి ప్రజాప్రతినిధుల (ఎంపి, ఎమ్మెల్యే) ప్రత్యేక కోర్టుకు బదిలీ చేయాలని కోరుతూ వైసిపి మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రజాప్రతినిధులపై నమోదైన కేసులను కేవలం ప్రత్యేక కోర్టులు మాత్రమే విచారించాలని సుప్రీంకోర్టు తీర్పు ఉందని ఆళ్ల రామకృష్ణారెడ్డి తన పిటిషన్‌లో ప్రస్తావించారు. ఐఆర్‌ఆర్ కేసులో ప్రస్తుత ముఖ్యమంత్రి, ఒక మంత్రి, మాజీ ఎమ్మెల్యేలు నిందితులుగా ఉన్నారని, అందువల్ల ఈ కేసు విచారణ ప్రత్యేక కోర్టు పరిధిలోకి వస్తుందని ఆయన వాదించారు. ఈ నేపథ్యంలో విజయవాడ ఎసిబి కోర్టులో జరుగుతున్న విచారణను నిలిపివేయాలని, కేసు తుది నివేదికను అంగీకరించకుండా స్టే ఇవ్వాలని హైకోర్టును అభ్యర్థించారు. ఇదే అంశంపై ఆళ్ల రామకృష్ణారెడ్డి హైకోర్టులో మరో పిటిషన్ కూడా దాఖలు చేశారు. ఐఆర్‌ఆర్ కేసుకు సంబంధించి సిఐడి నమోదు చేసిన ఛార్జ్‌షీట్, తుది నివేదికలను తనకు అందజేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఆ పత్రాలు తనకు అందకపోవడం వల్లే విజయవాడ ఎసిబి కోర్టులో ప్రొటెస్ట్ పిటిషన్ దాఖలు చేయలేకపోయానని పిటిషన్‌లో పేర్కొన్నారు. గత నెలలో ఈ కేసుపై ఎసిబి కోర్టులో విచారణ జరిగింది. 2024లో సిఐడి దాఖలు చేసిన ఛార్జ్‌షీట్ వివరాలు, 2026లో కేసు ఉపసంహరణ కోసం వేసిన పిటిషన్ కాపీలను తమకు ఇవ్వలేదని ఫిర్యాదిదారు అయిన ఆళ్ల తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అభ్యంతరాలు తెలిపేందుకు గడువు కావాలని కోరగా, న్యాయస్థానం అంగీకరించి విచారణను మార్చి 11వ తేదీకి వాయిదా వేసింది. ఇప్పుడు హైకోర్టులో పిటిషన్లు దాఖలు కావడంతో ఈ కేసు విచారణ మరింత ఆసక్తికరంగా మారింది.

# పెళ్లి ఇంట్లో విషాదం

### కారు అదుపుతప్పి బోల్తా

### యువకుడు మృతి... మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



దత్తిరాజేరు (విజయనగరం జిల్లా), మార్చి 6 ప్రభాతవార్త: పెళ్లి సామాన్లు కొనటానికి విజయనగరం వెళ్లి తిరిగి మానాపురం వస్తుండగా గజపతినగరం మండలం మర్రిపిల్లి పెట్రోల్ బంకు సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం కారు అదుపుతప్పి బోల్తా పడిన సంఘటనలో రౌతు ధనుంజయ నాయుడు (24) ప్రమాదం జరిగిన చోట అక్కడకక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరు రౌతు సాయి శంకర్, గేద్ద శేఖర్ నాయుడుకి తీవ్ర గాయాలు తగిలాయని పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపారు. మృతి చెందిన ధనుంజయ, గాయాల పాలైన దత్తిరాజేరు మండలం పెదమానాపురం బీసీ కాలనీచెందిన వ్యక్తులుగా గుర్తించారు. తెల్లవారితే పెళ్లి బంధువులతో కళకళలాడవలసిన ఇంట్లో విషాదం చోటుచేసుకుంది. పెళ్లికూతురు, వారి తల్లిదండ్రులు బంధువులు దేవుడా ఏంటి ఇటువంటి అగత్యం జరిగిందని కన్నీరు మున్నీరయ్యారు. మృతి చెందిన యువకుడుకి తల్లి సత్యవతి తండ్రి శ్రీనివాస రావు తమ్ముడు గిరి ఉన్నారు. అందొచ్చిన కొడుకు అనంత దూరాలకు వెళ్లిపోవడంతో తల్లిదండ్రుల గుండె కోత మిగిల్చాడని బోరున ఏడుస్తున్న వారిని ఆపడం ఎవరి తరం కాలేదు. ఈ సంఘటనతో పెదమానాపురం గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. పోలీసులు మృతి చెందిన యువకుడి మృతదేహాన్ని పంచనామా నిమిత్తం విజయనగరం తరలించారు. గజపతినగరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఏఎన్‌యు విద్యార్థులను గ్లోబల్ అంబాసిడర్‌లుగా మారుస్తాం

- అకడమిక్ -ఇండస్ట్రీ సమ్మిట్‌లో 40 ఎంఓయులు
- రెక్టార్ ఆచార్య రామినేని శివరాం ప్రసాద్ వెల్లడి



ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, మార్చి 6 ప్రభాత వార్త: ఏఎన్‌యు గోల్డెన్ జూబ్లీ సందర్భంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అకడమిక్- ఇండస్ట్రీ సమ్మిట్ రెండవ రోజు విదేశీయులను ఆకట్టుకుంది. రెండు రోజుల్లోనే 40 కంపెనీలతో ఎంఓయులు కుదుర్చుకున్నట్లు సమ్మిట్ ఎస్టీమ్డ్ ప్యాట్రన్, ఏఎన్‌యు రెక్టార్ ప్రొఫెసర్ శివరాం ప్రసాద్ పేర్కొ న్నారు. అకడమిక్ సమ్మిట్ నిర్వహణ ఆలోచనల 10 రోజుల్లోనే కార్యరూపం దాల్చినట్లు పేర్కొన్నారు. 3రోజుల ఈసమ్మిట్‌కు విశేష స్పందన వచ్చిందని అన్నారు. ఇంజనీరింగ్, ఫార్మ, ఐటి, బయో మెడికల్, బయో సెన్సార్, ఎంఎన్‌సి కంపెనీలు, ఇటువం హెచ్‌ఆర్, టూరిజం కంపెనీలు, సంస్థలు ఈసమ్మిట్‌లో పాల్గొన్నాయని అన్నారు. ఇటువంటి సమ్మిట్‌లు ప్రతీ ఏటా నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. ఏపి, తెలంగాణతో పాటు రెస్టాప్ ఏపి, నేషనల్, ఇంటర్నేషనల్ కంపెనీలను ఆహ్వానించి ఈ సమ్మిట్‌కు కొత్త ప్రత్యేకతను తీసుకొచ్చినట్లు వివరించారు. సమ్మిట్ ఉద్దేశాలను వివరిస్తూ ప్రపంచ వ్యాప్తంగా సుమారు 14కోట్ల మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్నారు. నేడు అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకుంటేనే రాణిస్తామని పేర్కొన్నారు. విద్యార్థుల్లో ఉన్న తరగతి గది స్కిల్‌కు తోడుగా మార్కెట్‌కు అణుగుణంగా, పరిశ్రమలకు అవసరమైన స్కిల్స్‌ను పెంపొందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

ఏఎన్‌యు ఇంజనీరింగ్ విద్యార్థులకు రూ.లక్షలు ఖర్చుచేసి సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, ఇంటర్వ్యూలకు తగిన స్కిల్స్ నేర్పిస్తున్నట్లు శివరాం ప్రసాద్ వెల్లడించారు. తద్వారా ఏఎన్‌యు విద్యార్థులను గ్లోబల్ అంబాసిడర్‌లుగా తీర్చిదిద్దేందుకు తగిన ప్రణాళికలు రూపొందిస్తామని వివరించారు. ఈ సమ్మిట్ ద్వారా అనేక కంపెనీలతో చేసుకున్న అవగాహన ఒప్పందాలను కార్యరూపం దాల్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. శనివారంతో ఈ అకడమిక్ సమ్మిట్ ముగియనుందని, వచ్చేఏడాది 500 కంపెనీలతో మెగా అకడమిక్- ఇండస్ట్రీ సమ్మిట్ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

## రూ.3.14 కోట్ల విలువైన గంజాయి పట్టివేత

జంగారెడ్డిగూడెం, మార్చి 6 ప్రభాతవార్త: మాదకద్రవ్యాల రవాణాపై ఉక్కుపాదం మోపే లక్ష్యంతో ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు చేపట్టిన ఆపరేషన్ వజ్రప్రహార్ అద్భుత ఫలితాలను ఇచ్చింది. జంగారెడ్డిగూడెంఅశ్వారావుపేట జాతీయ రహదారి పై ఉన్న ఆంధ్ర తెలంగాణ సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద జీలుగుమిల్లి ఎస్ఐ వి. క్రాంతి కుమార్, సిబ్బంది నిర్వహించిన వాహన తనిఖీల్లో భారీగా గంజాయి బయటపడింది. నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణిస్తున్న టాటా డీసీఎం వ్యాన్‌ను పోలీసులు అడ్డుకుని సోదాలు చేయగా, అందులో 16 సంచుల్లో దాచిన 597.930 కిలోల గంజాయిని గుర్తించారు. నిందితులు ఒడిశాకు చెందిన దిలీప్ కుమార్ మొహంతి, జనార్దన్ ప్రాదాన్‌లుగా పోలీసులు గుర్తించారు. రాజమండ్రి శివారు బూరుగుపూడి నుంచి మహారాష్ట్రలోని బీడ్ ప్రాంతానికి ఈ సరుకును తరలిస్తుండగా పట్టుబడ్డారు. స్వాధీనం చేసుకున్న గంజాయి, వ్యాన్, సెల్‌ఫోన్ల మొత్తం విలువ సుమారు రూ. 3,14,96,500 ఉంటుందని అధికారులు తెలిపారు. నిందితులపై ఎన్డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ ఆపరేషన్‌లో ప్రతిభ కనబరిచిన సర్కిల్ ఇన్స్పెక్టర్ బి.వెంకటేశ్వరరావు, ఎస్ఐ క్రాంతికుమార్, సిబ్బందిని ఎస్పీ ప్రతాప్ శివకిషోర్ ప్రత్యేకంగా అభినందించారు. మాదకద్రవ్యాల రవాణాకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

## లడ్డూ పేరుతో రాజకీయాలు... ఇక ఆపండి

విజయవాడ, మార్చి 6 ప్రభాతవార్త ప్రతినిధి: లడ్డూ పేరుతో మత రాజకీయాలనుచేసి రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించవద్దని సిపిఎం రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. శాసనమండలిలో లడ్డూపై బుధవారం చర్చ సందర్భంగా ఛైర్మన్ స్థానంలో ఉన్న వ్యక్తిని ఉద్దేశించి మీరు క్రిస్టియన్ అని సంబోధించడం ద్వారా చట్టసభలను మత రాజకీయాలమయం చేసి భ్రష్టు పట్టించటం పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని దారుణంగా అవమానించడమేనని తెలిపారు. ఈ వ్యాఖ్యలను సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని పేర్కొన్నారు. ఇటువంటి వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకొని భవిష్యత్‌లో మతాన్ని రాజకీయాలకు వాడుకోకుండా నిరోధించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొద్దికాలంగా తిరుమల లడ్డు కల్తీ / అవినీతిపై జరుగుతున్న చర్చ సందర్భంగా ఉద్దేశపూర్వకంగానే మత రాజకీయాలను చొప్పిస్తున్నారని తెలిపారు. అవినీతికి పాల్పడిన వారు ఎవరైనా వారిపై చర్య తీసుకోకుండా వివిధ మతాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేయడం గర్హనీయమని తెలిపారు. ఇందుకు అధికార పార్టీతోపాటు ప్రధాన ప్రతిపక్షమూ బాధ్యత వహించాలని పేర్కొన్నారు. సమాజాన్ని విచ్ఛిన్నం చేసే ఇలాంటి రాజ్యాంగ వ్యతిరేక వ్యాఖ్యలను నిరసించాల్సిందిగా రాష్ట్ర ప్రజానీకానికి విజ్ఞప్తి చేశారు. సిట్ నివేదిక బయట పెట్టకుండా ప్రభుత్వం శాసనమండలి సభ్యులకు ఒక నోటు అందించడం ద్వారా వాస్తవాలను తొక్కిపెట్టాలన్న దుర్బుద్ధి కనిపిస్తోందని తెలిపారు. ఆ నివేదికను బట్టబయలు చేసి దాని ఆధారంగా అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లడ్డూ నాణ్యత తగ్గడానికి, అవినీతికి ఇప్పటివరకు రాష్ట్రాన్ని పాలించిన పార్టీల ప్రభుత్వాలదే బాధ్యతని పేర్కొన్నారు. ఏ చర్యలూ తీసుకోకుండా ప్రజల విశ్వాసాలతో రాజకీయాలు చేయాలనుకోవడం తీవ్రమైన నేరమని, ఇప్పటికైనా ఇలాంటి మత విద్వేష రాజకీయాలను మానుకొని అధికార కూటమి అభివద్ధి, ప్రజా సంక్షేమం, తక్షణ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని కోరారు.

## శ్రీవారి చెంత దివ్వెల మాధురి...

# మళ్లీ అదే అపచారం

- నిబంధనలు ఉల్లంఘించి పుట్టినరోజు వేడుకలు
- పోలీసు కేసు నమోదు చేసిన టిటిడి



తిరుమల, మార్చి 6 ప్రభాతవార్త ప్రతినిధి: పుణ్యక్షేత్రం తిరుమల ఆలయ పవిత్రతకు భంగం వాటిల్లకుండా ఫొటోషూట్ చేయడం, రీల్స్ తీయం వంటివి టిటిడి బోర్డు నిషేధించింది. దీనిపై కఠిన చర్యలు తీసుకుంటామని కూడా హెచ్చరిస్తూ సూచికబోర్డులు ఏర్పాటుచేసింది. అయితే ఇవేమీ తమకు కాదన్నట్లు వైసిపి మాజీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాసులు భార్య దువ్వాడ మాధురి బిగ్‌బాస్ తనూజ పుట్టినరోజు వేడుకలు అతిథిగృహం గదిలో జరుపుకోవడం పెద్ద సంచలనంగా మారింది. ఈ వేడుకలను వీడియోతీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టుచేయడం హాల్‌చల్ చేసింది. టిటిడి నిబంధనలు ఉల్లంఘించి మరోసారి దివ్వెల మాధురి పెద్దఅపచారం చేయడంతో దీనిపై టిటిడి అధికారులు తీవ్రంగా పరిగణించారు. దివ్వెల మాధురి, తనూజలపై చట్టపరమైన చర్యలకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం ఉదయం దివ్వెల మాధురి, తనూజ పుట్టినరోజు వేడుకలు చేసుకున్నట్లు తెలియడం, తిరుమలలో ఇలాంటి వేడుకలు చేసుకోవడం పూర్తిగా నిషేధించడం జరిగిందని పేర్కొంది. వేడుకల వీడియో చిత్రీకరించి సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేయడం సరైన పద్ధతి కాదని తప్పుపట్టింది. వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు టిటిడి విజిలెన్స్‌అధికారులు తిరుమల పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఈ ఘటనపై విచారణ మొదలుపెట్టారు. దీంతో మాధురి తిరుమల కొండపై రీల్స్ రగడ మరోసారి సంచలనంగా మారింది. బిగ్‌బాస్ తనూజ పుట్టినరోజున కేక్ కట్ చేయడం, ఆపై కేక్ తినిపిస్తూ సంబరాలు జరుపుకోవడం తీవ్రంగానే మారింది. ఇదీ ఇప్పుడు వివాదంగా మారాయి. కేక్ కట్ చేయడం విమర్శలకు తావిచ్చింది. దేవదేవుడు కొలువైన కొండపై ఎలాంటి సంబరాలు జరుపుకోవడం, కేక్‌లు తీసుకురావడం నిషేధం. అయితే ఆలయ పవిత్రతకు విరుద్ధంగా, కొండపైకి కేక్ ఎలా తీసుకువచ్చారనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. భక్తుల మనోభావాలు దెబ్బతినేలా కొంతమంది రీల్స్ చేసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తుండటం వివాదాలకు కారణంగా మారింది. కట్టుదిట్టమైన భద్రత ఉన్నచోట ఇలా వీడియోలను చిత్రీకరిస్తుండటంపై భక్తులు తీవ్రంగా మండిపడుతున్నారు. గతంలో బ్రహ్మోత్సవాల సమయంలో దువ్వాడ శ్రీనివాస్, దివ్వెల మాదురి నిబంధనలకు విరుద్ధంగా ఆలయ మాడవీధులు, పరిసర ప్రాంతాల్లో వీడియోలు చిత్రీకరించడం తీవ్రస్థాయిలో దుమారం రేపింది. ఈ అంశంపై పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. ఈ కేసు తిరుపతి న్యాయస్థానంలో విచారణ సాగుతోంది. టిటిడి బోర్డులో తీర్మానం చేసినా తిరుమలలో వెడ్డింగ్ షూట్లు, సినిమా పాటలకు రీల్స్ షార్ట్స్ చేయడం, రాజకీయ ప్రసంగాలు చేయడం షరా మామూలైంది.

# నెల్లూరు గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం నిర్మాణానికి ముందడుగు

- టెండర్లు పిలిచిన ఎపిఎడిసిఎల్
- పిపిపి పద్ధతిలో నిర్మాణం

రాజంపేట, మార్చి 6 ప్రభాతవార్త: నెల్లూరు (దగదర్తి గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం) విమానాశ్రయం నిర్మాణంలో ముందడుగు పడింది. ఈ మేరకు శుక్రవారం ఎపి ఎయిర్ పోర్ట్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఎపిఎడిసిఎల్) టెండర్లు పిలిచింది. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్‌లో ఈ ప్రాజెక్టును నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే ఒకసారి ఎపిఎడిసిఎల్ టెండర్లు పిలిచింది. ఆశించిన స్థాయిలో గ్లోబల్ సంస్థలు ముందుకు రాకపోవడంతో మరలా రెండోసారి ఆర్‌ఎఫ్ ఉత్తర్వులు జారీ అయ్యాయి. టెండర్లలో పాల్గొనేందుకు ఈనెల 18 చివరి గడువుగా నిర్ణయించారు. గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయంతో పాటు గ్రీన్ కార్గో ప్రయాణీకుల రద్దీని పెంచే లక్ష్యంతో నిర్మించబడిన ఒక ప్రధాన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుగా రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ ప్రకటించారు. దీని నిర్మాణం జూన్ 2026 నాటికి ప్రారంభమై 2027 నాటికి పూర్తిచేయాలని ఉద్దేశంతో ప్రభుత్వం ఉంది. దీనికోసం దగదర్తి మండలం దామవరం వద్ద 1,332 ఎకరాలకు పైగా భూములు కూడా సిద్ధం చేశారు. రాష్ట్రంలో ఇది 8వ విమానాశ్రయం.

ఇది కృష్ణపట్నం, రామాయపట్నం ఓడరేవులకు సమీపంలో వ్యూహాత్మకంగా ఉంది, ఇది కార్గో కేంద్రీకృత లాజిస్టిక్స్ హబ్‌గా పనిచేస్తుంది. ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతంలో ప్రాంతీయ కనెక్టివిటీని మెరుగుపరచడం, పారిశ్రామిక వృద్ధికి మద్దతు ఇవ్వడం ఈ ప్రాజెక్టు లక్ష్యంగా ప్రభుత్వం పేర్కొంటోంది.

## విజయవాడ బస్టాండ్ నుంచి కనకదుర్గమ్మ ఆలయం మీదుగా భవాని ఐలాండ్‌కు రోప్ వే

### పిపిపి పద్ధతిలో నిర్మించేందుకు ఎజిఐసిఎల్ టెండర్లు



రాజంపేట, మార్చి 6 ప్రభాతవార్త: విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో మూడు రోజులపాటు జరుగుతున్న కుంభాభిషేకం నేపథ్యంలో భక్తులకు, పర్యాటకులకు శుభవార్త. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కాలంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని భావిస్తున్న విజయవాడ కనకదుర్గమ్మ ఆలయం, భవాని ఐలాండ్ రోప్ వే ప్రాజెక్టును పిపిపి పద్ధతిలో నిర్మించేందుకు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శుక్రవారం ఏపీ గ్రోత్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఎజిఐసిఎల్) సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డిపిఆర్) రూపొందించేందుకు టెండర్లను పిలిచింది. విజయవాడ ఆర్టీసీ బస్టాండ్ నుంచి భవాని ఐలాండ్‌కు కనకదుర్గమ్మ ఆలయాన్ని కలుపుతూ నిర్మిస్తారు. అలాగే పున్నమి ఘాట్ వరకు ఈ రోప్ వే ప్రాజెక్టు చేపడతారు. సుమారు అయిదు కిలోమీటర్ల దూరం రోప్ వే నిర్మించేందుకు ప్రభుత్వం టెండర్ల ప్రక్రియ ప్రారంభించింది. డిపిఆర్ రూపొందించేందుకు ఆర్‌ఎఫ్పి టెండర్లు జారీ అయ్యాయి. ఈ టెండర్‌లో పాల్గొనేందుకు ఈనెల 14 చివరి గడువుగా నిర్ణయించారు. ఈనెల 18న ఈ టెండర్లకు సంబంధించి టెక్నికల్ బిడ్‌ను ఓపెన్ చేసి ఖరారు చేస్తారు.



సాకేత్‌కు నియామక పత్రాలను అందజేస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్

## డిప్యూటీ కలెక్టర్‌గా టెన్నిస్ ప్లేయర్ సాకేత్

విజయవాడ, మార్చి 6 ప్రభాతవార్త ప్రతినిధి: అంతర్జాతీయ టెన్నిస్‌లో భారతదేశానికి, ప్రత్యేకంగా ఎపికి పలు విజయాలు అందించి కీర్తిప్రతిష్ఠలు తెచ్చిపెట్టిన అర్జున అవార్డు గ్రహీత మైనేని సాకేత్ తన కెరీర్‌లో మరో కీలక అడుగు ముందుకేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయన్ను డిప్యూటీ కలెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నియామకంలో భాగంగా ఆయనకు ఎన్టీఆర్ జిల్లాలో పోస్టింగ్ ఇచ్చారు. విజయవాడలోని కలెక్టరేట్‌లో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ, సాకేత్‌కు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఏషియన్ గేమ్స్‌తో పాటు పలు అంతర్జాతీయ టోర్నీల్లో పతకాలు సాధించి రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింపజేసిన సాకేత్‌కు ప్రభుత్వం సముచిత గౌరవం ఇచ్చిందన్నారు. వచ్చే వారం ఎటిపి ఛాలెంజర్ టూర్ కోసం ఐరోపా పర్యటనకు వెళుతున్న సాకేత్‌కు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులోనూ మరిన్ని విజయాలు సాధించాలని, అందుకు జిల్లా యంత్రాంగం తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. తనకు ఈ అవకాశం కల్పించిన ప్రభుత్వానికి సాకేత్ కృతజ్ఞతలు తెలిపారు.

# దొరికిన పర్సు పోలీసులకు అప్పగింత..

### వెంకటగిరి విద్యార్థినులపై మంత్రి లోకేశ్‌పై ప్రశంసలు

విజయవాడ, మార్చి 6 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతి జిల్లా వెంకటగిరిలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు తమ నిజాయతీని చాటుకున్నారు. దారిలో దొరికిన బంగారం, నగదు ఉన్న పర్సును పోలీసులకు అప్పగించి ఆదర్శంగా నిలిచారు. ఈ విద్యార్థినులను రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా అభినందించారు. వివరాల్లోకి వెళితే, వెంకటగిరి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న బి.గురుప్రియ, బి.గీతిక, ఎం.గీతిక (8వ తరగతి), పద్మశ్రీ (6వ తరగతి), హేమలత (7వ తరగతి) గురువారం సాయంత్రం పాఠశాల ముగిశాక ఇంటికి బయలుదేరారు. ఎస్‌బిఐ బ్యాంకు వద్ద బస్సు కోసం ఎదురుచూస్తుండగా వారికి ఒక పర్సు కనిపించింది. దాన్ని తెరిచి చూడగా అందులో బంగారం, నగదు ఉండటంతో ఏమాత్రం ఆలోచించకుండా నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ స్వరూపకు అప్పగించారు. అనంతరం బస్టాప్‌కు తిరిగి రాగా, పర్సు పోగొట్టుకున్న మహిళ అక్కడ వెతుకుతూ కనిపించింది. విషయం చెప్పి ఆమెను కూడా పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. పోలీసులు వివరాలు నిర్ధారించుకుని ఆ పర్సును సదరు మహిళకు అందజేశారు. ఈ ఘటనపై మంత్రి నారా లోకేశ్ స్పందించారు. 'నిజాయతీలో మా పిల్లలు బంగారం' అని కొనియాడారు. 'చిన్న వయసులోనే మీ నీతివంతమైన ప్రవర్తన ఆదర్శంగా నిలిచింది. మీ నిజాయతీ మన విద్యాశాఖ గౌరవాన్ని మరింత ఇనుమడింపజేసింది. మీకు ఎల్లప్పుడూ అండగా ఉండే అన్నగా నేను గర్విస్తున్నాను' అంటూ మంత్రి లోకేశ్ విద్యార్థినులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.



## వికసిత్ భారత్ యువ పార్లమెంట్-2026కు

# పద్మావతి వర్సిటీ విద్యార్థినులు



తిరుపతి, మార్చి 6 ప్రభాతవార్త ప్రతినిధి: 'వికసిత్ భారత్ యువ పార్లమెంట్ - 2026' అంశంపై జిల్లా స్థాయి వక్తృత్వ పోటీలకు తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ముగ్గురు విద్యార్థినులు ఎంపికయ్యారు. 'భారత ప్రజాస్వామ్యానికి 50 సంవత్సరాల ఎమర్జెన్సీ నుండి తీసుకోవాల్సిన పాఠాలు' అనే అంశాన్ని ప్రధానంగా తీసుకున్నారు. తిరుపతిలోని ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాలలో మై భారత్ - చిత్తూరు జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించడింది. ఈ పోటీలలో పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం నుండి పి. వెంకటనాగ నిహారిక - ద్వితీయ సంవత్సరం ఇంటిగ్రేటెడ్ ఫుడ్ టెక్నాలజీ, హోమ్ సైన్స్ విభాగం. ఎం.అమీన జైనబ్ - ఎల్ఎల్‌బి విద్యార్థిని, న్యాయ విభాగం. కె.అనఘ - ప్రథమ సంవత్సరం ఎల్ఎల్‌బి, న్యాయ విభాగం నుండి పాల్గొన్న ముగ్గురు విద్యార్థినులు ఎంపిక కావడం విశేషం. ఈ విజయాన్ని సాధించిన విద్యార్థినులకు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఉమ వెన్నం, రిజిస్ట్రార్ ఆచార్య ఉష, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ఆచార్య ఐ.వి. లలిత కుమారి అభినందనలు తెలిపారు.



## డిఆర్‌డిఓ శాస్త్రవేత్త శశికళ సిన్హాకు

# గౌరవ డాక్టరేట్

తిరుపతి, మార్చి 6 ప్రభాతవార్తప్రతినిధి: తిరుపతి పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం 22వ స్నాతకోత్సవం శనివారం జరగనుంది. ఈ స్నాతకోత్స వంలో డిఆర్‌డిఓ శాస్త్రవేత్త శశికళ సిన్హాకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఛాన్సెలర్ హోదాలో హాజరవుతున్నారు. 22వ స్నాతకోత్సవం వేడుకల కార్యక్రమాన్ని శుక్రవారం వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఉమ వెన్నం, రిజిస్ట్రార్ ఆచార్య ఉష, డీన్ ఆచార్య అనురాధ, పిఆర్‌ఓ డాక్టర్ శ్రీరజనీతో కలసి మీడియా సమావేశం నిర్వహించారు. నేటి స్నాతకోత్స వంలో 2,591మందికి పిహెచ్‌డి పట్టాలు, ఎంఫిల్, పోస్ట్‌గ్రాడ్యుయేట్, గ్రాడ్యుయేట్, దూరవిద్యా విభాగంలో పట్టాలు ప్రదానం చేయనున్నారు. 102మందికి సైన్సెస్, సోషల్‌సైన్సెస్, ఇంజనీరింగ్ టెక్నాలజీ విభాగాల్లో బంగారు పతకాలు ప్రదానం చేస్తారు. 23మందికి బుక్‌ప్రైజ్‌లు, ఏడుగురికి నగదు అవార్డులు అందజేయనున్నారు. ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియం సిద్ధమైంది. గవర్నర్ విద్యార్థినులకు దిశానిర్దేశం చేయనున్నారు.





# వీరపాండ్య కట్టబొమ్మన పాత్రలో అలరించిన మంత్రి దుర్గేష్

## సాంస్కృతిక కార్యక్రమంలో అదరగొట్టిన దుర్గేష్ సిఎం, సహచర ప్రజాప్రతినిధుల ప్రశంసల జల్లు

విజయవాడ, మార్చి 6 ప్రభాతవార్త ప్రతినిధి: బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ నిరంకుశత్వాన్ని ఎదిరించి, భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో విప్లవ జ్యోతిగా వెలిగిన వీరపాండ్య కట్టబొమ్మన పాత్రలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అద్భుత నటనతో అలరించారు. అసెంబ్లీ సమావేశాలు నిరవధిక వాయిదా పడిన అనంతరం, శుక్రవారం సాయంత్రం విజయవాడ పట్టణం పటమటలోని ఆంత్రలాక్స్ హాల్‌లో ప్రజాప్రతినిధుల కోసం ఆంధ్రప్రదేశ్ "శాసన వ్యవస్థ" ఆధ్వర్యంలో నిర్వహించిన "ఆటవిడుపు" ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్రీడా సాంస్కృతిక ఉత్సవాలు – 2026 కార్యక్రమంలో మంత్రి దుర్గేష్ తనదైన శైలిలో ఈ ప్రదర్శన ఇచ్చారు. కట్టబొమ్మన విశిష్ట ఆహార్యం, గంభీరమైన వాచకం, రాజసంతో మంత్రి దుర్గేష్ ఆ పాత్రలో జీవించేశారు. స్వతహా రంగస్థల అనుభవం ఉన్న దుర్గేష్ నటనా కౌశ్యలం సభికులందరిని ఆలరించింది. ఆయన వేదికపైకి రాగానే సభలో చప్పట్ల వర్షం కురిసింది. ఈ ప్రదర్శనను వీక్షించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, సహచర మంత్రులు, ప్రజాప్రతినిధులు మంత్రి దుర్గేష్ నటనను వేనోళ్ల కొనియాడారు. దుర్గేష్ నాటక ప్రయోక్త, సీనియర్ జర్నలిస్టు, కాలమిస్టు కావడం విశేషం. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ "దేశభక్తికి నిలువెత్తు రూపం వీరపాండ్య కట్టబొమ్మన అని, పాంచాలకురిచ్చి యుద్ధంలో ఆయన చూపిన సాహసం చిరస్మరణీయమని" కొనియాడారు. అటువంటి మహనీయుడి పాత్రను పోషించే అవకాశం రావడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మంత్రి కందుల దుర్గేష్ నటనా శైలి, సంభాషణల చాతుర్యం, పుణ్యభూమి నాదేశం నమోనమామి పాటలో ప్రభుత్వ చీఫ్ జీవి ఆంజనేయులు, మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యేలు వర్ల కుమార్ రాజా, సునీల్ కుమార్ తదితర సహచర ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రదర్శించిన తీరు సభికులను మంత్రముగ్ధులను చేసింది. నియోజకవర్గంలో ప్రజా సమస్యలు. శాసన సభ, శాసన మండలి వేదికగా వాదోపవాదాలు, ప్రజా సమస్యలపై గళమెత్తడం. విమర్శలు, ప్రతీ విమర్శలు.. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల రాజకీయ జీవితం సాగిపోతుంది. అలాంటి వారికి శుక్రవారం ఆటవిడుపు దొరికింది. విజయవాడలో స్థానిక ఆంత్రాలూక్స్ కన్వెన్షన్ వేదికగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్రీడా సాంస్కృతిక ఉత్సవాలు 2026 కార్యక్రమంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల వేషధారణలు అందరిని అలరించాయి. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు భీముడి పాత్రలో అలరించారు. ఈ ఆటవిడుపు కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, స్పీకరు అయ్యన్న పాత్రుడు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇదొక మంచి కార్యక్రమం అన్నారు. కళల పట్ల ప్రజాప్రతినిధులకు అవగాహన అవసరన్నారు.

# పోలవరం పురోగతిని కేంద్రానికి నివేదించండి

- ప్రాజెక్టుల నిర్మాణ నాణ్యతలో రాజీ లేదు
- ప్రాధాన్యతల వారీగా ఇరిగేషన్ ప్రాజెక్టులు చేపట్టాలి
- ప్రాజెక్టులకు ఇవ్వాల్సిన నిధులపై ఆర్థిక శాఖ రూట్ మ్యాప్ సిద్ధం చేసుకోవాలి
- ప్రాజెక్టుల నిర్మాణాలు సుదీర్ఘ కాలం ఎన్నికల హామీలుగా మిగలకూడదు
- ఇరిగేషన్ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



విజయవాడ, మార్చి 6 ప్రభాతవార్త ప్రతినిధి: ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణాల్లో నాణత్య పాటించే అంశంపై రాజీ పడే ప్రసక్తే ఉండకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రాజెక్టుల నిర్మాణాలు చేసే క్రమంలో ప్రజా భద్రత ముఖ్యమనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలో ప్రాధాన్యత క్రమంలో చేపట్టాల్సిన ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణంపై శుక్రవారం అసెంబ్లీలోని తన ఛాంబర్లో సీఎం చంద్రబాబు సమీక్షించారు. పోలవరం, వెలిగొండ, హంద్రీనీవా, పోలవరం నల్లమల సాగర్ లింక్, చింతలపూడి లిఫ్ట్, వరికపూడిశెల లిఫ్ట్, ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల ప్రగతిపై మంత్రి నిమ్మల రామానాయుడు, ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమావేశమ య్యారు. వివిధ ప్రాజెక్టులకు చేపట్టాల్సిన పునరావాస పనుల పైనా చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ "రాష్ట్ర ప్రభుత్వం ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణానికి ఎంతో ప్రాధాన్యమిస్తోంది. రకరకాల కారణాలతో రాష్ట్రంలో కొన్ని ఇరిగేషన్ ప్రాజెక్టులు సుదీర్ఘ కాలంపాటు ఎన్నికల హామీలుగా మిగిలి పోతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు శంకుస్థాపనలు చేసిన ప్రాజెక్టులు ఇంకా పూర్తి కాకపోవడం సరికాదు. ఇలాంటి వాటికి చెక్ పెట్టాలి. ప్రాజెక్టులు కట్టాలనే డిమాండ్లు ఎన్నికల హామీలుగా మిగిలిపోకూడదు. ప్రజల అవసరాలను తీర్చేలా ప్రాజెక్టుల నిర్మాణాలను పూర్తి చేయాలి. అందుకే ప్రణాళికాబద్ధంగా... ప్రాధాన్యతలను సిద్ధం చేసుకుని ప్రాజెక్టుల నిర్మాణం చేపడుతున్నాం. పోలవరం సహా రాయలసీమ, పల్నాడు, ఉత్తరాంధ్ర ప్రాజెక్టులను ఓ క్రమపద్ధతిలో పూర్తి చేసేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకున్నాం. ఇరిగేషన్ రంగానికి గతంలోనూ... ఇప్పుడు పెద్ద పీట వేసి అవి పూర్తి అయ్యేలా చేసింది.. చేస్తోంది కూటమి ప్రభుత్వమే. ఇదే సమయంలో ప్రాజెక్టుల నిర్మాణాల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడే ప్రసక్తే ఉండకూడదు. ఈ విషయంలో చాలా కఠినంగా వ్యవహరిస్తాను. ఉన్నతాధికారులు మొదలుకుని.. క్షేత్ర స్థాయిలో ఉన్న సిబ్బంది ఏ ఒక్కరూ అలక్ష్యం వహించినా చర్యలు తీసుకుంటాను. ఉమ్మడి రాష్ట్రంగా నాటి కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్నప్పుడు... గత ప్రభుత్వ పాలనలోనూ ప్రాజెక్టుల నిర్మాణాల్లో నాణ్యత విషయంలో కాంప్రమైజ్ అయ్యేవారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఝంఝావతి రబ్బర్ డ్యాం కొట్టుకుపోయింది. గత ప్రభుత్వంలో కీలకమైన పోలవరం ప్రాజెక్టులో డయాఫ్రం వాల్ దెబ్బతినేలా చేశారు. దెబ్బతిన్న డయాఫ్రం వాల్ కు రిపేర్లు చేసినా సరిపోతుందని నిపుణులు నివేదికలు ఇచ్చినా.. నాణ్యత విషయంలో, ప్రజా భద్రత విషయంలో రాజీ పడకూడదనే ఉద్దేశ్యంతోనే కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించాం."అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

### ప్రతి అంశమూ కేంద్రం దృష్టికి తీసుకెళ్లండి

"పోలవరం నిర్మాణం విషయంలో కేంద్రంతో నిరంతరం టచ్ లో ఉండాలి. పోలవరం నిర్మాణానికి సంబంధించిన ప్రతి అప్డేట్ కేంద్రంలోని సంబంధిత వ్యవస్థలకు ఎప్పటికప్పుడు చేర్చాల్సిందే. ప్రమాణాలు, నాణ్యత పాటించే విషయం సహా నివేదికల పరంగా, సాంకేతికాంశాల పరంగా, డాక్యుమెంటేషన్ పరంగా ఎలాంటి లోపాలు ఉండకూడదు... తేడాలు రాకూడదు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో కేంద్రం సహా ఎవ్వరూ వేలెత్తి చూపే పరిస్థితి రాకూడదు. పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు అంతర్జాతీయ స్థాయి నిపుణులు తరుచూ సందర్శనకు వచ్చేలా చూడండి. వీలు కాకుంటే వీడియో కాన్ఫరెన్సుల ద్వారానైనా వారి సలహాలను స్వీకరించండి. చారిత్రత్మాక నిర్మాణాలు చేపడుతున్నప్పుడు.. జీవనాడి లాంటి ప్రాజెక్టులను చేపడుతున్నప్పుడు అదే స్థాయిలో జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రాజెక్టుల నిర్మాణంలో ప్రమాణాలు పాటించే విషయంలో చాలా కచ్చితంగా ఉంటాను. రాష్ట్ర ప్రభుత్వం టైం బౌండ్ పెట్టుకుని పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపడుతోందనే విషయాన్ని కేంద్రంలోని అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. ఇకపై పోలవరం ప్రాజెక్టుపై ప్రతి నెలా సమీక్షిస్తా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం విషయంలో అధికారులు, కాంట్రాక్టర్లు రిలాక్స్ కావడానికి వీల్లేదు. పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ పనులు మేఘాద్రిగడ్డ వరకు పూర్తి కావాలి. రైట్ మెయిన్ కెనాల్ లో ఇంకా రూ. 200 కోట్ల మేర పనులు పూర్తి చేయాల్సి ఉంది. వీటిని కూడా ఈ సీజన్లో పూర్తి చేయాలి. డయాఫ్రం వాల్ నిర్మాణం ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలి. 41.15 మీటర్ల వరకు నీళ్లను నిలిపేందుకు అవసరమైన నిర్మాణ, పునరావాస పనులు కంప్లీట్ కావాలి. పునరావాసం విషయంలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే... వెంటనే పరిష్కరించుకోవాలి. దీనికి అవసరమైన నిధులు, పరిపాలనా అనుమతుల విషయంలో జాప్యం చేయవద్దు. పునరావాసం విషయంలో నిర్వాసితులతో నిరంతరం సంప్రదింపులు జరిపి సాఫీగా ఆర్ అండ్ ఆర్ పనులు చేపట్టేలా జాగ్రత్తలు తీసుకోవాలి"అని ముఖ్యమంత్రి ఆదేశించారు.

### వెలిగొండ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల పనులు పరుగులు పెట్టాలి

"వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కావడానికి రూ. 2041 కోట్లు అవసరమవుతాయి. ఓవైపు ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపడుతూనే.. మరోవైపు పునరావాసం పైనా ఫోకస్ పెట్టాలి. దీనికి అవసరమైన మేరకు విడతల వారీగా నిధులను విడుదల అయ్యేలా ఆర్థిక శాఖ అధికారులతో ఇరిగేషన్ అధికారులు సమన్వయం చేసుకోవాలి. హంద్రీనీవా ఫేజ్1 కెనాల్ వైడనింగ్ 92 శాతం పూర్తి అయింది. కుప్పంపుంగనూరు కాల్వలను 85 శాతం కంప్లీట్ చేసుకున్నాం. మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలి. హంద్రీనీవా జలాలు మడకశిర వరకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలి. నీవా బ్రాంచ్ కెనాల్ ద్వారా చిత్తూరు వరకు నీటిని తీసుకెళ్లాల్సి ఉంటుంది. పోలవరంనల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపై కేంద్రంపై ఒత్తిడి పెంచాలి. అనుమతులు సాధించాలి. వరికిపూడిశెల ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులు వచ్చేస్తే పనులు మొదలు పెట్టండి. అలాగే ప్రాధాన్యత క్రమంలో చింతలపూడి లిఫ్ట్ పనులను పూర్తి చేయాలి. ఉత్తరాంధ్రలో చిన్న చిన్న ప్రాజెక్టులను కూడా పెండింగులో పెట్టేశారు. తక్కువ ఖర్చు పెడితే పూర్తయ్యే ప్రాజెక్టులను ముందుగా టేకప్ చేసే అంశాన్ని పరిశీలించండి. వంశాధారనాగావళి, తోటపల్లి బ్యారేజ్, తారకరామ, మహేంద్ర తనయ ఆఫ్ షోర్, హీర మండలం, మద్దువలస, ఝంఝావతి, నాగావళిచంపావతి లింక్ వంటి ప్రాజెక్టుల పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలి.. ఫలితం చూపెట్టాలి. ఏపీఎస్ఐడీసీ పరిధిలో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల మరమ్మత్తులు, నిర్వహణ కోసం హ్యామ్ పద్దతిలో పనులు చేపట్టాలి. రాష్ట్రంలో ప్రాధాన్యత క్రమంలో చేపట్టే ప్రాజెక్టులకు నిధుల కొరత లేకుండా చూసుకోవాలి. ఈ మేరకు ఆర్థిక శాఖతో సమన్వయం చేసుకోవాలి. ఇరిగేషన్ ప్రాజెక్టుల నిమిత్తం విడతల వారీగా నిధులు విడుదల చేసే విధంగా ఆర్థిక శాఖ రూట్ మ్యాప్ సిద్ధం చేసుకోవాలి." అని ముఖ్యమంత్రి నిర్దేశించారు.

# ఆగమోక్తంగా శ్రీ కనకదుర్గమ్మ మహాకుంభాభిషేక మహోత్సవాలకు శ్రీకారం

- వేడుకగా దుర్గమ్మ ఆలయంలో మహాకుంభాభిషేక ఉత్సవాల సందడి



ఇంద్రకీలాద్రి, మార్చి 6, ప్రభాతవార్త: అమ్మలగన్న అమ్మ, శ్రీ కనక దుర్గమ్మ ఆలయంలో ద్వాదశ వార్షిక (12 ఏళ్లకు ఒకసారి జరిగే) మహాకుంభాభిషేక మహోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభ మయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ పవిత్రమైన ఆగమ శాస్త్రోక్త కార్యక్రమం, వేదమంత్రోచ్చారణలు, భక్తిశ్రద్ధల మధ్య మొదటి రోజు ఉదయం 7గంటలకు శ్రీ కనక దుర్గా నగర్ ప్రవేశ ద్వారం నుండి వేద పండితులు, అర్చకులు పవిత్ర కలశాలను తీసు కుని, ఇంద్రకీలాద్రికి చేరుకున్నారు. ఊరేగింపులో దేవస్థానం చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఇఒ శీనా నాయక్ తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని, అమ్మవారికి కలశ సమర్పణ చేశారు. అనంతరం యాగశాల ప్రవేశం, గణపతి పూజ, పుణ్యాహవాచనం, దీక్షాధార ణలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు అంకు రార్పణ, మంత్రపుష్పం, మూల మంత్ర హవనం నిర్వహించారు.

**సామాన్యులకు పెద్దపీట:** మహాకుంభాభిషేకం సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి పర్యవేక్షణలో, ఆగమ శాస్త్ర ప్రకారం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఇఒ, చైర్మన్లు తెలిపారు. ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని వారు భక్తులను కోరారు.

**ఏర్పాట్లపై హర్షం:** ఇంద్రకీలాద్రిపై శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానంలో అత్యంత వైభవంగా జరుగుతున్న కుంభాభిషేక మహోత్సవాల నేపథ్యంలో, రాష్ట్రం నలుమూలల నుండి వస్తున్న భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం యంత్రాంగం చేపట్టిన ఏర్పాట్లు సత్ఫలితాలను ఇస్తున్నాయి. క్యూ లైన్లలో వేచి ఉన్న భక్తులకు కనీస ఇబ్బంది కలగకుండా తీసుకున్న చర్యలపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. నగరపాలక సంస్థ సహకారంతో భక్తుల దాహార్తిని తీర్చేందుకు లోబ్రిడ్జి నుండి ప్రారంభించి ప్రధాన దేవ స్థానం వరకు ప్రతి 100 మీటర్లకు ఒక తాగునీటి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సీతమ్మ వారి పాదాలు, దుర్గా ఘాట్, ఘాట్ రోడ్, ప్రధాన ఆలయ పరిసరాలు, మహా మండపం, శివాలయం. ఇతర రద్దీగా వుండే 11 కీలక ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరాలను, వైద్య నిపుణులతో అందుబాటులో ఉంచారు. క్యూ లైన్లలో వేచి ఉన్న భక్తులకు నిరంతరాయంగా మజ్జిగ మరియు బిస్కట్ ప్యాకెట్ల పంపిణీ జరుగుతోంది. ప్రత్యేకించి చంటి బిడ్డలకు, వృద్ధులకు పాలు పంపిణీ చేస్తూ సాయంత్రం వరకు కొనసాగించారు. అన్న ప్రసాద విభాగం ద్వారా భక్తులందరికీ రుచికరమైన అన్న ప్రసాదం వితరణ నిరంతరం కొనసాగుతోంది. కనకదుర్గ నగర్ ఎంట్రన్స్ నుండి మహా మండపం వరకు, అలాగే ఘాట్ రోడ్ ఎంట్రన్స్ నుండి ప్రోటోకాల్ ఆఫీస్ వరకు క్యూ లైన్ల పొడవునా షామియానాలు/ టెంట్లు ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అన్ని రకాల దర్శన టిక్కెట్లను రద్దు చేసి, భక్తులందరికీ శ్రీ అమ్మవారి ఉచిత దర్శనాన్ని కల్పిస్తున్నారు. క్యూ లైన్లు త్వరగా కదిలేందుకు వీలుగా అంతరాల య దర్శనాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేయడం జరిగింది. చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఇఒ వి.కె. శీనానాయక్ స్వయంగా కనకదుర్గ నగర్ వైపు ఉన్న క్యూ లైన్లలో పర్యటించారు. భక్తులతో నేరుగా మాట్లాడి అందుతున్న సౌకర్యాలపై వారి సంతృప్తిని అడిగి తెలుసుకున్నారు. వాలంటీర్స్‌కు ఇఒ దిశా నిర్దేశం చేశారు. మోడల్ గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించి, సిసిటివిల ద్వారా భక్తుల కదలికలను పరిశీలించారు. ఏసిపి దుర్గారావుతో చర్చించి, భద్రత మరియు క్యూ లైన్ల క్రమబద్ధీకరణపై ఆదేశాలు జారీ చేశారు.

**దుర్గమ్మవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి:** ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెనుతురుమల్లి గోపాలకృష్ణారావు విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ వారిని దర్శించుకున్నారు. వేద పండితులు ఆయనకు వేదాశీర్వచనం అందజేయగా, ఆలయ అధికారులు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటాన్ని బహుకరించారు.

**అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు:** సాయంత్రం ధర్మపథం వేదికపై జరిగిన వివిధ కార్యక్రమాలు భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తాయి. విజయవాడకు చెందిన సప్ప శివకుమార్ బృందం



మహా గణపతిం, అయిగిరి నందిని, వినాయక కౌత్వం, కొండలలో నెలకొన్న, జతిస్వరం, అఖిలాండకోటి బ్రహ్మాండనాయక, జయ జయ జనార్దన వంటి కీర్తనలకు తమ అద్భుత కూచిపూడి నృత్యంతో భక్తులను అలరించారు.

**అలరించిన భక్తిరంజని:** కుసుమ, సంధ్య, శ్రీనివాస్, కె. జగన్మోహిని బృందం వినాయక, సంగీత సామ్రాజ్య సంచారిణి, హిమగిరి తనయే, కామాక్షి స్వరజతి, నను గన్న తల్లి, శంభో మహాదేవ, జయ జయ వైష్ణవి కీర్తనలను హృద్యంగా తమ గాత్ర మాధుర్యంతో భక్తులను మైమరపించారు.

**శ్రీ అమ్మవారికి కోలాట నీరాజనం:** విజయవాడకు చెందిన శాంభవి కోలాటం బృందం ప్రదర్శించిన కోలాటం భక్తులలో ఉత్సాహాన్ని నింపింది. కుంభాభిషేక వేడుకల వేళ ఇంద్రకీలాద్రిపై వెల్లివిరుస్తున్న సాంస్కృతిక శోభ భక్తులకు మరువలేని అనుభూతిని మిగిల్చింది.



# సీమ కరవుకు శాశ్వత పరిష్కారం

- సిఎం చంద్రబాబు చొరవతో సీమ ప్రాజెక్టుల్లో జలకళ
- రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు
- అసెంబ్లీలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు



అనంతపురం, మార్చి 6 ప్రభాతవార్త బ్యూరో: శతాబ్దాల రాయలసీమ కరవుకు శాశ్వత పరిష్కారం చూపు తున్న దార్శనికుడు నారా చంద్ర బాబు నాయుడని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు కొనియాడారు. శాసనసభలో శుక్రవారం ద్రవ్య వినిమయ బిల్లుపై ఆయన మాట్లా డారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం సంక్షేమ, అభివృద్ధిలో గొప్పగా విరా జుల్లుతోందన్నారు. బడుగుల సంక్షేమం కోసం ఏటా బడ్జెట్లో సుమారు రూ.1.30 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్న ఏకైక ప్రభుత్వం మనదేనన్నారు. ముఖ్యంగా ఎటువంటి తోడులేని, పనిచేయలేని స్థితిలో బతుకుతున్న అభాగ్యులకు పాలకులు చేయూతనిచ్చి ఆదుకోవాలని విధురనీతి చెబుతోం దన్నారు. అలాంటి పరిస్థితుల్లో ఉన్న 63లక్షల మంది నిరుపేదలను ప్రతినెల పింఛన్ తో ప్రభు త్వం ఆదుకుంతోందన్నారు. దేశంలో ఏ ప్రభు త్వం ఇవ్వనంత ఎక్కువ డబ్బులు పెన్షన్ రూపం లో నిరుపేదలకు పంచుతుండటాన్ని ప్రభుత్వం ఓ బాధ్యతగా చేపట్టిందన్నారు. ఒకటవ తేదీ గ్రామాల్లో పింఛన్ పంపిణీకి వెళ్ళినప్పుడు అనేక మంది చంద్రబాబును తమ కుటుంబ పెద్దలా, ఒక దేవుడిలా కొలుస్తున్నారన్నారు. అందులో తాము భాగస్వాములైనందుకు ఎంతో ఆనంది స్తుంటామన్నారు. కదలలేని స్థితిలో మంచానికే పరిమితమైన వారు నెలకు రూ.15,000 పెన్షన్ తీసుకుంటూ తమ ఆరోగ్య సంరక్షణతో పాటు కుటుంబ పోషణ, పిల్లల చదువుకు చేయూతగా నిలుస్తున్నారన్నారు. అలాగే అన్నదాత సుఖీభవ ద్వారా రైతు కుటుంబాలకు ఏటా రూ.20 వేలు పెట్టుబడి రాయితీ కింద మంజూరు చేయడం జరుగు తుందన్నారు. తల్లికి వందనం పథకము ద్వారా ప్రతి పేద విద్యా ర్థికి ఏడాదికి రూ.15 వేలు ఆర్థిక చేయూత అందిస్తుండటం సంతోషం చతగ్గ పరిణామన్నారు. దీనివల్ల చాలా కుటుంబాల్లో పిల్లలు మధ్య లో చదువు ఆగిపోకుండా కొనసాగించడానికి దోహదపడుతుందన్నారు. ఏడాదికి ప్రతి పేద కుటుంబానికి మూడు ఉచిత వంటగ్యాస్ సిలిం డర్లు పంపిణీ చేయడం, స్త్రీ శక్తి ద్వారా బాలికలు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం గొప్ప విషయ మన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో కొనసాగు తున్నా, వీటన్నింటినీ పేదలకు కల్పిస్తున్న తీరు ప్రశంసనీయమన్నారు. పేదల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి, అంకితభావం, బాధ్యతను తెలి యజేస్తోందన్నారు. రాష్ట్రంలో ముఖ్యంగా ఉత్త రాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు సాగునీరు అం దించడంలో చంద్రబాబు ప్రభుత్వం కీలకపాత్ర పోషిస్తోందన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో సుమారు రూ.65 వేల కోట్లు సాగునీటి రంగానికి ఖర్చు చేశారని వివరించారు. ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో రాయలసీమలో అనేక ప్రాజెక్టు లు జలకళను సంతరించుకున్నాయన్నారు. కేవలం వర్షాధారంపై ఆధారపడ్డ ప్రాంతాల్లో అనేక సాగునీటి వనరులు ఎండాకాలంలో కూడా నీటితో కళకళలాడుతుండటం సీమ జిల్లాలపై ముఖ్య మంత్రి చంద్రబాబుకు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.



# కమాండో పోటీల్లో ఎపి పోలీసుల జైత్రయాత్ర

## 4 ప్రతిష్టాత్మక ట్రోఫీలు కైవసం

విజయవాడ, మార్చి 6 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ పోలీసు విభాగంలోని ఎలైట్ ఫోర్సెస్ అయిన గ్రేహౌండ్స్, ఆక్టోపస్ కమాండోలు జాతీయ స్థాయిలో మరోసారి తమ సత్తా చాటుకున్నారు. హర్యానా రాష్ట్రం మనేసర్‌లోని నేషనల్ సెక్యూరిటీ గార్డ్ క్యాంపస్‌లో నిర్వహించిన 16వ ఆల్ ఇండియా పోలీస్ కమాండో పోటీల్లో ఏపీ బృందం అద్భుత ప్రదర్శన కనబరిచింది. ఏకంగా నాలుగు ప్రతిష్టాత్మక ట్రోఫీలతోపాటు పతకాలను సాధించింది. పోటీలన్నింటిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకుగాను ఎపి పోలీసు కమాండో దళానికి "ఉత్తమ రాష్ట్ర పోలీసు కమాండో" ట్రోఫీ దక్కింది. దానితో పాటు షూటింగ్‌లో సత్తా చాటినందుకుగాను "బ్లాక్ హాక్ ట్రోఫీ", దేశంలో ఉత్తమ ఆపరేషనల్ లీడర్ షిప్ కనబరిచినందుకు గాను "రణనీతి ట్రోఫీ", ఓవరాల్ కమాండో పోటీల్లో అద్భుత ప్రదర్శనకు గాను కాంస్య పతకం సొంతం చేసుకున్నారు.

**డిజిపి అభినందనలు:** జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ కీర్తి, ప్రతిష్టలను పెంచి న కమాండోలను రాష్ట్ర డిజిపి హరీశ్‌కుమార్ గుప్తా ప్రత్యేకంగా అభినందిం చారు. గ్రేహౌండ్స్, ఆక్టోపస్ బృందాల శ్రమ, క్రమశిక్షణే ఈ విజయానికి కారణమని ఆయన కొనియాడారు. భవిష్యత్‌లోనూ ఇదే తరహాలో నిబద్ధతతో పని చేసి దేశ రక్షణలో కీలకపాత్ర పోషించాలని ఆకాంక్షించారు.

# వామపక్ష తీవ్రవాదాన్ని పూర్తిగా తుడిచిపెట్టేస్తాం



## కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

భువనేశ్వర్, మార్చి 6: దేశంలో వామపక్ష తీవ్ర వాదాన్ని పూర్తిగా తుడిచి పెట్టేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా మరోసారి స్పష్టం చేశారు. ఒడిశా లోని కటక్‌లో జరిగిన కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం 57వ రైజింగ్ డే వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ మార్చి నెలాఖరు నాటికి భారతదేశం మావోయిజం నుంచి పూర్తి విముక్తి పొందుతుందని ధీమా వ్యక్తం చేశారు. గతంలోనే నిర్ణయించుకున్న లక్ష్యం ప్రకారం, దేశాన్ని నక్సలిజం రహితంగా మార్చే ప్రక్రియ తుది దశకు చేరుకుందని ఆయన వివరించారు. ముఖ్యంగా ఒకప్పుడు మావోయిస్టులు కలలుగన్న తిరుపతి నుంచి పశుపతి వరకు రెడ్ కారిడార్‌ను నిర్మించా లనే కలలను భద్రతా దళాలు పూర్తిగా నాశనం చేశాయని కొనియాడారు. నక్సలిజం పీడను వదిలించడంలో సీఆర్‌పీఎఫ్, కోబ్రా బెటాలియన్ల అసాధారణ కృషిని అమిత్ షా ప్రశంసించారు. భద్రతా దళాల పటిష్ట వ్యూహాల వల్ల నక్సల్స్ ప్రభావం ఇప్పుడు చాలా తక్కువ ప్రాంతాలకు, అది కూడా కొన్ని మారుమూల ప్రాంతాలకే పరిమితమైందని పేర్కొన్నారు. అభివృద్ధికి అడ్డుపడుతూ, పాఠశాలలు, ఆసుపత్రులను ధ్వంసం చేసే మావోయిస్టుల పట్ల ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడదని ఆయన హెచ్చరిం చారు. ఆయుధాలు పట్టి అమాయకులను పొట్టనబెట్టుకునే వారికి ఆయుధాలతోనే సమాధానం చెబుతామని హోం మంత్రి హెచ్చరికలు జారీ చేశారు. మావోయిజం వల్ల దశాబ్దాలుగా వెనుకబడిన గిరిజన ప్రాంతాల్లో ఇప్పుడు అభివృద్ధి పరుగులు తీస్తోందని వివరించారు. బస్తర్ వంటి మారుమూల ప్రాంతాల్లో ఇప్పుడు రోడ్లు, విద్యుత్, మొబైల్ కనెక్టివిటీ వంటి సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. ఒకప్పుడు హింసకు నిలయంగా ఉన్న ప్రాంతాలు ఇప్పుడు అభివృద్ధికి చిహ్నాలుగా మారుతున్నా యని, గిరిజన బిడ్డలకు ఉపాధి, విద్యావకాశాలు కల్పించడమే ఉద్దేశమన్నారు.



# నాగర్‌కోయిల్ నుంచి చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు

## రైల్వే అధికారులు వెల్లడి

**హైదరాబాద్ (తార్నాక), మార్చి 6, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రానికి మరో అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు అందుబాటు లోకి రానుంది. తమిళనాడు రాష్ట్రంలోని నాగర్‌కోయిల్ నుంచి తెలంగాణలోని చెర్లపల్లి వరకు నడిచే ఈ కొత్త రైలును త్వరలో ప్రారంభించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ రైలులో స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ బోగీలు ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలను అనుసంధా నించే ఈ రైలు ప్రారంభం వల్ల దీర్ఘదూర ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణం కలగనుంది. ప్రత్యేకంగా దక్షిణ భారత రాష్ట్రాల మధ్య ప్రయాణించే ప్రయాణికులకు ఈ రైలు ఎంతో ఉపయోగపడుతుందని అధికారులు పేర్కొన్నారు. ఈ రైలుకు సంబంధించిన పూర్తి వివరాలు, స్టాపేజీలు, టైమ్‌టేబుల్‌ను త్వరలో ప్రకటించనున్నట్లు తెలిపారు.

# పశువుల అక్రమ రవాణా అరికట్టేందుకు చర్యలు

## డిజిటల్ ట్రాన్స్‌పోర్ట్ సర్టిఫికెట్ వ్యవస్థను ప్రారంభించిన మంత్రి అచ్చెన్నాయుడు



విజయవాడ, మార్చి 6 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో అక్రమ పశువుల రవాణాను అరికట్టేందుకు పశుసంవర్ధక శాఖ కీలక చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శుక్రవారం విజయవాడలోని తన క్యాంప్ కార్యాలయంలో పశువుల రవాణా సర్టిఫికెట్‌ను ఆన్‌లైన్ ద్వారా జారీ చేసే డిజిటల్ ట్రాన్స్‌పోర్ట్ సర్టిఫికెట్ జనరేషన్ సిస్టమ్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖ రూపొందించిన ఈ వ్యవస్థ ద్వారా పశువుల రవాణా మరింత పారదర్శకంగా, నియంత్రణలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇకపై పశువులను రవాణా చేయదలిచిన ప్రతి వ్యక్తి సంబంధిత పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నుంచి డిజిటల్ ట్రాన్స్‌పోర్ట్ సర్టిఫికెట్ పొందిన తర్వాత మాత్రమే రవాణా చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సర్టిఫికెట్‌ను పశువుల రవాణా నిబంధనలకు అనుగుణంగా జారీ చేయడం జరుగుతుందని మంత్రి వివరించారు. రవాణా, పోలీస్ శాఖలు ఈ డిజిటల్ సర్టిఫికెట్‌ను పరిశీలించిన అనంతరం మాత్రమే పశువుల రవాణాకు అనుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ విధానం అమలు లోకి రావడంతో పశువుల అక్రమ రవాణాపై సమర్థవంతమైన నియంత్రణ సాధ్యమవుతుందని, అలాగే పశుసంవర్ధక రంగంలో పారదర్శకత, బాధ్యత పెరుగుతాయని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ దామోదర్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ రేసులో 8మంది
# భారత్ నుంచి ఒకే ఒక్కడు

**ముంబై:** టీ20 ప్రపంచకప్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ రేసులో ఉన్న 8మంది పేర్లను ఐసీసీ విడుదల చేసింది. అందులో సంజు సాంమ్సన్ చోటు దక్కించుకున్నాడు. అతడితోపాటు ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ విల్ జాక్స్, పాకిస్థాన్ ఓపెనర్ ఫర్హాన్, దక్షిణాఫ్రికా కెప్టెన్ మార్‌క్రమ్, పేసర్ లుంగి ఎంగిడి, న్యూజి లాండ్ ఆల్ రౌండర్ రచిన్ రవీంద్ర, బ్యాటర్ టిమ్ సీఫర్ట్, అమెరికా బౌలర్ వాన్ షాక్‌విక్ ఎంపికయ్యారు. వీరిలోంచి ఒకరిని అభిమానులే ఎన్నుకునే అవకాశాన్ని ఐసీసీ కల్పించిం ది. అందుకోసం తన వెబ్‌సైట్‌లో ఎంపిక చేసే ఆప్షన్ ఇచ్చింది.

సంజూ ఈ టోర్నీలో ఆడిన 4 మ్యాచ్‌ల్లో 77.33 సగటుతో 232 రన్స్ చేశాడు. స్ట్రైక్ రేట్ 201.73గా ఉంది. పాకిస్తాన్ ఓపెనర్ ఆడిన 7 మ్యాచ్‌ల్లో రెండు సెంచరీలతో సహా 76.63 సగటుతో 383 రన్స్ చేశాడు. ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ విల్ జాక్స్ 226 పరుగులు, 9 వికెట్లు...న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ రచిన్ రవీంద్ర 128 పరుగులు, 11 వికెట్లు పడగొట్టారు. దక్షిణాఫ్రికా కెప్టెన్ మార్‌క్రమ్ 286 పరుగులు, న్యూజిలాండ్ ప్లేయర్ టిమ్ సీఫర్ట్ 274 పరుగులు, దక్షిణాఫ్రికా బౌలర్ లుంగి ఎంగిడి 12 వికెట్లు, అమెరికా బౌలర్ షాడ్లీ వాన్ స్కాల్క్‌విక్ 13 వికెట్లతో అద్భుత ప్రదర్శన చేశారు. భారత్, న్యూజిలాండ్ మధ్య ఫైనల్ పోరు

# కప్ వదిలేసిన బ్రూక్




**ముంబై:** క్యాచెస్ విన్ మ్యాచెస్ ఏమో గానీ క్యాచ్ డ్రాప్ అయితే మ్యాచ్ గోవిందే. ఇదే వాంఖడేలో జరిగిన సెకండ్ సెమీస్‌లో గెలిచిన టీమిండియా, ఓడిన ఇంగ్లాండ్ మధ్య తేడా. అసాధ్యమైన క్యాచ్‌లను సుసాధ్యం చేయడం తోనే టీమిండియా గెలవగలిగింది. సులువైన క్యాచ్‌లను కూడా అందుకోలేక ఇంగ్లాండ్ ఇంటిముఖం పట్టింది. ఇంగ్లాండ్ కెప్టెన్ క్యాచ్‌ను కాదు వదిలేసింది కప్‌ను అని సోషల్ మీడియాతో తెగ వైరల్ అవుతోంది.




క్యాచ్ డ్రాప్... మ్యాచ్ డ్రాప్.. ఇది ఇంగ్లాండ్ కు వాంఖడేలో బాగా తెలిసొచ్చింది. కెప్టెన్ బ్రూక్ లాలీపాప్‌లా వచ్చిన క్యాచ్‌ను నేలపాలు చేయడంతో ఇంగ్లాండ్ భారీ మూల్యం చెల్లించు కుంది. అప్పటికే అభిషేక్ శర్మ అవుటయ్యాడు. సంజూ శాంమ్సన్ 15 పరు గుల వద్ద ఉన్నాడు. ఇన్నింగ్స్ మూడో ఓవర్లో అర్చర్ బౌలింగ్‌లో సంజూ మీడాన్‌లో ఇచ్చిన సులువైన క్యాచ్‌ను కూడా బ్రూక్ అందుకోలేకపోయాడు. దీంతో లైఫ్ లైన్ పొందిన సంజూ అదనంగా 74 రన్స్ చేశాడు. అంతేకాదు ఇషాన్ కిషన్‌తో విలువైన భాగస్వామ్యం నడిపాడు. ఒకవేళ బ్రూక్ క్యాచ్ అందుకుని ఉంటే టీమిండియా మరింత ఒత్తిడిలో పడేది. ఆ క్యాచే కాదు సెమీ ఫైనల్లో ఇంగ్లాండ్ ఫీల్డింగ్ దారుణంగా ఉంది. పలు క్యాచ్‌లు చేజారాయి.

భారత ఇన్నింగ్స్‌లో సంజు క్యాచ్ చేజారడం కీలక మలుపైతే.. ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌లో విల్ జాక్స్ క్యాచ్ ఇంకా గొప్ప టర్నింగ్ పాయింట్. బెతెల్‌తో కలి సి విలువైన భాగస్వామ్యంతో మ్యాచ్‌ను ఇంగ్లాండ్ వైపు తిప్పాడు జాక్స్. ఈ భాగస్వామ్యం ఇంకొంతసేపు కొనసాగితే మ్యాచ్‌పోయేదే. కానీ అర్ష్‌దీప్ వేసిన 14వఓవర్లో ఫుల్‌టాస్‌గా వచ్చిన చివరిబంతికి జాక్స్ కవర్స్‌లో భారీ షాట్ ఆడా డు. చాలాదూరం నుంచి పరుగెత్తుకుని వచ్చిన అక్షర్..అద్భుత రీతిలో బంతిని అందుకున్నాడు. కానీ ఆ పరుగులో తనను తాను నియంత్రించు కోలేకపోయిన అక్షర్.. చురుగ్గా స్పందించి తన ముందే ఉన్న దూబె వైపు బంతి విసరగా అతను క్యాచ్ అందుకున్నాడు. క్యాచ్ పట్టింది దూబెనే అయినా.. ఘనత అక్షర్‌దే. అంతకుముందు ఇంగ్లాండ్ కెప్టెన్ బ్రూక్ గాల్లోకి లేపిన బంతిని పాయింట్‌లో ఉన్న అక్షర్ 28 మీటర్లు వెనక్కి పరుగెత్తి అక్షర్ అద్భుతంగా అందుకున్నాడు. తను ఔటైన విష యాన్ని కాసేపటి వరకు బ్రూక్ కూడా నమ్మలేకపోయాడు. నిజానికి బ్రూక్ ఈ ప్రపంచ కప్‌లో గొప్ప ఫామ్‌లో ఉన్నాడు. పాకిస్తాన్‌పై సెంచరీ సాధించాడు. బ్రూక్ అవుటవడం తో ఇంగ్లాండ్ ఒత్తిడికి గురైంది. మొత్తానికి క్యాచ్‌లు నేలపాలు చేసి ఇంగ్లాండ్ ఇంటిదారి పడితే... భారత ఫీల్డర్లు అద్భుతంగా ఒడిసిపట్టడంతో టీమిండియా ఫైనల్ చేరింది.

# సంజూ సునామీ.. ఎవరాపగలరు?




**అహ్మదాబాద్:** సంజూ సాంమ్సన్... ఈ పొట్టి ప్రపంచకప్‌లో మార్మోగుతున్నపేరు. రెండే రెండు ఇన్నింగ్స్‌లు అతన్ని స్టార్‌ను చేశాయి. అప్పటివరకు రిజర్వ్‌బెంచ్‌కే పరి మిత మైన సంజూ సాంమ్సన్... నాకౌట్ స్టేజ్‌లో అదరగొడుతున్నాడు. సూపర్8 గట్టెక్కాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్ లో మాస్టర్ క్లాస్ చూపాడు. జింబాబ్వేపై 24 రన్స్, ఆ తర్వాత వెస్టిండీస్‌పై 97 రన్స్ చేసి భారత్‌ను సెమీస్‌కు చేర్చిన కేరళ తంబి...ఇంగ్లాండ్‌పై అదే జోరు చూపి కప్‌కు దగ్గరచేర్చాడు.

32 ఏళ్ల సంజూ విశ్వనాథ్ సాంమ్సన్... పొట్టి ఫార్మాట్‌లో విలువైన ప్లేయర్, మూడు సెంచరీలు అతని ఖాతాలో ఉన్నా యి. అయినా టీ20 ప్రపంచకప్‌కు జట్టులో స్థానమే డైలమాలోపడింది. కారణం న్యూజిలాండ్‌తో జరిగిన అయిదు టీ20ల సిరీస్‌లో పేలవఫామ్. 6, 24, 0, 6, 10.. ఇలా 5 మ్యాచ్‌ల్లో 46 రన్స్ మాత్రమే చేశాడు. అయితే రిజర్వ్ ఓపెనర్ గానే టీ20ప్రపంచకప్‌కు సంజూ వచ్చాడు. అందుకనుగుణంగా గ్రూప్ స్టేజ్‌లో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ సంజూకు తుది జట్టులో చోటు దక్కలేదు. అభిషేక్ శర్మ విఫలమైనా టీమ్ మేనేజ్‌మెంట్ అతనివైపే మొగ్గు చూపడంతో సంజూ రిజర్వ్‌బెంచ్‌కే పరిమితమవ్వాల్సి వచ్చింది.

దక్షిణాఫ్రికాతో సూపర్8 తొలి మ్యాచ్ లోనూ సంజూకు చోటు దక్కలేదు. ఆ మ్యాచ్‌లో టీమిండియా ఓడడంతో మిగతా రెండు మ్యాచ్‌ల్లో తప్పక గెలవాల్సిన పరిస్థితి. దీంతో బ్యాటింగ్‌ను పటిష్టం చేయడంతో పాటు.. ఓపెనింగ్ లెఫ్ట్, రైట్ కాంబినేషన్ ఉండాలనే ఉద్దేశ్యంతో సంజూ తుది జట్టులోకి వచ్చాడు.

జింబాబ్వేపై ఆడింది కొద్దిసేపే అయినా సంజూ సాంమ్సన్ కసికొద్ది బాదాడు. రెండు సిక్స్‌లతో వేగంగా 24 రన్స్ చేశా డు. ఇక వెస్టిండీస్ మ్యాచ్‌లోనైతే జూలు విదిల్చాడు. టార్గెట్ ఛేజింగ్‌లో విండీస్ బౌలర్లపై సంజూ విరుచుకుపడ్డాడు. కేవలం 50 బంతుల్లోనే 97 రన్స్‌తో అజేయంగా నిలిచి భారత్‌ను సెమీఫైనల్ చేర్చాడు. ఇక వాంఖడేలో అతనికి ఆకాశమే హద్దయింది. విండీస్‌పై ఆటను కంటిన్యూ చేస్తూ 89 రన్స్ సాధించాడు. ఈ రెండు ఇనింగ్స్‌లతో ఇపుడు సంజూ ఫేవరెట్‌గా మారాడు. న్యూజిలాండ్‌తో జరిగే ఫైనల్లోనూ అతని పై అంచనాలు పెరిగాయి.

## ప్రేగ్ చెస్ ఫెస్టివల్ మాస్టర్స్
# అరవింద్ సంచలనం



**ఫరాగ్వే:** ప్రేగ్ చెస్ ఫెస్టివల్ మాస్టర్స్‌లో డిపెం డింగ్ ఛాంపియన్ అరవింద్ చిదంబరం సంచల నం సృష్టించాడు. 8వ రౌండ్‌లో టాప్‌సీడ్ వాన్ ఫారెస్ట్‌ను 62ఎత్తుల్లో ఓడించాడు. నల్లపావులతో ఆడిన అరవింద్... చక్కని ఎత్తులతో ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేశాడు. భారత గ్రాండ్ మాస్టర్ మిడిల్ గేమ్‌లో అనూహ్య ఎత్తు వేశాడు. బంటు కోసం తన క్వీన్‌ను త్యాగంచేసే ప్రమాదకర ఎత్తు గడ వేశాడు. ఈ ఉచ్చులో చిక్కుకున్న వాన్ ఫారెస్ట్ చివర్లో తప్పు ఎత్తు వేసి ఇరుక్కున్నాడు. దీన్ని సద్వినియోగం చేసుకుంటూ అరవింద్ పై చేయి సాధించాడు. దీంతో వాన్ 62 మూవ్‌ల తర్వాత ఓటమిని అంగీకరించి గేమ్‌నుంచి వైదొలి గాడు. ఈ విజయంతో అరవింద్ 4పాయింట్లతో మరో ఇద్దరితో నాలుగో స్థానానికి చేరాడు.

ఇక ప్రపంచ ఛాంపియన్ గుకేష్ నిరాశజనక ఆటతీరు కొనసాగుతోంది. ఇప్పటివరకు గెలుపు లేకుండా కొనసాగుతున్నాడు. 8వ రౌండ్‌లో మరో డ్రాతో సరిపెట్టాడు. గుకేష్ 2.5 పాయింట్లతో చివరన ఉన్నాడు. ఇప్పటివరకు ఐదు డ్రాలు, మూడు ఓటములు నమోదుచేశాడు.



టెస్ట్ అరంగేట్రం చేసిన విమెన్ క్రికెటర్లు కాశ్వీ గౌతమ్, క్రాంతి గ్రాడ్, ప్రతీక రావల్, సయాలీ సత్ఘారే

# భారత్ ఉమెన్స్ తొలి ఇన్నింగ్స్‌లో 198 ఆలౌట్

**పెర్త్:** పింక్ బాల్ టెస్టులో భారత విమెన్స్ తడ బడ్డారు. ఆస్ట్రేలియాతో జరుగుతున్న ఏకైక టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో 198 పరుగులకే కుప్పకూలిం ది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఆరం భంలోనే స్మృతి మందాన(4) వికెట్ కోల్పో యింది. షెఫాలీ వర్మ (35), ప్రతీకా రావల్(18) ఆదుకున్నారు. స్వల్ప వ్యవధిలో ఇద్దరూ అవుట్ కావడంతో భారత్ కష్టాల్లో పడింది. కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ (19), దీప్తి శర్మ (7), రిచా ఘోష్ (11), స్నేహ్ రాణా (5) కూడా తక్కువ పరుగులకే పెవిలియన్ చేరారు. ఒకవైపు వికెట్లు పడుతున్నా మరో ఎండ్‌లో జెమీమా రోడ్రిగ్స్ (52) నిలకడగా ఆడింది. ఈ క్రమంలో టెస్టు కెరీర్‌లో నాలుగో హాఫ్ సెంచరీ పూర్తి చేసింది. ఆఖర్లో కాశ్వీ గౌతమ్ (34) అజేయంగా నిలి చింది. ఆసీస్ బౌలర్ అన్నాబెల్ సదర్లాండ్ (4/46) భారత్‌ను కట్టడిచేసింది. హామిల్టన్ 3, బ్రౌన్ 2, గార్డెనర్ ఒక వికెట్ తీశారు.

తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియా మొదటి రోజు ఆట ముగిసేసరికి 3 వికెట్ల నష్టానికి 97 పరుగులు చేసింది. పెర్రీ (43), అన్నాబెల్ సదర్లాండ్ (20) క్రీజ్‌లో ఉన్నారు. ఓపెనర్ జార్జియా వోల్ (2), ఫోయబ్ లిట్చ్‌ఫీల్డ్ (9), హీలే (13) విఫలమయ్యారు. భారత బౌలర్లలో సయాలి 2, క్రాంతి ఒక వికెట్ తీశారు. ఆసీస్ ఇంకా 102 పరుగులు వెనుకబడి ఉంది.

# విద్యుత్ వాహనాల్లో రికార్డుసేల్స్!

**మంబయి, మార్చి 6:** భారత్‌లో విద్యుత్ వాహనాల విక్రయాలు గతనెలలో భారీగాపెరిగాయిప్రత్యేకించి టూవీలర్లు 46శాతం వృద్ధిని నమోదుచేసాయి. ప్యాసింజర్ వాహనాలు 44శాతం వాణిజ్యవాహనాల్లో 156శాతం సేల్స్ పెరిగినట్లు ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ ఫాడా వెల్లడించింది. ఇకత్రీవలర్లు 25శాతం పెరిగినట్లు తేలింది.



నెలవారీగాచూస్తే జనవరిలో పెరిగాయి. ఫిబ్రవరినెల తక్కువ రోజులు కావడంవల్లనే కొంతమేర తగ్గినట్లు కనిపిస్తుందని, వాస్తవానికి రికార్డుస్థాయిలో సేల్స్ జరిగినట్లు వెల్లడించింది. ఓలా ఎలక్ట్రిక్, టివిఎస్ మోటార్స్ 67శాతం, బజాజ్ ఆటో 17శాతం అమ్మకాలుపెరిగాయి. ఏథర్ ఎనర్జీ 72శాతం హీరోమోటోకార్ప్ 364శాతం అమ్మకాలు పెరిగితే గ్రీవ్స్ ఎలక్ట్రిక్‌మొబిలిటీ 28శాతం సేల్స్ పెంచుకోగలిగింది. టాప్‌ఫైవ్‌లో ఈ కంపెనీలే ఉన్నాయి. ఓలా కంపెనీ విక్రయాలు మందగించడంతో ఆరో స్థానానికి పడిపోయింది. ప్యాసింజర్ వాహనాలు 13,733 వరకూ విక్రయిం జరిగి 44శాతం శ1ద్దిననమోదుచేసింది. టాటామోటార్స్, జెఎస్‌డబ్ల్యు ఎంజి మోటార్స్, మహీంద్ర అండ్ మహీంద్ర, విన్‌ఫాస్ట్ ఆటో నాలుగుస్థానాల్లో నిలిచాయి. ఇక ఎలక్ట్రిక్ నరతీవీలర్లుకూడా 66,398 యూనిట్లు విక్రయాలు జరిగాయి. జనవరితో పోలిస్తే 25.09శాతం వృద్ధి నమోదుకాగా విద్యుత్ వాణిజ్యవాహనాలు 2051 యూనిట్లు విక్రయించి 156శాతం వాటాతో 2.03శాతం వృద్ధినమోదుచేసినట్లు ఫాడా వివరించింది.

# డాలర్ వర్సెస్‌రూపాయి 91.70

**ముంబయి, మార్చి 6:** వారాంతంలో డాలరుతోరూపాయి మారకం విలువలు ఊగిసలాడాయి. చివరకు ఆరుపైసలు క్షీణించి 91.70వద్ద ముగిసింది. ముడిచమురుధరలు పెరగడంతో ఆర్బీఐ జోక్యం అనివార్యం అయింది. విదేశీకరెన్సీ నిపుణుల ప్రకారం దేశీయ ఈక్విటీల్లో భారీగా అమ్మకాలుకొనసాగాయి. విదేశీ పెట్టుబడులు పెద్దమొత్తంలో విత్‌డ్రా కావడంతో రూపాయి క్షీణించింది. విత్‌డ్రాలన్నింటికీ డాలర్లలోనే చెల్లింపులుచేయడమే ఇందుకు కారణం. రూపాయీ భారీ క్షీణత కట్టడికి అమెరికానిర్ణయం కూడా కీలకమయింది. 30 రోజులపాటు రష్యా చమురు కొనుగోలుకు అమెరికా అంగీకరించడంతో చమురుధరలపై ఒత్తిడి తగ్గింది. హార్మోజ్ జలసంధినుంచి భారత్‌నౌకలకు ఎలాంటి ఇబ్బందిలేదని ఇరాన్‌సైతం ప్రకటించడం కూడా రూపాయి క్షీణతకు కొంత




బ్రేకులు వేయగలిగినట్లయింది. అమెరికా ఆర్థికమంత్రి స్కాట్ బెస్సెంట్ మాట్లాడతూ ప్రపంచ ఇంధన సరఫరాపై ఇరాన్ కార్యాచరణ వల్లనే కొత్త ఒత్తిడిపెరిగిందని ఇపుడు సడలింపులు ఉన్నట్లు తెలిపారు. ప్రారంభంలో 91.64 వద్ద ట్రేడింగ్‌ప్రారంభించిన తర్వాత ఇంట్రేడాలో 91.54కు చేరింది. తదనంతరం క్రమేపీ ఊగిసలాడుతూ 91.78వద్దకు చేరింది. చివరకు 91.70వద్ద మారకం విలువలట్రేడింగ్‌ముగిసింది. అంతకుముందురోజుకంటే ఆరుపైలు క్షీణించింది. గురువారం ఏకంగా 41 పౌసలు రికవరీ అయింది. ఒకదశలో 97 పైసలునష్టపోయిన రూపాయి 41 పైసలు రికవరీచేసుకోగలిగింది. ద్రవ్యోల్బణం పెరగడం, కరెంటుఖాతా లోటు పెరగడం, సంక్లిష్టమైన మానిటరీ పాలసీ వంటివికూడా కొంత తోడయినట్లు రేటింగ్ సంస్థలు పేర్కొంటున్నాయి.




# ఎస్‌బ్యాంకు ఎండిసిఇఒగా మురళీధర్ టోన్సే

**ముంబయి, మార్చి 6:** ఎస్‌బ్యాంకు ఎండిసిఇఒగా వినయ్ మురళీధర్ టోన్సే నియమితులయ్యారు. మేనేజింగ్‌డైరెక్టర్; చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా ఆయన మూడేళ్ల కాలం కొనసాగుతారు.

టోన్సే ఈనెల 12వ తేదీనుంచి ఎండిసిఇఒగా బాధ్యతలు స్వీకరి స్తారు. తాత్కాలిక బాధ్యతలు ఏప్రిల్ ఐదో తేదీవరకూ క ఒనసాగుతాయి. ఆ తర్వాత పూర్తికాలపు ఎండిసిఇఒగా బాధ్యతలు స్వీకరిస్తారని ఎస్‌బ్యాంకు యాజమాన్యం ప్రకటించింది.

## ఐదురోజుల్లో రూ.19 లక్షలకోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి
# సెన్సెక్స్,నిఫ్టీలకు ఇరాన్ వార్ ఎఫెక్ట్!



**ముంబయి, మార్చి 6:** అంతర్జాతీయ ఉద్రిక్తతలు దేశీయ స్టాక్ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపాయి. అమెరికాఇజ్రాయెల్ మరియు ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధం ఏడో రోజుకు చేరుకోవడంతో శుక్రవారం దలాల్ స్ట్రీట్ విలవిల్లాడింది. ఐదురోజుల్లోనే మార్కెట్లలో రూ.19 లక్షలకోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి అయిపోయింది. బిఎస్ఇలో లిస్ట్ అయిన కంపెనీల మార్కెట్ విలువలు 468.28 లక్షలకోట్లనుంచి రూ.449.35 లక్షలకోట్లకు తగ్గిపోయింది. వారం రోజులుగా సెన్సెక్స్ 3329 పాయింట్లు క్షీణిస్తే నిఫ్టీ 1046 పాయింట్లు దిగజారింది. ఆయిల్ ధరలు భగ్గుమనడం, యుద్ధ భయాలతో ఇన్వెస్టర్లు భారీగా అమ్మకాలకు దిగడంతో సూచీలు కుప్పకూలాయి. మార్కెట్ ముగిసే సమయానికి బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సెన్సెక్స్ ఏకంగా 1,097 పాయింట్లు కోల్పోయి 78,918 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 315 పాయింట్లు నష్టపోయి 24,450 వద్ద ముగిసింది. బ్యాంకింగ్ రంగ షేర్లు తీవ్ర ఒత్తిడికి లోనయ్యాయి. నిఫ్టీ బ్యాంక్ సూచీ 2.15 శాతం పతనమై 57,783 వద్దకు చేరింది. నిఫ్టీ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా నష్టాలను చవిచూశాయి. సెక్టార్ల వారీగా పరిశీలిస్తే ప్రైవేట్ బ్యాంక్, పిఎస్‌యు బ్యాంక్, రియల్టీ రంగాలు టాప్ లూజర్స్ గా నిలిచాయి. అయితే ఎఫ్ఎంసీజీ, ఐటీ రంగాలు స్వల్ప లాభాల్లో ముగిశాయి. మరోవైపు యుద్ధ వాతావరణం కారణంగా డిఫెన్స్ షేర్లలో మాత్రం జోరు కనిపించింది. ఎన్ఎస్ఈలో పలు డిఫెన్స్ కంపెనీల షేర్లు, ప్రభుత్వ రంగ సంస్థల షేర్లు 9 శాతం వరకు లాభపడటం గమనార్హం. ఇరాన్ క్షిపణి దాడులతో బహ్రెయిన్‌లోని ఆయిల్ రిఫైనరీ దెబ్బతినడంతో అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 86 డాలర్లకు పైగా ట్రేడ్ అవుతుండగా, అమెరికన్ క్రూడ్ 81 డాలర్లు దాటింది. హార్మోజ్‌మూసివేతతో బ్రెంట్‌ముడిచమురు 85 డాలర్ల రేంజ్‌కి చేరింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 0.09 శాతం తగ్గి 91.70 వద్ద ముగిసింది. మార్కెట్లో అనిశ్చితి పెరగడంతో ఇండియా విక్స్ (వీఐఎక్స్) సూచీ 11 శాతం పెరిగింది.

# మార్కెట్లకు మూడు కొత్తఐపిఒలు!

**ముంబయి, మార్చి 6:** స్టాక్ మార్కెట్ల నియంత్రణ సంస్థ ఈ వారంలో మూడు కొత్త ఐపిఒలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వాటిలో ఈస్ట్‌మాన్ ఆటో అండ్ పవర్, మైల్‌స్టోన్ గేర్స్, బాన్‌బ్లాక్ టెక్నాలజీస్ వంటివి ఉన్నాయి. వీటిలో రెండు కంపెనీలు కొత్తగా ఐపిఒకు రావడం, ఒఎఫ్ఎస్‌రూటులో కూడా ఉన్నాయి. బానబ్లాక్ టెక్నాలజీస్ ఐపిఒ రూ.230 కోట్లమేర వాటాలుజారీచేస్తున్నది. ఆఫర్‌ఫర్‌సేల్ రూటులో మూడు కోట్ల ఈక్విటీ వాటాలు విక్రయిస్తుంది. ఎన్ఎస్ఇ, బిఎస్ఇల్లో లిస్టింగ్‌చేస్తోంది. పాంతోమత్ క్యాపిటల్ అడ్వయిజర్స్ బుక్‌రన్నింగ్ లీడ్‌మేనేజర్‌గాను, కెఫిన్ టెక్నాలజీస్ రిజిస్ట్రారుగాను వ్యవహరిస్తోంది. ఇతర కీలక వివరాలయిన ఐపిఒ తేదీలు, ఇష్యూధరలు వంటివి ప్రకటించాల్సి ఉంది. మైల్‌స్టోన్ గేర్స్ కంపెనీ రూ.1100 కోట్లు సమీకరించేందుకుగాను నిర్ణయించింది. ఆఫర్‌ఫర్‌సేల్‌లో కూడా 300 కోట్లు జారీచేస్తుంటే కొత్తషేర్లు 800 కోట్ల రూపాయలవరకూ జారీ చేస్తోంది. స్టాక్ ఎక్స్ఛేంజిల్లో లిస్టింగ్ అవుతాయి. కెఫిన్ టెక్నాలజీస్ రిజిస్ట్రార్‌గా వ్యవహాటిస్తున్నది. ఐపిఒ తేదీలు, ధరలు వంటివి కూడా ఈ కంపెనీ ఇంకా ప్రకటించలేదు. ఈస్ట్‌మన్ ఆటో అండ్‌పవర్‌కంపెనీ కూడా సెబీ వద్ద గత ఏడాది డిసెంబరు 9న డిఆర్‌హెచ్‌పి దాఖలుచేసింది. ఐపిఒ తేదీలు,ఐపిఒ ధరలు లాట్‌సైజు వంటివి ఇంకా ప్రకటించాల్సి ఉంది. ఈ ఆఫర్ ఒక బుక్‌బిల్డ్ ఇష్యూగా నిలుస్తుంది. యాక్సిస్‌క్యాపిటల్ బుక్‌రన్నింగ్‌మేనేజర్‌గా వ్యవహరిస్తోంది.




# రికార్డు గరిష్టానికి విదేశీ కరెన్సీ నిల్వలు!

**ముంబయి, మార్చి 6:** భారత్ విదేశీ కరెన్సీ రిజర్వులు రికార్డుస్థాయికి పెరిగాయి. గతనెల 27వ తేదీతోముగిసిన వారం రోజుల్లో 728.49 బిలియన్ డాలర్లకు పెరిగినట్ల ఆర్బీఐ ప్రకటించింది. మొత్తం రిజర్వులు 4.88 బిలియన్ డాలర్లమేర పెరిగాయని, వీటిలో బంగారం నిల్వలు, విదేశీ కరెన్సీ ఆస్తులు వివరాలు కూడా ఉన్నాయి. అంతకుముందు వారంలో 726 బిలియన్‌డాలర్లు కూడా చేరుకన్న సంఘటనలున్నాయి. గతనెల 13వ తేదీతో ముగిసిన వారంలోనే రికార్డుస్థాయి వివరాలున్నాయి. బంగారం రిజర్వులు కూడా 4.14 బిలియన్‌డాలర్లుపెరిగి 131 బిలియన్‌డాలర్లుగా ఉన్నాయి. బంగారంధరలు 3.36శాతంపెరిగి




ఔన్స్ ఒక్కింటికి 5,278డాలర్లుగా ఉన్నాయి. విదేశీ కరెన్సీ ఆస్తులుక ఊడా 561 మిలియన్ డాలర్లు పెరిగాయి. డాలరేతర కరెన్సీల్లో హెచ్చుతగ్గులు తేడాలు ఇందుకుకీలకం అయ్యాయి. యూరో, పౌండ్ స్టెర్లింగ్,యెన్ వంటి వాటి విలువల్లో తేడాలనే ఆస్తులుగాపరిగణిస్తారు. ఇక స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ 26 మిలియన్ డాలర్లుపెరిగి 18.86 బిలియన్ డాలర్లకు చేరాయి. ఐఎంఎఫ్‌వద్ద భారత్ రిజర్వుస్థాయి 158 మిలియన్ డాలర్లు పెరిగి 4.87 బిలియన్ డాలర్లకు చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకూ విదేశీ కరెన్సీ రిజర్వులు 63 బిలియ్ డాలర్లుపెరిగినట్లు ఆర్‌బిఐ వెల్లడించింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

## మార్చి 15 నుండి ఏప్రిల్ 15 వరకు రక్తదాన్ మహోత్సవం - జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం మార్చి 6 ప్రభాతవార్త :డిఎన్నార్ కళాశాల ఆడిటోరియంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ మరియు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు చదలవాడ నాగరాణి చేతుల మీదుగా "రక్తదాన్ మహోత్సవ్" రక్తదాన అవగాహన కార్యక్రమాల గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో "రక్తదాన్ మహోత్సవ్" పేరిట ఒక నెలరోజులపాటు రక్తదాన అవగాహన, రక్తదాన ప్రోత్సాహక కార్యక్రమం మార్చి 15 నుండి ఏప్రిల్ 15 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా స్వచ్ఛంద రక్తదాన ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడంతో పాటు అర్హత కలిగిన దాతలను రక్తదానం చేయడానికి ప్రోత్సహించడం లక్ష్యంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్కూల్ కమిటీలు, విద్యార్థులు, విద్యా వ్యవస్థకు చెందిన అన్ని భాగస్వాములను భాగస్వామ్యం చేయడం ద్వారా రక్తదానం ద్వారా ప్రాణాలను రక్షించే మానవతా సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. పాఠశాల విద్యాశాఖలో అధిక సంఖ్యలో సిబ్బంది ఉండటం వలన జిల్లాలో స్వచ్ఛంద రక్తదానాన్ని ప్రోత్సహించడంలో ఈ శాఖ ప్రముఖ పాత్ర పోషించగలదని తెలిపారు. అలాగే జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలలో రక్తదాన కార్యక్రమాలలో ముందంజలో నిలవాలని ఆమె ఆకాంక్షించారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ తానే ఒక స్వచ్ఛంద రక్తదాతగా స్ఫూర్తినిస్తూ, ఉపాధ్యాయులకు అన్ని భాగస్వాములను రక్తదానంపై చైతన్యం కల్పించాలని సూచించారు. అలాగే జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ ఎయిడెడ్ మరియు అన్‌ఎయిడెడ్ పాఠశాలలు ఈ రక్తదాన ఉద్యమంలో పాల్గొంటాయని తెలిపారు. రెడ్ క్రాస్ పశ్చిమ గోదావరి చైర్మన్



డా. ఎం. ఎస్. వి. ఎస్. భద్రి రాజు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ నాయకత్వంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా జిల్లాలో నిర్వహిస్తున్న వివిధ మానవతా కార్యక్రమాలను వివరించారు. ఈ రక్తదాన్ మహోత్సవ్ కార్యక్రమంలో ఉపాధ్యాయ సమాజం చురుకుగా పాల్గొని రక్తదానానికి ముందుకు రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, సమగ్ర శిక్ష ఏపీసి పి. శ్యాంసుందర్, సహాయ సంచాలకులు సత్యనారాయణ, విద్యాశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పశ్చిమగోదావరి,ఏలూరు వార్త

# అంగన్వాడీ టాయిలెట్స్ నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలి

## - నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు - ఏలూరు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి

ఏలూరు, మార్చి 6, ప్రభాత వార్త: జిల్లాలో ఇంజనీరింగ్ శాఖల ద్వారా చేపట్టిన నిర్మాణ పనులు, బిల్లులు అప్లోడ్ పనులు ఈనెల 15వ తేదీ లోగా పూర్తి చేయాలనీ జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. జిల్లాలో పంచాయతీ రాజ్, ఉపాధి హామీ, ఆర్ డబ్ల్యూ ఎస్, సమగ్ర శిక్ష, హౌసింగ్, ఇరిగేషన్, పబ్లిక్ హెల్త్, తదితర ఇంజనీరింగ్ శాఖల ద్వారా చేపట్టిన నిర్మాణ పనుల ప్రగతిపై శుక్రవారం సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న దృష్ట్యా జిల్లాలో ఇంజనీరింగ్ శాఖల ద్వారా చేపట్టిన నిర్మాణ పనులు, బిల్లులు అప్లోడ్ పనులు ఈనెల 15వ తేదీ లోగా పూర్తి చేయాలన్నారు. ఏప్రిల్, 1వ తేదీ నుండి ఉపాధి హామీ పథకం వి.బి.జి. రామ్- జి పథకం గా మారనున్న దృష్ట్యా ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులు మార్చ్,15వ తేదీలోగా పూర్తిచేసి, బిల్లులను కూడా వెంటనే ఆన్లైన్ లో అప్లోడ్



చేయాలనీ, నిర్ణీత సమయంలోగా పనులు పూర్తిచేయకుండా, బిల్లులు అప్లోడ్ చేయని బిల్లులు చెల్లింపు బాధ్యత సంబంధిత ఇంజనీరింగ్ అధికారులదేనని కలెక్టర్ స్పష్టం చేశారు. పనులలో ప్రగతి చూపించని, బిల్లులు అప్లోడ్ లో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలలో టాయిలెట్లు, త్రాగునీరు సౌకర్యాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థుల సంఖ్యకు తగిన విధంగా సురక్షిత త్రాగునీటి ఆర్‌ఓ ప్లాంట్లు, టాయిలెట్లు ఉండాలని, వాటికి నీటి సరఫరా సౌకర్యం ఉండాలన్నారు. సంక్షేమ వసతి గృహాలకు దోమల నిర్మూలనకు దోమ తెరలు ఏర్పాటుచేయాలన్నారు. పనుల పురోగతిని సంబంధిత శాఖల అధికారులు పరిశీలించాలన్నారు. ఐటిడిఏ పీడీ రాములు నాయక్, జిల్లా పరిషత్ సీఈఓ శ్రీహరి, పంచాయతీరాజ్, ఆర్ డబ్ల్యూ ఎస్, ఇరిగేషన్ ఎస్ఈ లు జెడ్. రమేష్, త్రినాథ్ బాబు, దేవప్రకాష్ ఐసిడిఎస్ పీడీ శారద, హౌసింగ్ అధికారి సత్యనారాయణ, సాంఘిక సంక్షేమ శాఖాధికారి విశ్వమోహన్ రెడ్డి, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖాధికారి నాగరాణి, సంబంధిత శాఖల డివిజినల్, మండల స్థాయి అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నరసాపురం నుంచి పలు రైళ్లను కోరిన కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

### దక్షిణ మధ్య రైల్వే జీఎంతో భేటీ



నరసాపురం ప్రభాతవార్త : నరసాపురం భీమవరం కైకలూరు మీదుగా విజయవాడ హైదరాబాద్ విజయవాడ బెంగళూర్ వెళ్లే రైళ్ళను నరసాపురం స్టేషన్ నుంచి కొత్తగా మంజూరు చేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీ వాస్తవను కేంద్ర ఉక్కు గనుల సహాయ మంత్రి నరసాపురం ఎంపీ భూపతి రాజు శ్రీనివాస వర్మ కోరారు. ఇప్పటికే ఈ లైన్లు వెంబడి గల పలు సమస్యలను స్టేషన్లో ఆగాల్సిన రైళ్ల జాబితాను ఇవ్వడం జరిగిందని వీలైనంత త్వరగా ఈ ప్రతిపాదనను అమలు చేయాలని మంత్రి కోరారు. అందులో ప్రధానంగా విశాఖ వైపు నడిచే సింహాద్రి ఎక్స్ప్రెస్ ను అత్యవసరంగాఇవ్వాలని సూచించారు. దశాబ్దాలుగా నడిచిన ఈ రైలు తీసివేయడం వల్ల ఈ ప్రాంతంలో స్థిరపడ్డ విజయనగరం విశాఖ వాసులకు చాలా ఇబ్బందిగా ఉన్నదని తెలిపారు. జయప్రదంగా నడుస్తున్న అరుణాచలం ఎక్స్ప్రెస్ ను రెగ్యులర్ ఎక్స్ప్రెస్ గా చేయాలని నరసాపురం నుండి హైదరాబాదుకు వందే భారత్ ఎక్స్ప్రెస్ ను నరసాపురం నుండి బెంగళూరుకు ఎక్స్ప్రెస్ రైలు మంజూరు చేయాలని సూచించారు. ఈ ప్రాంతం నుండి ఈ రైళ్లకు గల డిమాండ్ ను ఆయన వివరించారు. పెరుగుతున్న ప్రయాణ అవసరాల రీత్యా మరిన్ని రైళ్లను మంజూరు చేయడం అవసరమన్నారు. హైదరాబాదు విశాఖ వందే భారత్ ఎక్స్ప్రెస్కు తాడేపల్లిగూడెంలో హాల్ టికెట్ ఇవ్వాలని ప్రధాన ఎక్స్ప్రెస్ రైలు తాడేపల్లిగూడెం అత్తిలి తణుకు వీర వాసరం స్టేషన్లో ఆగేలా చూడాలని నరసాపురం బెంగుళూరు అమృత భారతి స్లీపర్ ఇవ్వాలని మంత్రి కోరారు. నర్సాపురం రాజమండ్రి పాసింజర్ సర్వీస్ పునరుద్ధరించాలని మంత్రి కోరారు. వీటి పై జిఎం సానుకూలంగా స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

## టెన్త్ విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా విద్యాశాఖ ఏర్పాట్లు చేయాలి

### -జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం; మార్చి 6,ప్రభాతవార్త : ఈనెల16వ తేదీ నుండి జరిగే పదవ తరగతి, అపోస్ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు నియమించిన చీఫ్ సూపరింటెండెంట్స్, డిపార్ట్మెంటల్ అధికారులు, కస్టోడియన్స్, రూట్ ఆఫీసర్స్ తో విద్యాశాఖ ఆధ్వర్యంలో భీమవరం డిఎన్ఆర్ కళాశాల ఆడిటోరియం నందు నిర్వహించిన సమావేశానికి శుక్రవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్య అతిథిగా పాల్గొని పదో తరగతి పరీక్షలు నిర్వహణపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ఈనెల 16వ తేదీ నుండి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు ఎస్ఎస్సి పబ్లిక్ పరీక్షలను, అలాగే మార్చి 16 నుండి మార్చి 28 వరకు ఎస్ ఎస్ సి ఆపోస్ పబ్లిక్ పరీక్షలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎస్ఎస్సి పబ్లిక్ పరీక్షలకు 24,166 మంది రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు, అపోస్ పరీక్షలకు 680 మంది రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షలు నిర్వహణకు 132 సెంటర్లను, ఆపోస్ కు 8 సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 132 మంది చొప్పున చీఫ్ సూపర్ఇంటెండెన్స్, డిపార్ట్మెంటల్ అధికారులను, ఐదు మంది అదనపు డిపార్ట్మెంట్లు అధికారులను నియమించడం జరిగిందన్నారు. పరీక్షల నిర్వహణను 6 స్క్వాడ్లు తనిఖీచేయనున్నట్లు తెలిపారు. 2025 సంవత్సరం పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో జిల్లా 82.15 ఉత్తీర్ణత శాతాన్ని సాధించి రాష్ట్రంలో 16వ ర్యాంకులో నిలవడం జరిగిందని, ఈ సంవత్సరం మొదటి ర్యాంకు నిలిచేలా ప్రతి ఒక్కరు




క్రమశిక్షణతో విధులను నిర్వహించాలన్నారు. పరీక్షల నిర్వహణలో చీఫ్ సూపర్ఇంటెండెన్స్, డిపార్ట్మెంటల్ అధికారులదే కీలకపాత్ర అని, పరీక్షల నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లకు తావు లేకుండా పగడ్బందీగా నిర్వహించి జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు. ఎక్కడ మాస్ కాపీయింగ్, పేపర్ లీకేజ్ ఒంటివి జరగకూడదని, కట్టుదిట్టంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఇఓ ఇ.నారాయణ, సమగ్ర శిక్ష ఏపీసి పి. శ్యామ్ సుందర్, ఏడి సత్యనారాయణ, డిప్యూటీ డిఈఓలు, చీఫ్ సూపర్ఇంటెండెన్స్, డిపార్ట్మెంటల్ అధికారులు, కస్టోడియన్స్, రూట్ ఆఫీసర్స్, తదితరులు పాల్గొన్నారు.

# బాణాసంచా నిల్వ కేంద్రాలపై ఎస్పీ ఆకస్మిక తనిఖీలు

జంగారెడ్డిగూడెం మార్చి 6 ( ప్రభాత వార్త) : అగ్ని ప్రమాదాల నివారణే లక్ష్యంగా ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ శుక్రవారం జంగారెడ్డిగూడెంలోని బాణాసంచా హోల్‌సేల్ నిల్వ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఏఎస్పీ సుస్మిత ఆర్, ట్రైనీ ఐపీఎస్ జయ శర్మతో కలిసి పట్టణంలోని పలు గోడౌన్లను నిశితంగా పరిశీలించిన ఎస్పీ, భద్రతా ప్రమాణాలపై యజమానులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా ప్రతి నిల్వ కేంద్రం వద్ద పనిచేసే స్థితిలో ఉన్న ఫైర్ ఎక్స్‌టింగూషర్లు, ఇసుక బకెట్లు, తగినంత నీటి నిల్వలు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు.



అనుమతించిన పరిమితికి మించి స్టాక్ ఉంచరాదని, గడువు ముగిసిన లైసెన్సలను వెంటనే పునరుద్ధరించుకోవాలని ఆదేశించారు. విద్యుత్ వైరింగ్ లోపాలు లేకుండా చూసుకోవాలని, షార్ట్ సర్క్యూట్‌లకు అవకాశం ఇవ్వకూడదని హెచ్చరించారు. గోడౌన్ల పరిసరాల్లో పొగతాగడాన్ని పూర్తిగా నిషేధించాలని, అత్యవసర సమయాల్లో బయటకు వచ్చేందుకు వీలుగా ఎగ్జిట్ పాయింట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవడమే కాకుండా, లైసెన్స్‌లు రద్దు చేసేందుకు సిఫార్సు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు. అక్రమ బాణాసంచా తయారీ లేదా నిల్వలపై సమాచారం ఉంటే డయల్ 112 లేదా జిల్లా కంట్రోల్ రూమ్ నంబర్ 832959175కు తెలపాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎం.వి. సుభాష్, ఎస్ఐ వీరప్రసాద్ పాల్గొన్నారు.

# నూజివీడు ఎగ్జిబిషన్ గ్రౌండ్ దగ్గర అగ్నిప్రమాదం

నూజివీడు మార్చి 06 ప్రభాతవార్త: నూజివీడు పట్టణంలో హనుమాన్ జంక్షన్ రోడ్లు లో ఎగ్జిబిషన్ గ్రౌండ్ పక్కన గల జామాయిల్ తోటలో అగ్ని ప్రమాదం సంభవించింది శుక్రవారం రాత్రి హనుమాన్ జంక్షన్ రోడ్లు భారీ ఎత్తున టపాకాయలు కాలుస్తూ పెళ్లి బృందం ఊరేగింపుగా వెళ్ళటం జరిగింది ఈ ఊరేగింపు వలన ట్రాఫిక్ స్తంభించిపోయింది పోలీస్ అధికారులు కూడా ఈట్రాఫిక్ లో ఇరుక్కున్నారు. సదరు ఊరేగింపులో ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే విధంగా టపాకాయలు కాల్చడం జరిగింది. ఈ కాలుతున్న టపాకాయలు సదరు జామాయిల్ తోటలో పడటంతో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో సదురు జామాయిల్ తోటకు నిప్పు అంటుంది. ఈ విషయం గురించి అక్కడ ఉన్న ప్రజలు విద్యుత్ అధికారులకు ఫోన్ చేయడంతో విద్యుత్ సరఫరా నిలబెట్టడం జరిగింది. అగ్ని అంటుకున్న 45 నిమిషాలకు సదరు నూజివీడు అగ్నిమాపక వాహనం వచ్చి అప్పటికే ప్రజలు కొంతమంది నీటితో ఆర్పి వేసిన తర్వాత సదరు అగ్నిమాపక అధికారులు సదరు ప్రాంతంలో నిప్పురవ్వలు ఉండటంతో కొద్దిగా మంటలు ఉండటంతో నీటితో ఆర్పివేయడం జరిగింది విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ పునర్దించడంతో మంటలను ఆర్పి వేయడంతోఅక్కడ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అక్కడ పెట్రోల్ బంక్ ఉండటంతో ఆ ప్రాంతవాసులు భయభ్రాంతులకు గురయ్యారు. పెళ్లి వివాహాలు వేడుకల ఊరేగింపు ఈ అగ్ని ప్రమాదానికి కారణమైంది. ఏది ఏమైనా స్థానికులు విద్యుత్ అధికారులు



అగ్నిమాపక అధికారులు వెంటనే స్పందించడంతో కథ సుఖాంతం అయింది.

# మైనర్ బాలికపై అఘాయిత్యం

## - ఆర్ఎంపీ డాక్టర్ కు 20 ఏళ్లు జైలు
## - ఏలూరు ఫోక్సు కోర్టు న్యాయమూర్తి తీర్పు

ఏలూరు ప్రభాతవార్త : మైనర్ బాలికను తన క్లినిక్ లోకి తీసుకువెళ్లి అఘాయిత్యం చేసిన ఆర్ఎంపీ డాక్టర్ ఎల్లా రత్న ప్రసాద్ ఏలియాస్ బాబా డాక్టర్ కు ఏలూరు ఫోక్సకోర్టు జడ్జి కానుగుల వాణిశ్రీ నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్ష పదివేలు జరిమానా విధించారు. బాధితురాలుకు ప్రభుత్వం రెండు లక్షల రూపాయలు పరిహారం అందజేయాలని తీర్పులో ఆమె పేర్కొన్నారు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాసరుల అమర శ్రీనివాస్ ప్రాసిక్యూషన్ నిర్వహించగా ఏలూరు ఎస్ డి పి ఓ శ్రావణ్ కుమార్ సాక్షుల్ని సకాలంలో ప్రవేశపెట్టి ప్రాసిక్యూషన్కు సహకరించారు. గత సంవత్సరం ఏప్రిల్ ఏడో తేదీన వెంకటాపురం రామా నగర్ కాలనీలో సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఈ నేరం జరిగినట్లు పోలీసులు తెలిపారు.స్థానిక పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న 8 ఏళ్ల బాలిక ఆడుకుంటుండగా అదే ప్రాంతంలో ఆర్ఎంపీ డాక్టర్ గా పనిచేస్తున్న ఎల్లా రత్న ప్రసాద్ బాలికను బలవంతంగా క్లినిక్ లోకి తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడినట్లు ప్రాసిక్యూషన్ కథనం. బాలిక మేనత్త ఫిర్యాదు మేరకు ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి అప్పటి ఏలూరు రూరల్ ఎస్సై కేడి ప్రసాద్ డీఎస్పీ శ్రావణ్ కుమార్ కేసు దర్యాప్తు చేశారు. కేసును త్వరితగతిన పూర్తిచేసేలా సంబంధిత సాక్షులను ప్రవేశపెట్టి నిందితుడికి కఠిన శిక్ష పడేలా చేసిన ఎస్ఐబి నాగబాబు కోర్ట్ హెడ్ కానిస్టేబుల్ నాగేంద్రబాబు తదితరులను ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ ఈ సందర్భంగా అభినందించారు.

## ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమం



అత్తిలి / గణపవరం మార్చి 6( ప్రభాత వార్త )తాడేపల్లిగూడెం గుడ్ ల్యాంప్- ఆర్గనైజషన్ ఏ పీ నాకో , దిశా , ఆధ్వర్యంలో గణపవరం -3, సచివాలయము హెల్త్, వెల్నెస్ సెంటర్ వద్ద భీమవరం ఐసీటీసీ మొబైల్ వెహికల్ వారు రోగులకు రక్త పరీక్షలు నిర్వహించారు. హెచ్ ఐ వి/ ఎయిడ్స్ పై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలని పీహెచ్ సి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జె .విల్సన్ బాబు కోరారు.ఎయిడ్స్ వ్యాధి రాకుండాఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలిపారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చిన్నచూపు చూడకుండా సమాజంలో కలిసిమెలిసి జీవించే విధంగా సహకరించాలని కోరారు. ఎయిడ్స్ యాక్ట్ 2017 ఏ ఆర్ టి మందులు, యాప్ టోల్ ఫ్రీ నెంబర్ తెలియజేశారు.

## పదో తరగతి ప్రతిభకు ప్రామాణికం



తణుకు, మార్చి 6 ( ప్రభాత వార్త) : జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్‌లో పదవ తరగతి బోర్డు పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థినీ విద్యార్థులను డాక్టర్ రేణుక కలసి వారికి ధైర్యం చెప్పారు. పదోతరగతి ప్రతిభకు ప్రామాణికం అని భారతీయ జనతా పార్టీ అధికార ప్రతినిధి ముళ్ళపూడి రేణుక పేర్కొన్నారు. ఈ సందర్భంగా రేణుక మాట్లాడుతూ పరీక్షలు జీవిత ప్రయాణంలో ఒక ముఖ్యమైన దశ మాత్రమేనని, ఆత్మవిశ్వాసంతో మరియు ప్రశాంతమైన మనసుతో పరీక్షలను ఎదుర్కోవాలని విద్యార్థులకు సూచించారు. పరీక్షల సమయంలో విద్యార్థులు మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు కొన్ని సూచనలు కూడా తెలియజేసారు. విద్యార్థుల విజయానికి తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు అందిస్తున్న సహకారం ఎంతో అమూల్యమని ఆమె అభినందించారు. ప్రతి విద్యార్థి మంచి ఫలితాలు సాధించి తమ కుటుంబానికి, పాఠశాలకు మరియు సమాజానికి గర్వకారణం కావాలని ఆకాంక్షించారు. విద్య ద్వారా సమాజం మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. దేశ అభివృద్ధికి నేటి విద్యార్థులే రేపటి శక్తిగా నిలవాలని ఆమె ఆశాభావం వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా పదవ తరగతి బోర్డు పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థిని, విద్యార్థులకు ఆమె హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## నిర్వాసిత కాలనీకి పర్మినెంట్ వైద్యుడిని నియమించాలి

జంగారెడ్డిగూడెం రూరల్ ప్రభాత వార్త మార్చి 6 : జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి పంచాయతీ పరిధిలోని చల్లవారి గూడెం ఆర్ అండ్ ఆర్ నిర్వాసిత కాలనీలో పర్మినెంట్ వైద్యుడిని నియమించాలని నిర్వాసితులు డిప్యూటీ డి ఎం హెచ్ ఓ సురేష్‌కు వినతి పత్రం అందజేశారు. కాలనీలో సుమారు 800 కుటుంబాలు నివసిస్తున్నప్పటికీ ఇప్పటివరకు శాశ్వత వైద్యుడు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు తెలిపారు. జ్వరాలు, పాము కాట్లు మరియు ఇతర అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు చికిత్స కోసం జంగారెడ్డిగూడెం ఏరియా హాస్పిటల్‌కు వెళ్లాల్సి వస్తోందని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా కాలనీలో నిర్మాణంలో ఉన్న భవనాల కారణంగా అనేక మంది కార్మికులు కూడా అక్కడే నివసిస్తున్నారని,



ఈ పరిస్థితుల్లో అక్కడే పర్మినెంట్ వైద్యుడిని నియమించడం అత్యవసరమని వారు డిప్యూటీ డి ఎం హెచ్ ఓ దృష్టికి తీసుకువచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కాలనీ అధ్యక్షుడు బద్దె ప్రేమ్ కుమార్, సిపిఐ ఎం ఎల్ న్యూ డెమోక్రసీ కార్యదర్శి పెరుమాళ్ల శ్రీను, వైసీపీ జనరల్ సెక్రటరీ పెరుమాళ్ల నరసింహారావు, సెక్రటరీ వరక లక్ష్మణ్, ఎంఎల్ పార్టీ విద్యార్థి సంఘం నాయకుడు కరుటూరి రవి, వైసీపీ సెక్రటరీలు పుట్టి కృష్ణ, సందీప్, పుట్టి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## మైనర్లకు వాహనాలు ఇవ్వటం చట్టరీత్యా నేరం.



ఆగిరిపల్లి మార్చి 6 ప్రభాతవార్త రహదారి భద్రత హెల్మెట్ వినియోగం వలన కలిగే ప్రయోజనాలు గురించి ఆగిరిపల్లి ఎస్ఐ శుభ శేఖర్ వారి యొక్క సిబ్బంది తో కలిసి నూజివీడు రోడ్ లో శుక్రవారంఅవగాహన నిర్వహించినారు. ఈ సందర్భంగా రహదారి నిబంధనలు, అవగాహన కల్పించారు. 100,000/- రూపాయలు పెట్టీ మోటార్ సైకిల్ కొంటారు కానీ 1000 రూపాయలు పెట్టీ హెల్మెట్ కొనుగోలు చేస్తే అది ప్రాణానికి రక్షణ కవచం ల పని చేస్తూంది. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం అనేది కేవలం చట్టం కోసం కాదు, అది వారి ప్రాణ రక్షణ కోసమని ఎస్ఐ చెప్పారు. తల గాయాల నుండి రక్షణ రహదారి ప్రమాదాల్లో సంభవించే మరణాలలో 80% పైగా తలకు తగిలే తీవ్రమైన గాయాల వల్లే జరుగుతాయి అన్నారు. హెల్మెట్ ఈ ప్రభావాన్ని తగ్గిస్తుంది. మెదడుకు రక్షణ ప్రమాదం జరిగి నప్పుడు మెదడుకు షాక్ తగల కుండా హెల్మెట్ ఒక కుషన్ లా పనిచేస్తుందన్నారు. ప్రయాణం లో గాలి, ధూళి, పురుగులు కళ్లలో పడకుండా కాపాడటం ద్వారా వాహనంపై నియంత్రణ కోల్పోకుండా చూస్తుంది. మైనర్ల కు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరం. ఎవరైనా మైనర్లకు బైక్ ఇస్తే, వారిపై మరియు వారి రక్త సంబంధీకు లపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మీరు క్షేమంగా ఇంటికి వస్తారని మీ కుటుంబ సభ్యులు ఎదురుచూస్తుంటారు. మీ ప్రయాణం సురక్షితంగా సాగాలి అని ఎస్ఐ గారు వాహనదారులను కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## అసెంబ్లీ సందర్శించి మహిళా కళాశాల విద్యార్థులు

### ఆత్మీయ ఆహ్వానం పలికిన తణుకు ఎమ్మెల్యే రాధాకృష్ణ

తణుకు, మార్చి 6 ( ప్రభాత వార్త) : తణుకు కొండేపాటి సరోజనిదేవి మహిళా కళాశాల విద్యార్థులు శుక్రవారం అసెంబ్లీను సందర్శించారు. అమరావతిలోని అసెంబ్లీ ఆవరణలో విద్యార్థులకు తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణత ఆత్మీయ ఆహ్వానం పలికారు. శాసనసభను సందర్శించిన విద్యార్థులు అధికారులు, అధ్యాపకుల ద్వారా సభ విశిష్టతను, ప్రజాస్వామ్యం గొప్పతనాన్ని తెలుసుకున్నారు. చిన్న వయసులోనే ఇలాంటి పర్యటన చేయడం ద్వారా విద్యార్థులకు కళాశాల స్థాయిలోనే ప్రజాస్వామ్యంపై అవగాహన ఏర్పడుతుందని ఎమ్మెల్యే రాధాకృష్ణ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



# ప్రతి సమస్యను పరిష్కరిస్తా

## తెదేపా ఇంచార్జ్ వలవల బాబ్జి

తాడేపల్లిగూడెం టౌన్: మార్చి 6 (ప్రభాత వార్త ) : భవన, ఇతర నిర్మాణ కార్మికుల ప్రతి సమస్యను పరిష్కరిస్తానని తెదేపా నియోజకవర్గ ఇంచార్జ్ వలవల మల్లికార్జునరావు (బాబ్జి) తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఆయన అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు, కార్యకర్తల నుంచి వినతులు, ఫిర్యాదులు, అభ్యర్థనలు స్వీకరించారు. ఈ సందర్భంగా వలవల బాబ్జి మాట్లాడుతూ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆకాశపు స్వామి, పట్నాల రాంపండు, దాసరి అప్పన్న, పాతూరి రాంప్రసాద్ చౌదరి, పద్మనాభుని మురళి, ములగాల బాబ్జి, సనగన



శ్రీనివాస్, ముప్పిడి రమేష్ ,ముత్యాల శ్రీనివాస్, కాకర్ల సుభద్ర, వర్రీ వాసు, కిలాడి సాయి, అమలాపురపు వెంకన్న, దల్లె తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

# రూ. 9.85 కోట్లతో మండలంలో రహదారుల విప్లవం!



కామవరపుకోట, మార్చి 6(ప్రభాత వార్త): గత పాలకుల నిర్లక్ష్యానికి తెరదించుతూ, కూటమి ప్రభుత్వం వచ్చిన కొద్ది రోజుల్లోనే కామవరపుకోట మండలాన్ని అభివృద్ధి పథంలో నిలిపామని టీడీపీ మండల అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే రోషన్ కుమార్, ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సంయుక్త కృషితో మండలంలో ఇప్పటికే రూ. 6 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి కాగా, ప్రస్తుతం మరో రూ. 3.85 కోట్లతో పనులు యుద్ధప్రతిపాదికన జరుగుతున్నాయని పేర్కొన్నారు. శుక్రవారం గుంటుపల్లిలో రూ. 80 లక్షలు, వీరంపాలెంలో రూ. 30 లక్షల వ్యయంతో చేపట్టిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన, నాణ్యతలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కొత్తగూడెం- రాజుపోతేపల్లి, కామవరపుకోట- రావికంపాడు వరకు రోడ్డు నిర్మాణాలకు టెండర్లు పూర్తయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కళ్ళచెరువు, రామన్నపాలెం, కామవరపుకోటల్లో బరియల్ గ్రౌండ్ పనులు కూడా ముమ్మరంగా సాగుతున్నాయని వెల్లడించారు. ప్రభుత్వం చేస్తున్న ఈ అభివృద్ధిని, సంక్షేమ పథకాలను కూటమి నాయకులు ప్రతి ఇంటికీ చేరవేసి, ప్రజలకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. గుంటుపల్లి సర్పంచ్ గోరింక దాసు, గ్రామ కమిటీ అధ్యక్షుడు బేతిన వెంకట్రావు, ,బిజెపి బాలవర్ధిరాజు, కొమ్మిన నవీన్ కృష్ణ, గూడపాటి లక్ష్మీనారాయణ, మలకలపల్లి వెంకటేశ్వరరావు, రాజులపాటి లక్ష్మీనారాయణ, పాటిమళ్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## కామవరపుకోట: జంతుశాస్త్రం, అర్థశాస్త్ర పరీక్షలకు 70 మంది విద్యార్థుల హాజరు

కామవరపుకోట, మార్చి 6(ప్రభాత వార్త): మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో శుక్రవారం జరిగిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు సజావుగా, ప్రశాంతంగా ముగిశాయి. జంతుశాస్త్రం-2, అర్థశాస్త్రం-2 మరియు వొకేషనల్ పరీక్షలకు మొత్తం 76 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, వారిలో 70 మంది హాజరయ్యారని, ఆరుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, నిబంధనల ప్రకారం పరీక్షలు పక్కాగా నిర్వహించామని చీఫ్ సూపరిండెంట్ వి. ఆంజనేయులు వెల్లడించారు. ఎక్కడా ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కు తావులేకుండా విద్యార్థులు క్రమశిక్షణతో పరీక్షలు రాశారని ఆయన పేర్కొన్నారు.

# పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలి



అత్తిలి,మార్చి 6( ప్రభాతవార్త) గర్భిణీలు,బాలింతలు,బాలికలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని అంగన్వాడీ కార్యకర్త ఉండ్రాజవరపు రాణి అన్నారు. ఆరవల్లి అంగన్వాడీ కేంద్రంలో ఆరోగ్య పోషకాహారం పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణీలు, శిశువుల తప్పనిసరిగా సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. తల్లిపాల ప్రాధాన్యతను వివరించారు. గర్భిణీలకు అంగన్వాడీ కేంద్రాల్లో అందించే పోలిక్ యాసిడ్ ఐరన్ మాత్రలు తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు. అంగన్వాడి సహాయకురాలు జి విజయ వాణి,గర్భిణీలు, చిన్నారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# పాఠశాల కళావేదిక ప్రారంభం



అత్తిలి, మార్చి 6 (ప్రభాతవార్త )మంచిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో శీతాల సత్యనారాయణ - మాణిక్యం దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు 4 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన కళా వేదిక ను దాతలు ప్రారంభించారు. పాఠశాలలో వివిధ కార్యక్రమాల నిర్వహణకు వేదిక ఎంతో ఉపయోగపడుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.వి.రామారావు తెలిపారు. దాతల సహకారం పట్ల పాఠశాల తరపున కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఏడు గంటలు పవర్ కట్

నరసాపురం ప్రభాతవార్త : 33/11 కేవీ నరసాపురం ఓల్డ్ ఎస్.ఎస్ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో ఉన్న11 కె.వి నరసాపురం టౌన్ 1 మరియు నరసాపురం టౌన్4 ఫీడర్స్ పై 33కెవి ఇంటర్లింకింగ్ వర్కచేయుటకు శనివారం ఉదయం 7:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయ బడుతుంది కావున రాయపేట,మొగల్తూరు రోడ్డు,టాక్సీ స్టాండ్ ఏరియా ,బస్ స్టాండ్ ఏరియా , జనికిలి స్కూల్ ఏరియా దేవుని తోట ,సబ్ కలెక్టర్ బంగాళా ఏరియా , మున్సిపల్ ఆఫీసు రోడ్డు , మూడు బొమ్మల సెంటర్ ,క్రిస్టియన్ పేట, ఏరియాలకు సరఫరా నిలిచి వేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.మధు కుమార్ తెలిపారు వినియోగదారులు సహకరించవలసిందిగా కోరుచున్నాము.

# పిసిసి నేత షర్మిల పర్యటన జయప్రదం చేయండి

## నర్సాపురం నియోజక వర్గ కన్వీనర్ పోలిశెట్టి బాబ్జి

నరసాపురం, మార్చి 6;కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల రెడ్డి ఈనెల 9వ తేదీన పశ్చిమ గోదావరి జిల్లాకు రానున్నారని నరసాపురం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పోలిశెట్టి వీర వెంకట నారాయణ స్వామి (బాబ్జీ) తెలిపారు.. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర లో బాగంగా సోమవారం నాడు కాళ్ళ మండలంలో జరిగే రచ్చబండ కార్యక్రమంలో షర్మిల పాల్గొంటారని ఆయన చెప్పారు.. అలాగే అదేరోజు భీమవరంలో జరిగే బహిరంగ సభలో కూడా షర్మిల పాల్గొంటారని తెలిపారు..ఈ కార్యక్రమంలో నరసాపురం నియోజకవర్గం లోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని బాబ్జీ విజ్ఞప్తి చేశారు.

# దాతల సహకారంతో పశు వసతి గృహం



అత్తిలి మార్చి6(ప్రభాత వార్త )దాతల సహకారంతో అర ఎకరం భూమి సేకరిస్తే ప్రభుత్వం నుండి 10 లక్షలు మంజూరు చేయించి అన్ని సౌకర్యాలతో పశు వసతి గృహాన్ని ఏర్పాటు చేస్తామని జిల్లా జంతు సంక్షేమ సంఘం సభ్యుడు ఆల్తి అజయ్ కుమార్ తెలిపారు. జంతు సంక్షేమం పై తమ సంఘం తీసుకుంటున్న చర్యలను ఆయన తెలిపారు. సబ్సిడీపై పశువులకు దాణా,మేలు రకం గడ్డి విత్తనాలు త్వరలో అందజేస్తామని అన్నారు. వీధి కుక్కలకు వ్యాక్సిన్ వేయించే అంశం కూడా అధికారులతో చర్చించినట్లు తెలిపారు.

## పంచకట్టు వేడుకలకు జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కారాటం సాయి



వేలేరుపాడు, మార్చి 6 (ప్రభాత వార్త ) : వేలేరుపాడు మండల జనసేన ప్రధాన కార్యదర్శి దేవిరెడ్డి సుధాకర్ మేనల్లుడు నాగ వెంకటచరణ్ పంచకట్టు వేడుకలు శివకాశిపురంలోని తన స్వగృహంలో నిర్వహించారు . ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి హాజరయ్యారు. ఆయనతోపాటు పోలవరం నియోజకవర్గంలో ఉన్న మండలాల జనసేన పార్టీ మండల అధ్యక్షులు తోట రవి, మెట్ట బుచ్చిరాజు, గుణపర్తి చిన్ని, ములిశెట్టి యుగంధర్, వెంకన్న బాబు చిరంజీవి లు నాగ వెంకట చరణ్ ను ఆశీర్వదించారు. అనంతరం వేలేరుపాడు జనసేన పార్టీ మండల అధ్యక్షులు గణేశుల ఆదినారాయణతో విందు కార్యక్రమంలో పాల్గొన్నారు . ఈ కార్యక్రమంలో వెలేరుపాడు జనసేన పార్టీ వీర మహిళలు పోడియం తులసి, శ్రీదేవి, జనసేన పార్టీ నాయకులు పొట్ల మోహన్ దొర మంచెల సమ్మయ్య, రాయల రవికుమార్, షాను, కోడూరి నాగు కార్యకర్తలు పాల్గొన్నారు.

## విజ్ఞాన వారోత్సవాల్లో నూజివీడు విద్యార్థినికి జాతీయస్థాయి ప్రథమ బహుమతి



నూజివీడు, మార్చి 06 ప్రభాతవార్త: ఏలూరు జిల్లా కొవ్వలి దెందులూరు మండలంలో జరిగినటువంటి విజ్ఞాన వారోత్సవాలు జిల్లా స్థాయి పోటీల్లో నూజివీడు జడ్పీ గర్ల్స్ హై స్కూల్ విద్యార్థిని అర్చన వకృత్వ పోటీల్లో జిల్లా స్థాయిలో మొదటి బహుమతి సాధించడం జరిగింది డిఈఓ ద్వారా ఈ విద్యార్థి బహుమతి ప్రదానాన్ని అందుకోవడం జరిగింది. పాఠశాలలో జరిగినటువంటి అన్ని రకాల పోటీల్లోను కూడా ఈ విద్యార్థిని ప్రథమ స్థానం, పోటీల్లో నూజివీడుకు చెందినటువంటి బాలికలు 1 కాదు 2కాదు ఏకంగా 4 బహుమతుల సాధించడం అనేది పలువురి ప్రశంసలు పొందడం జరిగింది. ఉపాధ్యాయుల సెమినార్లు కూడా టీ. ఉమామహేశ్వర , పాఠశాల ఫిజిక్స్ ఉపాధ్యాయురాలు జిల్లా స్థాయిలో ద్వితీయస్థానం పొందడం జరిగింది. అదేవిధంగా క్విజ్ పోటీల్లో భాను శ్రీ భార్గవి కూడా తృతీయ స్థానాన్ని పొంది జిల్లా స్థాయిలో మంచి ఫలితాలు సాధించడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుల బి.అనురాధ, ఇతర ఉపాధ్యాయులు పట్టణ ప్రముఖులు అందరు కూడా ప్రశంసలతో ముంచేత్తారు. విద్యాశాఖ అధికారులు వరుస ప్రగతిని సాధిస్తున్నటువంటి పాఠశాల యొక్క ప్రగతిని కొనియాడుతూ విద్యలో రానున్నటువంటి 10వ తరగతి పరీక్షల్లో ఈ పాఠశాల ఉత్తమ ఫలితాలు సాదించాలి అని పలువురు ఆకాంక్షించడం జరిగింది.

## వ్యవసాయ పరిశోధనా స్థానాన్ని సందర్శించిన ఆచంట వేమవరం హైస్కూల్ విద్యార్థులు



పెనుమంట్ర, మార్చి 06, (ప్రభాతవార్త) :ఆచంట మండలం, ఆచంట వేమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం మార్టేరులోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానాన్ని శుక్రవారం సందర్శించారు. పాఠశాల విద్యా ప్రణాళికలో భాగంగా విద్యార్థులకు క్షేత్రస్థాయి అవగాహన కల్పించేందుకు ఈ 'అగ్రికల్చర్ ఎక్స్‌పోజర్ విజిట్' ఏర్పాటు చేయబడింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనుసూరి సత్యనారాయణ నేతృత్వంలో జరిగిన ఈ పర్యటనలో విద్యార్థులు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై విలువైన విషయాలను తెలుసుకున్నారు. పరిశోధనా స్థానంలోని శాస్త్రవేత్తలు డా. పి.వి. రమణ, డా. పి.వి. రమేష్, డా. దయాల్ ప్రసాద్ బాబు జ్యోతుల విద్యార్థులకు వ్యవసాయ రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పుల గురించి క్షుణ్ణంగా వివరించారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం, పురుగుమందుల పిచికారీలో వాటి ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అగ్రికల్చర్ టీచర్ పోచమ్మ వొకేషనల్ టీచర్ వి.నాగభూషణం, ఉపాధ్యాయులు బండి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఆక్వా సాగు చేసే చెరువులన్నీ ఏపి సడా చట్టం కింద నమోదు కావాలి

## అధికారులతో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి సమీక్ష

ఏలూరు, మార్చి 6 ( ప్రభాత వార్త) : జిల్లాలో ఆక్వా సాగు చేసే చెరువులన్నీ 'ఏపి సడా' చట్టం కింద నమోదు కావాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. స్థానిక కలెక్టరేట్ లోని గౌతమీ సమావేశపు హాలులో శుక్రవారం రెవిన్యూ, మత్స్య శాఖాధికారులతో ఏపి సడా చట్టం అమలుపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో ఏపి సడా చట్టం కింద 64 వేల 193 ఎకరాలు నమోదు చేయవలసి ఉండగా, ఇంతవరకు కేవలం 4693 ఎకరాలు మాత్రమే నమోదు కావడంపై అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగిలిన చెరువుల వివరాలను ఏపి సడా చట్టం కింద వెంటనే నమోదుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆక్వా చెరువుల యజమానులు వివరాలను, ఆధార్ అనుసంధానం చేసి 'ఏపి సడా' చట్టం కింద నమోదు చేయాలనీ, ఇందుకోసం అదనపు సిబ్బందిని కూడా డెప్యూటేషన్ పై అందిస్తామని కలెక్టర్ చెప్పారు. సన్న, చిన్నకారు ఆక్వా రైతులకు రుణాలు, రాయితీలు అందించేందుకు ఏపి సడా చట్టం కింద నమోదు తప్పనిసరన్నారు. మండలాల వారీగా ఆక్వా సాగు విస్తీర్ణంను గుర్తించి మత్స్య శాఖాధికారులు సర్వే రెవిన్యూ శాఖాధికారులతో సమన్వయము చేసుకుని నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలని కలెక్టర్ మత్స్య శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ, డిఆర్ఓ వి. విశ్వేశ్వరరావు, నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, మత్స్య శాఖ రాష్ట్ర అధికారి లాల్ మొహమ్మద్, డిప్యూటీ డైరెక్టర్ రాజ్ కుమార్, ఏలూరు, జంగారెడ్డిగూడెం ఆర్డీఓ లు, మత్స్య అభివృద్ధి అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

# ఆరోగ్య పరిరక్షణలో ఫార్మసీ రంగం పాత్ర ఎంతో కీలకం

## ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ క్యాంపస్ ప్రిన్సిపాల్ అశోక్



తాడేపల్లిగూడెం టౌన్ మార్చి 6 (ప్రభాత వార్త ): మానవుని ఆరోగ్య పరిరక్షణలో ఫార్మసీ రంగం కీలక పాత్ర పోషిస్తుందని ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్యాంపస్ ప్రిన్సిపాల్ టి. అశోక్ తెలిపారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం క్యాంపస్ లోని ఫార్మసీ విభాగంలో జాతీయ ఫార్మసీ విద్యా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు ఫార్మసీ విద్యా పితామహుడు మహదేవ్ లాల్ శ్రాఫ్ జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్యాంపస్ ప్రిన్సిపాల్ టి. అశోక్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో మానవుని ఆరోగ్య పరిరక్షణ అత్యంత కీలకమైనదని చెప్పారు. ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు ఫార్మసీ రంగం ప్రధాన పాత్ర పోషిస్తుందని, అలాంటి ఫార్మసీ రంగానికి పితామహుడుగా పేరుందిన మహదేవ్ లాల్ శ్రాఫ్ ను ప్రతి ఒక్కరు స్మరించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఫార్మసీ విద్యార్థులు నైతిక విలువలు, సేవా భావంతో ముందుకెళ్లాలని, ప్రజలకు సేవలు అందించాలని వివరించారు. ఫార్మసీ విభాగం కోర్సు కో ఆర్డినేటర్ ఎస్.లిఖిత మాట్లాడుతూ ఆధునిక వైద్య రంగంలో ఫార్మసీ పాత్ర, ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పరిశోధనలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకురాలు అరుణతో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

# మాకు జీవనోపాధి చూపించండి.

## బొర్రంపాలెం మత్స్యకారుల ఆవేదన



టి నరసాపురం మార్చి 6 ప్రభాతవార్త : తమ జీవనాధారాన్ని దెబ్బతీస్తూ సభ్యత్వాలను అన్యాయంగా తొలగించారని మండలంలోని బొరంపాలెం గ్రామంలోని ముత్యాలంపేటరేవుకు చెందిన వడ్డెర మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం నాడు వారు ఎర్ర కాలువ జలాశయ తీరం వద్ద నుండి తమ నిరసనను తెలియజేశారు. గత 40 ఏళ్లుగా తాము ఈ జలాశయంలో వేట సాగిస్తూ, లభించినచేపలను అమ్ముకునికుటుంబాన్నిపోషించుకుంటున్నామని వారు పేర్కొన్నారు. తమకు మత్స్యకార సొసైటీలో సభ్యత్వాలు లభించాయని, అయితే ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా ఆ సభ్యత్వాలను ఒక వర్గం వారు తొలగించారని బాధితులు వాపోయారు. సభ్యత్వాలు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు అందక, వేటపై ఆంక్షలతోఆర్థికంగా తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు తెలిపారు. మేము తరతరాలుగా ఇదే వృత్తిని నమ్ముకుని బతుకుతున్నామని చేపలను అమ్మి ఇల్లు గడుపుతామని , అటువంటి మా సభ్యత్వాలు తొలగించి మమ్మల్ని వీధిన పడేయడం ఎంతవరకు న్యాయం అని మత్స్యకారులు ప్రశ్నిస్తున్నారు. అయితే బొర్రంపాలెం గ్రామానికి చెందినమరో వర్గం వారు మాట్లాడుతూ వడ్డెర వర్గం వారికి సంబంధం లేదని మా భూములు ఈ ప్రాజెక్టులు పోయాయని 180మందికి పైగా సభ్యులతో మేము కొన్నేళ్లుగా ఇక్కడ మత్స్యకారు వృత్తితో జీవిస్తున్నామని అన్నారు. ఇదిలా ఉంటేముత్యాలమ్మ రేవు/ యర్రకాలువ రిజర్వాయర్ కేంద్రంగా సాగుతున్న రొయ్యల సాగు, తరలింపు వ్యవహారం ఇప్పుడు చిలికి చిలికి గాలివానలా మారుతోంది. ఏ క్షణమైనా ఇరు వర్గాల మధ్య భౌతిక దాడులు మరింత జరిగే అవకాశం ఉంది. ఇటీవలి కాలంలో ఇరు వర్గాల మధ్య జరిగిన దాడులు తీవ్ర కలకలం రేపాయి. ఈ క్రమంలో టి.నరసాపురం పోలీస్ స్టేషన్‌లో ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్న ఘటనలున్నాయి. యర్రకాలువ రిజర్వాయర్‌లో మత్స్యకార సహకార సంఘం సభ్యుల చేపల వేటపై అధికారులు జోక్యం చేసుకోవద్దని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. మత్స్యకార సహకార సంఘం సభ్యులు దాఖలు చేసిన రిట్ పిటిషన్ పై జస్టిస్ వీ.ఎన్. ధర్మాసనం విచారణ చేపట్టింది. రిజర్వాయర్‌లో చేపల వేట కోసం ప్రభుత్వం నుండి లీజు పొందిన తమ కార్యకలాపాలను అధికారులు అడ్డుకుంటున్నారని పిటిషనర్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పిటిషనర్ సంఘానికి యర్రకాలువ రిజర్వాయర్‌లో చేపలు పట్టుకునే చట్టబద్ధమైన లీజు ఉందని, ఈ హక్కులకు భంగం కలిగించేలా అధికారులు వ్యవహరించడం సరికాదని కోర్టు పేర్కొంది. లీజు కాలపరిమితి ముగిసే వరకు, తదుపరి ఆదేశాలు వచ్చే వరకు మత్స్యకారుల వేట హక్కుల్లో అధికారులు ఎలాంటి జోక్యం చేసుకోకూడదని మధ్యంతర ఉత్తర్వుల్లో కోర్టు స్పష్టం చేసింది. దీంతో ఇప్పుడు ఇది చర్చనీయాంశ మైంది.

# మంత్రి అచ్చెన్నాయుడు బేషరతుగా క్షమాపణలు చెప్పాలి

## వైఎస్సార్ సిపి మహిళా జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి డిమాండ్



భీమవరం మార్చి 6 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజుకు మతం అంటగడుతూ మంత్రి అచ్చెన్నాయుడు అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్యంపై దాడి చేయడమేనని వైఎస్సార్ సిపి మహిళా జిల్లా అధ్యక్షురాలు కోడె విజయలక్ష్మి అన్నారు. చైర్మన్ మోషేన్ రాజుపై చేసిన వ్యాఖ్యలపై ఆమె మండిపడ్డారు. శాసన మండలిలో మంత్రి అచ్చెన్నానాయుడు మతపరమైన వ్యాఖ్యలు చేయడం ఆయన అహంకారానికి నిదర్శనమని, మోసేను రాజుపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. దళితులు అంటే చంద్రబాబుకు ఎప్పుడూ చిన్నచూపే అని, ఆయన బాటలోనే ప్రస్తుతం టీడీపికి చెందిన మంత్రులు కూడా దళితుడైన చైర్మన్ మోషేన్ రాజును అవమానించేలా సభలో మాట్లాడుతున్నారని, టీడీపీ మంత్రులు దుర్బుద్ధితో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. శాసన మండలిలో మంత్రి అచ్చెన్నాయుడు ప్రవర్తన హేయమని, టీడీపీ సోషల్ మీడియాలో మండలి చైర్మన్ ను అవమానించేలా పెడుతున్న పోస్టులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. మండలి చైర్మన్ మోషేనురాజుకు మతం ఆంటగట్టడం సరికాదన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, మండలి చైర్మన్ మోషేనురాజు లను క్రిస్టియన్స్ అని మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించడం సబబు కాదన్నారు. రాజకీయాలలో ఇటువంటి చర్యలు మంచిది కాదని, ఇలాంటి వ్యాఖ్యలు వల్ల రాష్ట్రంలో శాంతిభద్రతలు దెబ్బ తినే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు.

# ప్రైమరీ తరగతులు తెలుగులో నడపాలని తీర్మానం పట్ల హర్షం



భీమవరం మార్చి 6ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలుగు భాషకు పెద్దపీట వేస్తూ ప్రైమరీ తరగతులు తెలుగులో నడపాలని అసెంబ్లీ సమావేశంలో తీర్మానం చేయడం పట్ల హర్షం ప్రకటిస్తున్నామని పలువురు వక్తలు అన్నారు. భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో శుక్రవారం శ్రీవిజ్ఞానవేదిక, భీమవరం తెలుగు భాషాభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో హర్షం తెలుపుతూ సమావేశం నిర్వహించారు. తెలుగు భాషాభివృద్ధి కమిటీ సభ్యులు కలిగొట్ల గోపాలశర్మ, చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ దేశంలోనే తెలుగు భాషకు ఒక ప్రత్యేక స్థానం ఉందని, శాసనాలు తెలుగు లిపిలో వ్రాయబడ్డాయని చరిత్ర చెబుతుందన్నారు. తెలుగు భాష కోసం తెలుగు రాష్ట్రము అమరజీవి పొట్టి శ్రీరాముల త్యాగం ద్వారా సాధించుకున్నామన్నారు. ఇంతవరకు ప్రాచీన భాషగా సంపూర్ణంగా గుర్తించని తరుణంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలుగు భాషకు పెద్దపీట వేసి తెలుగు జాతికీ న్యాయం చేసారని, తెలుగు ప్రజలంతా హర్షం ప్రకటిస్తున్నామన్నారు. రాష్ట్ర ముస్లిం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎండి షబీనా బేగం, టిడిపి పట్టణ అధ్యక్షులు మద్దుల రాము, మాజీ కౌన్సిలర్ మైలబత్తుల ఐజాక్ బాబు మాట్లాడూతూ దేశ భాషలందు తెలుగు లెస్స అని రాయలవారే కీర్తించిన గొప్ప చరిత్ర కలిగిన భాష మన తెలుగు భాష అని, ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ గా కీర్తి గడించింది మన తెలుగు భాష అని అన్నారు. తెలుగుభాషను ప్రైమరీ తరగతులు తెలుగులో నడపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తీర్మానించడం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో మాదాసు కనకదుర్గ, నసీమాబేగం, పి రాజబాబు, కొండ్రు శ్రీనివాస్, మల్లువలస రాము, గున్నేశ్వరరావు, మల్లువలస నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

## సర్వేయర్ పిట్ట గోపాల్‌పై దాడిని ఖండిస్తున్నాం

## భూపతిరాజు



పెనుమంట్ర, మార్చి 06, (ప్రభాతవార్త): శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం కోమ్మర్తి గ్రామానికి చెందిన సర్వేయర్ పిట్ట గోపాల్‌రావుపై జరిగిన భౌతిక దాడిని ఆంధ్రప్రదేశ్ అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ భూపతిరాజు రవీంద్రరాజు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం పెనుమంట్రలో మాట్లాడుతూ ఇటీవల రెవెన్యూ ఉద్యోగులపై దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దాడులకు పాల్పడిన వారిపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేసి వెంటనే అరెస్టు చేసి ఉద్యోగులకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా సర్వేయర్ల సంఘ నాయకులపై జారీ చేసిన సస్పెన్షన్ ఆదేశాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం చర్చించి పరిష్కరించకపోతే అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జేసీ ఆధ్వర్యంలో ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు.

## భవన కార్మికుని కుటుంబాన్ని ఆదుకోండి



చాట్రాయి, మార్చి6,ప్రభాతవార్త :ఇటీవల మృతి చెందిన భవన కార్మికుని కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని సిపిఐ మండల కార్యదర్శి కొమ్ము ఆనందం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. చాట్రాయి గ్రామానికి చెందిన బుర్రి జయరాజు (41) ఫిబ్రవరి 23న చనిపోయారని అయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారన్నారు. గత 22 సంవత్సరాల నుంచి తన కుటుంబాన్ని తాపీ పని చేసుకుంటూ జీవిస్తున్నారని కుటుంబ యజమాని చనిపోవడం వల్ల తన కుటుంబం వీధిన పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం భవన నిర్మాణ రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు లోని పథకాలు అమలు చెయ్యలేదని కూటమి ప్రభుత్వం రాగానే భవన నిర్మాణ రంగా కార్మికులకు భరోసాను ఇచ్చిందని సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చిందని చనిపోయిన భవన నిర్మాణ కార్మికుడు బుర్రి జయరాజు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు. మృతి చెందిన కార్మికుని కుటుంబాన్ని ఆనందం శుక్రవారం పరామర్శించారు.

## చిల్లబోయినపల్లి లో వేగవంతంగా సిసి రోడ్ల నిర్మాణం

## మండల పార్టీ అధ్యక్షుడు గద్దె రఘుబాబు



ముసునూరు, మార్చి 06 ప్రభాతవార్త: రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ప్రాతినిధ్యం వహిస్తున్న నూజివీడు నియోజకవర్గం అన్ని విధాల అభివృద్ధిలో దూసుకుపోతుందని ముసునూరు మండల టిడిపి అధ్యక్షులు గద్దె రఘుబాబు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మండల పరిధిలోని చిల్లబోయినపల్లి గ్రామంలో 90 లక్షల రూపాయలకు సిసి అండ్ పిటి రోడ్డుకు ముసునూరు మండల పార్టీ అధ్యక్షులు గద్దె రఘుబాబు గారు గ్రామ సర్పంచ్ రామ్ గిరి , బలివే దేవస్థాన చైర్మన్ శ్యామూలరావు , డిసిసి చైర్మన్ రాపర్ల బాలకృష్ణ కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంత్రి పార్థసారథి 30 సంవత్సరాలుగా అభివృద్ధి నోచుకోని రోడ్లు మొత్తం ఇప్పుడు అభివృద్ధి చేయడం జరుగుతుంది. చెక్కపల్లి గ్రామంలో రూ. 40 లక్షల రూపాయల సిసి రోడ్లకు మండల పార్టీ అధ్యక్షులు గద్దె రఘు బాబు, చెక్కపల్లిలో గ్రామ పార్టీ అధ్యక్షులు కాటేపల్లి సత్యనారాయణ , గ్రామ సర్పంచ్ తల్లిబోయిన రాధిక సొసైటీ అధ్యక్షులు కాటేపల్లి ప్రసాద్, మాజీ జెడ్పిటిసి చిలుకూరి వెంకటేశ్వరరావు , కందుల పిచ్చియ్య , కస్టర్ ఇంచార్జ్ తల్లిబోయిన సత్యనారాయణ, గిరిబాబు కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. మంత్రి పార్థసారథి సారధ్యంలో పల్లెల్లో ఎప్పుడూ లేని అభివృద్ధి ఇప్పుడు జరుగుతుంది రాబోయే 3 సంవత్సరాల్లో డ్రైనేజీలు రోడ్లు మరి కొన్ని నిధులతో పూర్తి చేస్తామని మంత్రి గారు చెప్పడం జరిగిందని పేర్కొన్నారు. గ్రామస్తులు మొత్తం కూడా మంత్రి కి అభినందనలు తెలియజేసుకున్నారు. సూరేపల్లి గ్రామంలో :- - సూరేపల్లి గ్రామపంచాయతీలో రూ. 30 లక్షల రూపాయల గల సిసి రోడ్ల పనులకు మండల పార్టీ అధ్యక్షులు గద్దె రఘుబాబు , గ్రామ పార్టీ అధ్యక్షులు చళ్ళగుల్ల మల్లి బాబు, గ్రామ సర్పంచ్ ముల్లంగి మరియమ్మ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించడం జరిగింది. మంత్రి కొలుసు పార్థసారథి సారధ్యంలో నూజివీడు నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోతుందని చెప్పటంలో ఏ విధమైన సందేహం లేదని పలువురు పేర్కొన్నారు.

# అన్న సమారాధన కార్యక్రమం



కాళ్ల మార్చ్ 6 (ప్రభాతవార్త) : మండలంలోని ఏలూరుపాడు లో మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం పాల్గునమాసంలో శైవాగమ శాస్త్ర ప్రకారం పాంచాహినిక వార్షిక కళ్యాణ మహోత్సవాలు నిర్వహిస్తారని ఆలయ అర్చకులు తెలిపారు. అదే విధంగా ఈ ఏడాది కళ్యాణం మహోత్సవాలు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. దాతలు భక్తులు గ్రామ పెద్దల సహాయ సహకారాలతో కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయ అభివృద్ధికి ఆలయం నిర్వహణకు సహాయ సహకారాలు అందిస్తున్న ప్రతి ఒక్కరికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.